ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

సంపుటము 41 సంచిక 47

ఆగస్టు 10 1949

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY


ఆంధ్రమహిళా బేసిక్ ట్రెయినింగ్ స్కూలు: తిరువూరు (కృష్ణా)



కృష్ణాజిల్లా తిరువూరులో బేసిక్ ట్రెయినింగ్ పాఠశాల



బేసిక్ ట్రెయినింగ్ స్కూలు : కుట్టుపని తరగతి




జూనియర్ బేసిక్ గ్రేడ్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు



పాఠశాల స్థాపకురాలు ప్రధానోపాధ్యాయిని అయిః తి శ్రీమతి ఆర్. లీలావతి బి. ఏ. బి. టి., ఉపాధ్యాయిని వై. దమయం. బి. ఇ. డి., ఉపాధ్యాయుడు వై. బి. రాజు బి. ఎ. ఎల్. టి. గారలు



పొలంపని చేస్తున్న జూనియర్ బేసిక్ గ్రేడ్ విద్యార్థినులు: ఉపాధ్యాయవర్గం



నూలువడుకు తరగతిలో విద్యార్థినులు : ఉపాధ్యాయవర్గం

ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగుదా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.


Founder: K. NAGESWARA RAO

విరోధి సంవత్సర శ్రావణ బహుళ విదియ బుధవారము



“మాధురిదేవి”

“కన్నియన్ కాదలి” తమిళ చిత్రంలో



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ నెల ఆగస్టు 10-వ తేది బుధవారము

పౌరస్వాతంత్ర్యము

నేడు దేశములో పౌరహక్కులకు ప్రమాదము ఏర్పడినదని గగ్గోలు చేయుట కాంగ్రెసు ప్రతికూల పక్షము లన్నిటికి పరిపాటి అయినది. కేవలము కాంగ్రెసు ప్రభుత్వములపైన గల ఈర్ష్య తప్ప వారి ప్రచారమునకు ఆధార మేమాత్రము లేదని సహృదయు లందరికి గోచరింపక మానదు. తాము అధికారమునందున్న ప్రతికక్షులకు నేడు తాము అనుభవించుచున్న వాక్స్వాతంత్ర్యములో ఆవగింజఅంత అయినా లభింపచేయుదు రన్నది అనుమానము. వారి పరిపాలన కేవలము నియంతృత్వము తప్ప ప్రజాప్రభుత్వలక్షణము లున్నవి యుండవు. నేడు దేశమున ఏర్పడిన అవాంతరపరిస్థితులను పురస్కరించుకొనే ప్రభుత్వము కొన్ని అసాధారణచర్యలను తీసికొనవలసివచ్చినది. ఈపరిస్థితి సమసిపోవుటకు తోడ్పడుటకు బదులు అది మరింత తీవ్ర మవుటకు ఈ పక్షములు దోహద మొనగుచున్నవి. పౌరస్వాతంత్ర్య మటు లుండగా అసలు ఏవిధమైన స్వాతంత్ర్యము అభివృద్ధి చెందుటకు వారి ప్రచారము తోడ్పడజాలదు. పౌరస్వాతంత్ర్యమును గురించి కంఠము చించుకొనుట తప్ప, ఇతరులు ఎవరైన సమావేశములు సభలు జరుపుకొనిన వాటిని దౌర్జన్యముతో చెదరగొట్టుట, ఆ సభలకు వెళ్లవద్దని హెచ్చరికలు చేయుట వారి దృష్టిలో పౌరస్వాతంత్ర్యముగనే కనుపడుచున్నది. భారత ప్రధాని పండిత నెహ్రూ కలకత్తాకు వెళ్లినప్పుడు కాంగ్రెసు ప్రతికూలపక్షము లన్నియు ఏకమై ప్రధాని ప్రసంగించవలసిన సభను బహిష్కరించవలసినదని ప్రచారము చేసిరి. ఆ సభలో బాంబు కూడ వేయుట జరిగెను. ఇలాంటివా రందరు పౌరస్వాతంత్ర్యమును గురించి మాట్లాడుట పండిత నెహ్రూ చెప్పినట్లు అర్థములేని కపట ప్రచారము. ఇతరుల స్వాతంత్ర్యమును అరికట్టుటకు వీ లున్నపుడే తమకు పౌరస్వాతంత్ర్య మున్నట్లు వారి అభిప్రాయము. ఈ స్వాతంత్ర్యస్వరూప మెట్లుండునో వేరుగా చెప్పనవసరము లేదు. అక్కడక్కడ ప్రజలకు దానిరుచి తెలియు ననే యున్నది. పండిత నెహ్రూ బోధపరిచినట్లు "స్వాతంత్ర్యమును దానితోపాటు దేశభద్రతను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వమున కున్నది. ఈ రెంటి నిర్వహణకు తరచు సంఘర్షణ రాగలదు. అయితే అవాంతరపరిస్థితి ఏర్పడిన సమయమున దేశభద్రతను కాపాడుటే ఎక్కువ అవసరము."

దేశక్షేమమును కాంక్షించు సహృదయు లందరు సహకరించి సమష్టిగా పాటుబడుట నేడు అత్యవసరము. అంతే కాని ఏ ఒకపక్షతత్వమును అనుసరించి తద్వారా దేశసమస్యలను పరిష్కరించుట క్షేమప్రదము కాదు. అందువల్లనే కాంగ్రెసుకు బలాధిక్యత యున్ననూ ఏకపక్ష ప్రభుత్వమును స్థాపించక ఇతర పక్ష ప్రతినిధులనుకూడ కేంద్ర ప్రభుత్వములోనికి తీసికొనినది. ఇంకనూ ఇతర పెద్దలను తీసికొన సిద్ధముగా నున్నట్లు పండిత నెహ్రూ తెలియజేసెను. రోజురోజూ ప్రగల్భములు పలుకుచున్న సోషియలిస్టులను కూడ ఇదివరకు ఆహ్వానించెను. కాని వారు తిరస్కరించిరి. ప్రభుత్వబాధ్యత వహించుటకన్న కాంగ్రెసును, కాంగ్రెసు ప్రభుత్వములను విమర్శించుటే వారికి సులువైన వ్యాసంగముగ నున్నట్లున్నది! కాకపోయిన ప్రజలకన్న తమపార్టీయే ఎక్కువ ముఖ్యమని తలంచియుండవచ్చును. ఈ మధ్య పండితనెహ్రూ సోషియలిస్టు పక్షములో చేరవలెనని శ్రీ జయప్రకాశ నారాయణగారు సూచించిరి. ఈ విధముగ కాంగ్రెసును చీలదీసి దానిని నిర్వీర్య మొనర్పవలెనని వారి వ్యూహ మేమో తెలియదు. లేక నెహ్రూపైన జాలియో!

ఇతర విషయములందు ఉత్తరదక్షిణధ్రువములంత దూరస్థులైనప్పటికి, పండిత నెహ్రూ చెప్పినట్లు అధికారకాంక్షయందు, దౌర్జన్యవిధానమునందు రాష్ట్రీయస్వయంసేవకులు, కమ్యూనిస్టులు సన్నిహితులు. కలకత్తా ఎన్నికలందు కాంగ్రెసు అభ్యర్థిని ఓడించుటలో వీరిద్దరు ఏకమైరి కూడ. స్వయంసేవక సంఘముపై నిషేధమును తొలగించినప్పటికి వారిని ఒక కంట కనిపెడుతున్నామని పండిత నెహ్రూ తెలిపెను. అయితే కమ్యూనిస్టుల విషయమున ప్రభుత్వము అవలంబించదలచిన విధానమును స్పష్టము చేయ లేదు. ఈ సందర్భమున కేంద్రప్రభుత్వవైఖరి సందిగ్ధముగనే యున్నది. "బహిరంగముగా దౌర్జన్యములను, హత్యలను, విధ్వంసక చర్యలను ప్రోత్సహించుచు వారు కరపత్రములను ప్రకటించినపుడు వారి విధానము కేవలము అశాంతిని కలుగచేయుటే అయినపుడు ఆ పక్షమును నిషేధించుటకు సందేహించవలసిన అవసరము కనుపడలేదు." కమ్యూనిస్టులు తమ కార్యక్రమము విఫల మవుటవల్ల దానినిగురించి ఏమి చేయవలెనో ఆలోచించునట్లు పండిత నెహ్రూ తెలిపెను. ఆ ఆలోచన పూర్తి అయి నిర్ణయమునకు వచ్చువరకు కేంద్రప్రభుత్వము వేచి యుండదలచిన దేమో తెలియదు.

స్టర్లింగు ఒప్పందము

స్టర్లింగు నిలువల విడుదల గురించి ఈమధ్య భారతదేశమునకు బ్రిటనుకు జరిగిన ఒప్పందము గురువారంనాడు ప్రకటిత మైనది. భారతదేశపక్షమున ఒప్పంద రాయబారములు జరిపిన భారత ఆర్థికమంత్రి డా॥ మత్తాయిగారు ఒప్పందలక్షణములను విశదీకరించిరి. ఆయన చెప్పినట్లుగ ఈ ఒప్పందము ఇదివరకు చేసికొనిన ఒప్పందము కంటె మెరుగైనదని చెప్పవచ్చును. ప్రస్తుత పరిస్థితిలో ఇంతకన్న ప్రయోజనకరమైన ఫలితమును సాధించుట సాధ్యము కాదనుటలో అతిశయోక్తి లేదు. రెండుదేశములు ఆర్థికలావాదేవీలను పరిష్కరించుకొనునపుడు ఉభయుల సౌకర్యములను, అవసరములను గమనించవలసి యుండును. ఋణదాత సామాన్యబాకీదారుని వత్తిడి చేసినట్లు అప్పిచ్చిన దేశము, అప్పుతీసికొనిన దేశమును వత్తిడిచేయ వీలు లేదు. ఆ దృష్టితో ఈ ఒప్పందమును పరిశీలించిన అసంతృప్తి చెందనవసర ముండదు. బాకీ ఉన్న స్టర్లింగుమొత్తములో కొంత తగ్గించవలెనని బ్రిటిషు ప్రముఖులు కొందరు సూచింపసాగిరి. బ్రిటిషుప్రభుత్వము మాత్రము ఆ విషయమును సూచించలేదు. మొన్న జరిగిన సంభాషణలందు కూడ ఆ ప్రసక్తి రాలేదట. కాబట్టి ఇంతటితో ఈ సమస్య ఆగిపోయినదని ఆశించవచ్చును.

"మన డాలరువ్యయము అతి జాగ్రత్తగ పరిశీలించి ఆ వ్యయమును తగ్గించుకొనవలెను. డాలరుప్రాంతములనుండి మనము చేయు దిగుమతులను తగ్గించుకొని ఆ ప్రాంతములకు ఎగుమతులను ఎక్కువ చేయవలెను. మనకు అందరికన్న ఎక్కువ స్టర్లింగు నిలువ లున్నవి. అందువల్ల స్టర్లింగు బలము స్థిరత్వము చెదరకుండ చూచుట మనకు ప్రయోజనకరము. స్టర్లింగుప్రాంతమున కున్న డాలరు నిలువల ప్రమాణముమీదనే స్టర్లింగు బలము స్థిరత్వము ఆధారపడియున్నవి." అని ఆర్థికమంత్రి జాన్‌మత్తాయిగారు తెలిపిరి. దానివల్ల సమస్యయొక్క అర్థము వెల్లడి అయినది. స్టర్లింగును కాపాడుట భారతదేశమునకు అవసరమవుట అటు లుండగా భారతదేశము తోడ్పడినగాని దానిబలము నిలువజాలదు. అందువల్లనే భారతదేశమును పూర్తిగా స్టర్లింగుప్రాంతదేశముగా పరిగణించుటకు అంగీకరించియుండవచ్చును. అలా చేయుటవల్ల భారతదేశమునకు లాభము లేకపోలేదు.

ఇదివరలో భారతదేశము డాలరు నిలువలకు తోడ్పడుచుండెడిదిగాని వాటి వాడకము పరిమితముగ నుండెడిది. డాలరులోకి మార్చుకొను స్టర్లింగునిలువల ప్రమాణము బ్రిటను అవసరమునుబట్టి పరిమిత మవుచుండెడిది. ఇపుడా పరిమితి సడలింపబడినది. అయితే దానితోపాటు భారతదేశము 1948 సం॥ మార్చిలో అంతమైన ఏడాదిలో డాలరుప్రాంతమునుండి దిగుమతులు చేసికొనిన మొత్తములో 4-వ వంతు 1950 సం॥లో తగ్గించుకొనుటకు అంగీకరించినది. అయినప్పటికినీ కూడ భారతదేశమునకు 140 మిలియనుల డాలర్లు లోప మేర్పడును. ఆ మొత్తమును స్టర్లింగుప్రాంతములోని డాలరునిల్వలనుండి సర్దబడును. భారతదేశముమాత్రము తాను సంపాదించిన డాలర్లను ఈ నిల్వలకు జమకట్టవలెను. అలా సంపాదించగల డాలర్లు ఎక్కువగా యుండవని ఊహించుటమువల్ల ఈ పద్ధతి అనుకూలమైనదిగా ఎంచబడుచున్నది. ఈ ఏర్పాటునుబట్టి భారతదేశము 140, 150 మిలియనుల డాలర్లను ఉపయోగించుకొనవచ్చును. అంతర్జాతీయబ్యాంకు, అభివృద్ధినిధులనుండి వచ్చు అప్పులపై మొత్తమును ఉపయోగించుటకు అభ్యంతరముగ నుండవు. ఇదివరకు భారతదేశమునకు డాలరునిధినుండి కేటాయింపబడినది 60 మిలియనుల డాలర్లు మాత్రమే. ఇపుడు 140 మిలియనుల డాలర్లు. ఈవిషయము ఏడాది అయిన తరువాత పునః పరిశీలింపబడును.

డాలరునిధినుండి వాడుకొనుటకు ఏర్పాటు అవుటే గాక, 1948-49 సం॥కు 81 మిలియను పౌనులను భారతదేశము వాడుకొన ఏర్పాటయినది. అంతేకాక 1950-51 సం॥ములకు అదివరకు ఏర్పాటయిన 40 మిలియనుపౌనులు 50 మిలియనులకు పెంచబడినది. దీనితోపాటు అదివరకు దిగుమతులైనవాటికి కావలసినంత మొత్తము ఇచ్చుటకు ఒప్పందము జరిగెను.

డాలరుప్రాంత దిగుమతులను తగ్గించుకొన కామనువెల్తురాజ్యము లన్నియు అంగీకరించినవి. కాబట్టి వారందరు కలిసి పరస్పరము సహకారము

నవల

సాతీబాలి

వి.డి. ప్రసాదరావు

౨

ఆమర్నాడు పెండ్లిచూపులకని రాఘవరావు బయలుదేరక తప్పింది కాదు. అతను అభ్యంతరం చెప్పిన దేమీ లేదు కాని అభ్యంతరం చెప్పటానికి తండ్రి అతన్ని అడిగింది ఏమీ లేదు. తను కుమారుణ్ణి అడగటం, జ్ఞానీ కాదనీ అతను అనటం, ఇల్లాంటి సంప్రదింపుల ప్రమేయమే మీ ఆ తండ్రి ఆలోచనలోకి రాలేదు ఆఫీసుకు వెళ్లబోతూ, ఆచుట్టంతో, అంటున్నాడు "సరే ఇవాళ వాడినే వెంట తీసుకెళ్లవోయి. పిల్లను వాడు చూసుకొంటాడుగా; మా అందరి తరఫున చూసేందుకు నువ్వే ఉన్నావు"

"పోనీ అక్కయ్య కూడా బయలుదేరి వస్తుంది లేవయ్యా-!"

"ఆ, ఏం అక్కర్లేదు. అయినా ఈ చూసుకోటా లేమిటి! నువ్వు చెప్పావుగా సంప్రదాయంమంచిదే నని ? వాడికైనా పంపించాల్సిన అవసరమే లేదు. ఏదో వాళ్ళ అమ్మమనీ పోరుపెట్టుతూంది పిల్లవాడికి నచ్చాలని ఆయన గారికి నచ్చేందుకు మేం అంతా చూసట మెందుకులే!" ఎవర్నీ ఈసడించటం కాని ఈసడింపుగా చిరునవ్వు నవ్వాడు.

"మీరు చూసినట్టే, అనుకో బావా! పిల్ల ముత్యంలా గుంటుంది. వాడికి నచ్చి తీరుతుం దిలే అల్లాంటి సంబంధము కాకపోతే నేను తీసుకొస్తానా !"

"సరే లే! నేను వెళ్తాను నాకు వేళ దాట్తూంది; నేను చెప్పిన వాటిల్లో తఫావతు లేమీ రానీయక. వాడిని ఎల్లుండి చూపులవగానే పంపించెయ్యి. మళ్ళీ నువ్వెప్పుడు కనబడ్తావు?"

"తఫావతు లేమీ రానీయనులే ఇదిగో, పిల్లా పిల్లాడూ ఒక ర్నొకరు చూసుకోటం అయితే, వాడువచ్చేస్తాడు. నేను వాళ్లను తీసుకొని పది రోజుల్లో మళ్లీ బయలుదేరి వస్తాను."

"ఏమో! ఈభారమంతా నీమీగ పెట్టున్నాను నే వెళ్ళొస్తా" - అంటూ తండ్రి ఆఫీసుకు వెళ్ళిపోయాడు ఈ పెళ్లిలో కొడుకు నిమిత్తమాత్రుడే తప్ప అతని అభిప్రాయాల జోక్యం ఉన్నట్టే తండ్రి భావించటంలేదు. వాగ్రూపంగా, ఇదమిత్థమని సంభావణ ఏదీ తండ్రి లేకుండా, తను ఏమనీ చెప్పటం ల్లోగో, రాఘవరావుకు తెలియలేదు.

"పెళ్లికి అభ్యంతరం చెప్పేందుకుముందు సాకులు దొరక్కపోతాయా! ఇప్పటినుంచే రభస చేసుకోటం ఎందుకని" మనస్సుకు నచ్చచెప్పుకొని రాఘవరావు ఆ మామతో కలిసి బయలు దేరాడు.

రాఘవరావుకు మునుపెప్పుడూ ఆ మామను చూసిన జ్ఞాపకం లేదు. ఆయన తండ్రికి తనకూ మధ్యవయస్సున ఉన్నాడు. తనను అంతకు ముందెప్పుడూ చూసిఉండకపోయినా, "ఏరా! అబ్బాయి! రాఘవా" అంటూ అతిచనవుగానే, చిన్ననాటినుంచీ పెంచిన మేనమామలాగే అతి సన్నిహితంగా సంభాషణ సాగిస్తున్నాడు. తన తండ్రి ఆర్థికపరిస్థితి అంతకుముం దెప్పుడూ రాఘవరావుకు సరిగ్గా తెలియదు; తనకన్నా ఎక్కువగా తమ ఆస్తిపాస్తులు, ప్రస్తుత ఆర్థిక స్థితీ అన్నీ అతను చెబుతున్నాడు తండ్రి పరిస్థితులు చాలా విషమంగా ఉన్నాయి. వచ్చే ఏటినుంచి మూడొందల రూపాయలు పించను మించి రాబడి ఉండదు ఉన్న పొలంకాస్తా తణఖాలలో అప్పులలో ఉంది. ఎప్పుడో ముందే జాగ్రత్తపడి ఉంటే ఐదారు ఎకరాలైనా మిగిలి ఉండేదేమో. రాఘవరావును స్కూల్ ఫైనలుతో చదువు ఆపి, కోర్టులో ఏ అమీనాఉద్యోగంలో అయినా చేర్పించిఉంటే బాగుండేది తలకు తగని బరువు నెత్తికెత్తుకొన్నాడు తీరా చదివాకైనా మన వైపుల పనికివచ్చే చదువులాగ లేదు. ఏదో ఈ పెళ్లిలో కాస్త కట్నం సరిగ్గా కలిసి వస్తే, తాత్కాలికంగానైనా తేరుకోగలుగుతాడేమో పిల్లతరఫువారిది పెద్ద కుటుంబము. కట్నంగా పెళ్లిలో రాబట్టుకోగలిగేది ఎంతో అంత తప్ప తర్వాత అక్కడినుంచి అట్టే గిట్టే ఎత్తు కనబడదు అయినా ఏమోలే - అదృష్టం బాగుంటే—

ఆ ధోరణిలో మామ మాట్లాడుకుపోతున్నాడు కట్నం పుచ్చుకోటానికి ఎంత పూర్వాపరాలుగా, వరుని కుటుంబంబ్రతుకు ముడి పెట్టబడి ఉందో అంతకుముం దెప్పుడూ అతను ఊహించలేదు. కట్నంపేరు చెప్పితే, "ఛీ! ఛీ!" అనే నవీనఆశయాలమధ్యే పెరిగాడు. ఆ మాదిరిగానే తనూ కట్నంవిషయం త్రోసి వెయ్యగల వనే అనుకొన్నాడు. కాని ఇప్పుడు ఆ విషయం కదపటం అంత తేలిక వ్యవహారంగా కనుపించటం లేదు. ఈనాడు కుమారుని చదువుకూ సంసారానికీ ఋణాలూ పణాలూ చేసి, భవిష్యత్తుకు పెట్టుబడిగా తండ్రి భావించుకొన్నాడు ఆయన చేసిన పనులన్నీ తను ఆయన కోరినట్టుగా వ్యవహరించగలిగితేనే కూడివచ్చి, సమంగా పరిణమిస్తవి. తను మొరాయించి పక్కకు తొలగితే, ఆ కుటుంబనిలకడకు తండ్రి అమర్చిన సీలలన్నీ విరిగిపోయి కుటుంబం చితికి కూలిపోవలసి వస్తుంది.

రాఘవరావుకు, మామ మాటలు వింటూన్నంతసేపూ, తనకుటుంబవ్యవస్థా, దానిలో తండ్రి తనకుంచిన కీలకస్థానమూ, తననుంచి కుటుంబమూ, సంఘమూ అపేక్షిస్తున్న, బాధ్యతలూ, అన్నీ మనస్సులో భూమికగా అలముకొని, వాస్తవిక పరిస్థితులపంకంలో దింపి ఉక్కిరిబిక్కిరి చేసి బాధపెట్టున్నాయి. కాని తను తప్పించుకొందామన్నా వీలు లేనంత సుస్థిరంగా తన స్థానం అక్కడ పాతుకొని పోయి కాలుసే యాడనీయనట్లుంది. అసహాయ స్థితిలో పరిస్థితులు మననం చేసుకొంటూ, మామధోరణిలోనుంచి, శ్రవణేంద్రియాన్ని తప్పింటుకొంటున్నాడు.

మామఊరువెళ్లటానికి రెండు బస్సులుమారాలి ఆతర్వాత కాలవవద్దునే మైలుదూరం నడవాలి ఆఊరికి రెండు క్రోసులదూరంలో పెళ్లికూతురు వారి ఊరు ఉంది. పెళ్లిచూపులకు వచ్చినట్లు కబురు చేయగానే రేపో ఎల్లుండో వాళ్ళు బండి పంపుతారు"

బస్సుప్రయాణంలో వళ్లు హూనమైపోయినట్లుంది. కాలవవెంట ప్రయాణం సాగించాక కొంత ప్రాణం తేరుకొన్నట్టుంది. ఆ కాలువ పొడుగునా చెట్లవరుస, ఇరుప్రక్కలా పొలాలూ, దూరాన భూమిఅంచులను చుట్టూ కుంగదీస్తున్నట్లు కొండలబారు, కూతవేటు దూరాల మాత్రంలో చెదరుగా గూళ్లు కట్టుకుని కనబడే చిన్నిచిన్ని పల్లెటూళ్లూ—బస్సు రాపిడిలో ఇరుకున పడి నలిగిపోయిన కళ్లనూ మనస్సునూకూడ సేద తేరుస్తున్నట్టుంది ఆ విశాల ప్రకృతిచిత్రం. అక్కడక్కడ అప్పుడే దున్నిన పొలాల చాళ్లు కొండచివరలదాక ఎగబ్రాకి పోతున్నట్లున్నాయి.

దోవలో ఒకటి రెండు దుక్కిటెడ్ల జతలు నాగళ్లతో ఇళ్లదిక్కులకు మరలుతున్నాయి. ఆ పాలేళ్లను పల్కరిస్తూ, మామ వ్యవసాయ జీవితపు దినకృత్యవార్తలతో సంభాషణలు సాగించుకొంటూ పోతున్నాడు. బాటప్రక్కనుంచి ఒక పెద్ద పుంత చీలి పొలాలమధ్యనుంచి పొదలు అంచుకట్టుకొని పోతూంది.

"ఈ పుంతను పోవాలా మనము?"

"అబ్బే కాదు! మనఊరు 'ఇంకా ఎగువను."

ఆ పుంతను పోతే వచ్చే ఊరుపేరు చెప్పాడు మామ. ఎక్కడో విన్నపేరులా గుంది.

మామఇంటికి చేరుకొనేటప్పటికి ప్రొద్దు గూకింది

"అల్లుడొచ్చాడేవ్" అంటూ ఇల్లాలును కేకలేసి, వీధి అరుగుమీద చతికిలబడి మామ చుట్ట పొయ్య తీశాడు.

ఒక యువతి వీధి గుమ్మంలోకి వచ్చి తొంగి చూసి భర్త, ఈ కుఱ్ఱవాడే తప్ప ఇతరు లెవరూ లేకపోవటం చూసి, గుమ్మం ఇవతలకు వచ్చి, రాఘవరావును పరకాయించి చూస్తూ "ఎవరబ్బాయి?" అని అడిగింది

మా అప్ప లక్ష్మమ్మకొడుకే! ఎప్పుడూ చూడలే?"

ఆ విడదో వింతగా మొగంపెట్టి సరాగంగా "ఎప్పుడైనా చూడటానికి నన్నెక్కడికైనా తీసి కెళ్లారు గనుకనా! మావాళ్లు మావాళ్లు అంటమేగాని, రాకపోకలన్నా ఉండరాయె" అని దీర్ఘాలు తీసింది.

రాఘవరావు తల వంచుకొని మట్టి అరుగుల ప్రక్కకు చేరాడు

"కూర్చోరా! వాడుకి కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు ఇచ్చి అరుగుమీద చాపవెయ్యవే కూర్చోరా - నే నిప్పుడే అటు కాలవగట్టుకు వెళ్లివస్తా."

కాళ్లూ చేతులు కడుక్కుని రాఘవరావు అరుగుమీద కూలబడ్డాడు. మామచొక్కా ఖండువా అన్నీ లోపల పడేసి, ఒక కొల్లాయి పైన వేసుకొని, "ఇప్పుడే వచ్చేస్తారా కూర్చొని ఉండు. ఏమేవ్ వాడి కేం కావాలో చూడు" అంటూ కాలవగట్టున పొలాలకేసి వెళ్లిపోయాడు.

"ఇప్పుడే వస్తా" అంటూ ఆవిడకూడా లోపలికి వెళ్లిపోయింది.

బాగా చీకటిపడిపోతూంది. ఎవరో పాలేరు, సరాసరి లోపలికి పోయి, తట్టా పలుగు అవీ పాకముందు సావిట్లో సర్ది వైటికి వచ్చి గుమ్మంలో నిలిచాడు అతను వచ్చినట్టూ వెళ్తున్నట్టూ ఆలనే ఉన్నట్లు కనబడలేదు రాఘవరావుకు..

"నరసయ్యగారు ఏమాతాడు?" అన్నాడు పాలేరు యాదాలాపంగా—

"మా మామయ్య" అన్నాడు ముభావంగా రాఘవరావు.

"వెంకా! లాంతరు వెలిగించావా!"

ఆ లన లేదనుకున్నాడు. కాని ఆవిడ లోపలినుంచే ఆతని రాకపోకలు అలవాటుగానే కనిపెట్టే ఉంది.

"ఎలిగిత్తా! వంకాయలు సావిట్లో పడేశా. ఇంకేమన్నా కావాలేమోనని అడిగి కోమటింటినుంచి తెమ్మన్నాడు అయ్యగోరు. సాంయత్రం పడేదాకా ఆగాడే!"

"పొలంలో కనబడ్డారా?"

"ఆ! అటు కాలవకేసి ఏళ్తుండారు, ఎనకమాల నల్లసెక్కపొలం దున్నటం కాలేదట. అదికూడా సూసుకొని వత్తానన్నాడు"

"సరేలే! ఇప్పుడో తెమిలినట్టే! నువ్వు లాంతరు వెలిగించి తొట్లలో నీళ్లు తోడి వెళ్లు."

పాలేరు లాంతరు వెలిగించి సావిట్లో పెట్టి బైటికి పోయాడు

"లోపలికి రావోయ్ కాఫీ తాగుదుగాని," అంటూ ఆవిడ గుమ్మంలోకి వచ్చింది.

"ఇప్పుడు కాఫీ ఏమిటి! వద్దండీ - అన్నం తినబోతున్నానుగదా?"

"అంత మొహమాట మేమిటోయ్ - అంతేగిండీ ఏమిటి - దా అల్లుడి బెట్టు చేయక తాగుదుగాని రా పల్లెటూరి కాఫీయైనా తాగవచ్చునులే - మాకూ ఇక్కడ కాఫీ అలవాటుంది"అంటూ ఆమె నాగరికత వెలిబుచ్చుతోంది.

ఆవిడ శ్రమపడి తయారు చేశాక ఇప్పుడు కాదని మొరాయించటం బాగుండదని కిమ్మనకుండా లోపలికి వెళ్లి తాగాడు. కాఫీకి, కాఫీ రుచి లేదు. పాల చిక్కదనమే ఎక్కువ ఉంది. కాస్తా కూస్తా కాకుండా, పెద్దగ్లాసెడు ఎదుట పెట్టింది బెల్లలకాఫీ, పాలచిక్కదనం, తీపి, తప్ప కాఫీరుచే లేదు.

ఆవిడ అతిచనువుగా మాట్లాడుతోంది. నిజానికి తనకంటె చిన్నవయస్సుదేమో నన్నట్లుగానే కనిపిస్తూంది కాని పోకడ, మాట తీరు, హుందాతనం అంతా తనకన్నా, చాలా పెద్ద దానిలాగా అలవర్చుకొని మాట్లాడుతోంది.

అతనికి ప్రభావతి స్ఫురణకు వచ్చింది. ప్రభావతి తన కన్న పెద్ద. కాని ఈడు తగ్గించుకొని ముగ్ధకన్యలాగే తనతో ప్రసంగంలో వ్యవహరించేది.

ఆవిడ తన ఇంటి విషయాలన్నీ అడుగుతోంది తమ బంధుగుల విషయాలన్నీ, చెపుతూంది మాటలో కాని, చేతలో కాని ఏమీ కొత్తమనిషితో మాట్లాడుతూన్నట్లు ఎబ్బెరికం కాని కొత్తగాని లేకుండా, చిన్ననాటినుంచీ ఎరిగున్నవాడినిలాగే చూస్తూ మాట్లాడుతూంది

ఆతర్వాత వంటకు ఉపక్రమించేందుకు చిన్నబట్ట కట్టుకొని కూడా, అతని ముందునుంచే తిరుగుతూ ఆమె కబుర్లు చెప్పుతూంది. సావిడికి వంటయింటికి మధ్యం గుమ్మం దగ్గరగా కూర్చుని ఉన్నాడతను. లాంతరు వెల్గులో ఆమె దేహలావణ్యాన్ని యౌవనసౌష్ఠవాన్నీ ఆ చిన్ని చీరె మరుగుపరచటం లేదు. వచ్చినప్పటినుంచీ ఆమెముఖం అతనికి ఏమాత్రమూ అందంగా కనబడలేదు. కాని ఏదో చనువుగా ఆప్యాయంగానే పల్కరించటంలో కొంత తాత్కాలిక మార్దవమూ మొగంలో చిందక పోలేను.

ఎబ్బెరికం లేకుండా కొత్తవాడైన తనముందు ఆమె అలా తిరగటం అతనికి సహించటం లేదు. కాని స్త్రీ యౌవనరూపం కనబడుతూంటే కన్నుమూసే వైరాగ్యమూ, అతనిలో లేదు

అతనికి కాలేజీహాస్టలులో శంకరం జ్ఞాపకానికి వచ్చాడు శంకరం, వైరక్తతత్వం వాడు. స్త్రీ అంటే వ్యభిచారి అనే అతని తత్వానికీ, అతను అంటే స్త్రీలంతా స్వయంగా విరగబడి వస్తారనే అతని కోతలకూ, సాటి విద్యార్థులంతా ఎంత అసహ్యంచుకొన్నదీ జ్ఞాపకానికి వచ్చింది. తన మనస్సులోని చపలత్వం

(21-వ పేజీ చూడుడు)

చేసికొనుటకు ఆ విషయమై సంప్రతింపుల జరుపుకొనుటకు ఒక సంస్థ ఏర్పాటు అవునని తెలియజేయబడినది. ఇంతవరకు భారతదేశము డాలరు ప్రాంతమునుండి దిగుమతి చేసికొనుచున్న ఆహారవస్తువులను ఆస్ట్రేలియా నుండి తెప్పించ ప్రయత్నించును.

ఈ ఒప్పందము బ్రిటిషు ఆర్థిక మంత్రి సర్ స్టాఫర్డుక్రిప్సు ప్రతిభకు విజయ మని చెప్పవచ్చును. స్టర్లింగు ప్రాంతమునంతను ఏకముఖమునకు తెచ్చి వారి అండతో అమెరికాకు సెప్టెంబరులో సంప్రతింపుల నిమిత్తము వెళ్లనుండెను.

నేడు ఆంధ్రరాష్ట్రం ఎందుకు?

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

అయింది. అనుకున్నంత అయింది. 'అఖిలాంధ్ర ప్రతినిధుల సమావేశం' ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘం యాజమాన్యాన జరుపుతున్నామని ప్రకటించారు. జరిపారు 150 మంది ప్రతినిధులు, 5000 వేల మంది ప్రేక్షకులు, తప్పకుండా ఆంధ్రరాష్ట్రం సాధిస్తారనే ఆశతో వచ్చారు. ఆవేశాలతో ఉపన్యాసాలు సాగించారు.

పాకిస్థాన్ సమస్యవిషయంలో 'పవిత్రమగు గోమాతను రెండు చేస్తామా, అని గాంధిజీ హిందువులమనస్తత్త్వానికి హెచ్చరికచేసిన పద్ధతిలో 'తలలేని మొండం' గా మద్రాసులేని ఆంధ్రరాష్ట్రాన్ని చిత్రించవలదన్న వారిమాటలు విన్నజాలనంత ఆవేశంలో నడిచిపోయినవి. ఈనాడు ఆంధ్రరాష్ట్రసమస్య శ్రీ శొంఠిరామమూర్తిగారన్నట్టు మద్రాసుతోనా, మినహాయించియా, - అని 'మద్రాసు ప్రధానసమస్యగానే వున్నది. థార్ కమిటీ సిఫారసుప్రకారం బొంబాయివలె, మద్రాసునుకూడా ప్రత్యేక నగరరాష్ట్రంగా చేస్తామనే హామీయిస్తే ఈ 11 జిల్లాలతో రాష్ట్రం అంగీకరించుటకు అందరూ సంసిద్ధులుగనున్నారనేది అందరికీ తెలిసిందే. మద్రాసు సగం చాలునని తీర్మానించడంతో మద్రాసుపై తమకు పూర్తిహక్కు లేదని ధృవపరచుకోలేదా ?

"వ్రతంచెడ్డా ఫలం దక్కిందనిసంతోషించుకుందామంటే మద్రాసుపై హక్కు వెంటనే వదులుకున్నా రాష్ట్రము తక్షణమే వస్తుందన్న ఆశయెక్కడాలేదు" అనే నిరాశతో మద్రాసును వదులుకోలేక పోతున్నారు. ఈవిధంగా వాదించికూడా చివరకు రాష్ట్రము తక్షణమే వస్తుందన్న ఆశ లేకపోయినా సగం మద్రాసు వదలుకున్నారు అందువలన అవకతవకలతోగూడిన నాయకత్రయనివేదికను అంగీరించనూ, త్రోసివేయనూలేదు. అంగీకరించారా అంటే మద్రాసుపై పూర్తిహక్కు వదులుకోనూ లేదు. అంగీకరించలేదా అంటే అంతా మద్రాసును కోరనూ లేదు. సగం చాలులెమ్మన్నారు. అందుచేతనే 'మద్రాసు ఆంధ్రులది' అనేవాదం ఎంత నిర్వివాదమైనదో తెలిపోయింది (!) అడగటానికైనా మద్రాసు సగంకన్నా లాభం లేదేమో నని తేల్చారు

జనవాణిలో గుంటూరుజిల్లా విద్యార్థి ఫెడరేషను, రైతుసంఘం వ్యవసాయకూలి సంఘముల పేర 'తలా తోకాలేని ఆంధ్రరాష్ట్రం ఎవరికి కావలె'ననే శీర్షికక్రింద ఒకవ్యాసం ప్రకటించబడింది.

వీరి దృష్టిలో మద్రాసు తలయో తోకయో చెప్పిన బాగుండెడిది. ఆంధ్రవిద్యార్థి ఫెడరేషను, కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘములు మద్రాసునగరం ఆంధ్రులది కాదని, తమిళులదని ఇదివరలో చేసిన ప్రచారం మరచిపోయినారా, మార్చుకున్నారా! మద్రాసు మినహా ఆంధ్రరాష్ట్రం అక్కరలేదనేవారి ప్రవాహంలో కట్టుకునిపోతున్నారా! (ఈ రైతుసంఘం ఎవరు?) ఆంధ్రరాష్ట్రంలో మంత్రిపదవులు లభిస్తవో లేవో నని భయపడిన నేటి మంత్రులలో కొందరు విశాలభావంతో నటించినట్లు ప్రవర్తింపదలచి హైదరాబాదు, ఒరిస్సా ఆంధ్రుల సంగతి తేలేవరకు ప్రస్తుతం రాష్ట్రం అక్కరలేదన్నవారితో కలుస్తున్నారని తలంచవలసివస్తుందా? నూది, దబ్బణం సిద్ధాంతానికి దిగజారారంటూన్న వీరు ఆంధ్రనాయకులమధ్య స్వార్థతగాదాలను ప్రజలముందు అరవ తెలుగు జాతిద్వేషంగా రెచ్చగొడుతున్న గాలిబుడగను, ఆంధ్రరాష్ట్రనిర్మాణంతో బద్దలుచేసి అసలు వ్యవహారం బయటపెట్టి ప్రజలకు కల్పిస్తున్న భ్రమలను తొలగించినపుడే ఈనాటి ఆంధ్రజీవితంలోని మురాతత్వాన్ని ఆంధ్రసమస్యను ప్రజల కవగతం చేయగలుగుతారని గ్రహించవలసియున్నది. అసలు 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం వలదంటారా, మద్రాసు నగరం మినహా ఆంధ్రరాష్ట్రం వద్దంటారా - విశాలాంధ్ర కు ప్రాతిపదికగా ఆంధ్రరాష్ట్రం వద్దంటారా. ఈనాటి 'పెట్టుబడీదారీ' నాయకత్వం క్రింద ఆంధ్రరాష్ట్రం వద్దంటారా? రాయబారాలు, మధ్యవర్తిపరిష్కారాలు, తప్పయితే బహుళః ఆంధ్రరాష్ట్రంకూడా అవసరం లేదేమోగాని, కార్మికుల, కర్షకుల కష్టనివారణకు విప్లవ మార్గాన పోరాటం సాగించేటప్పుడుకూడా అపీళ్లు, రాయబారాలు, మధ్యవర్తిపరిష్కారాలకు ప్రయత్నాలు మానవల్లే, విశాలాంధ్ర నినాదం ఆశయం మరచిపోకుండా అందుకు సాధనగా ఆంధ్రరాష్ట్రం సాధించడంతప్ప కానేరదు. అది మధ్యతరగతిఉద్యమం అయినపుడు మధ్యతరగతి ప్రజానీకానికి దానిలో తుపాకులు, నాయకుల పరస్పరవిరుద్ధవాదాలు తెలుపడంకూడా అవసరమే అవుతుంది. ఇది అంతా విశాలాంధ్రనిర్మాణానికి దారియే అవుతుందికాని, విశాలాంధ్రాశయం విస్మరించడం మాత్రం కాజాలదు విశాలాంధ్ర నిర్మాణానికి కావలసిన బలం చేకూర్చుటకు ఆంధ్రజాతిలో ఆంధ్రచైతన్యం కలిగించుటకు జాతీయస్వయం నిర్ణయోద్యమం ప్రజలలోకి పోవుటకు ఈనాటి 11 జిల్లాలతోనైనా ఆంధ్రరాష్ట్రం అత్యవసరం.

ఆంధ్రనాయకుడుగా రాష్ట్రపతి ఎన్నికలకు నిలిచినపుడు డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు భాషాప్రయుక్తరాష్ట్ర విభజనకు నాయోపిన పనిచేస్తానని ప్రకటించారు. భాషారాష్ట్రనిర్మాణ సమస్యలో ఆంధ్రరాష్ట్ర ఉద్యమం అన్ని ఉద్యమాలకన్న అగ్రస్థానంలో వుంది రాష్ట్రోద్యమానికి నిజమగు ప్రజాకాంక్ష వున్నదికూడా ఆంధ్రాయే. చైతన్యంతో ప్రబలిన ఉద్యమాలుకూడా ఆంధ్రప్రాంతాలలోనే వున్నవి భారతదేశంలోని జాతీయోద్యమాలు, కాంగ్రెస్ నాయకుల భాషలో ఉపజాతీయోద్యమాలు నిర్వహింపబడుతున్న విధానంలో ఆంధ్రోద్యమమే బలవత్తరమయింది చాలా పురాతనములు౦గి రాజకీయచైతన్యంతో సామ్రాజ్యవాద వ్యతిరేకోద్యమచైతన్యంతో నడిచింది. అందువలననే మహారాష్ట్ర కర్నాటక కేరళ జాతీయోద్యమాలు ఆంధ్రులు యేవిధంగా ఎప్పుడెప్పుడు వ్యవహరిస్తారా అని చూస్తున్నారు.

జాతీయోద్యమముకై అండగాచూచిన భాషారాష్ట్రోద్యమాలు ఇండియాలో అధికారమార్పిడి జరగడంతో, నేడు కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి తలనొప్పిగా వుంది. పటేల్, నెహ్రూలు అధికారం హస్తగత మయినప్పటినుండి రాష్ట్రతత్వం వదలదని, మతతత్వంగాని, రాష్ట్రతత్వం గాని రెండూ ఒకటేనని రాష్ట్రతత్వంతోబాటు, భాషారాష్ట్రతత్వంకూడా మానకోవలసిందని వాదిస్తూవచ్చారు భాషాద్వారక రాష్ట్రనిర్మాణంగాని, భాషాతత్వంకాని ఫాసిజమని, హిట్లరిజమని దుమ్మెత్తిపోస్తున్న మున్సిబోటి మతతత్వవాదులను ఎగరొట్టవలసిన రోజులవి. ఆ రోజులలో భాషారాష్ట్రనిర్మాణం అవసరమని అందుకై కృషిచేయటానికే రాష్ట్రపతిపదవి నధిష్ఠించుతున్నాను డా. పట్టాభి, థార్ కమిటీ నియామకం, ప్రజల వత్తిడి ఫలితంగా జరిగింది. నివేదిక వచ్చింది. చివరకు భాషారాష్ట్రనిర్మాణం వాయిదా వేయవలసిందని, జాతీయతకు ఉపజాతీయత అడ్డంకి అని భాషా ధారక రాష్ట్ర సిద్ధాంతాన్నే త్రోసివేశారు. పరిపాలన రీత్యా రాష్ట్రాలు పునర్విమర్శించవలసి వుంటుందని, చెప్పారు. న్యాయంగా మహారాష్ట్రప్రాంతమైన బొంబాయి మహారాష్ట్ర రాజ్యంలోకి పోవలసియుండగా, భాషారాష్ట్రతత్వానికి లోకదకాలిచ్చినందున, పక్షపాతవిధానమనే దృష్టితో బొంబాయిలోని గుజరాతీ, మార్వారీధనికుల పెత్తనంనుండి బొంబాయి జారిపోకుండావుండుటకు బొంబాయిని ప్రత్యేకరాష్ట్రంగా నిర్మించాలెనని ప్రజాసిద్ధాంతానికి, జాతీయస్వయం నిర్ణయప్రాతిపదికకు వ్యతిరేకంగా పాలకదృష్టితో నిర్ణయించారు. మెజారిటీగా వుంటే మహారాష్ట్ర ప్రజానీకపు స్వయంనిర్ణయంనుండి బొంబాయిని విడదీసి, బొంబాయిలోని గుజరాతీ, మరాటీ అల్పసంఖ్యాకులపేర వ్యాపారులకు హస్తగతం చేశారు అటులే ఆంధ్రరాష్ట్రాన్ని త్రోసివేస్తూ మదరాసును ప్రత్యేకరాష్ట్రం చేయమన్నారు బొంబాయిలో భాషా అల్పసంఖ్యాకుల రక్షణపేరుతో ధనికులను బలపరచిన పద్ధతిని కప్పిపుచ్చటానికి ఇతర ప్రాంతాలల్లోని అల్పసంఖ్యాకులకు కూడా రక్షణ లుండవలెనని చెప్పక తప్పలేదు పొరపాటులో జరిగిన గ్రహపాటే ఒరిస్సాలోని ఆంధ్రులకు రక్షణ యివ్వవలెననేది అని గ్రహించవలసియుంది ఒక్కమాటలో చెప్పవలెనంటే ప్రజానిర్ణయమగు భాషాధారక సిద్ధాంతాన్ని త్రోసివేసి పాలకవర్గానికి బలంగా వుండే పద్ధతులు నిర్ణయించారు. అయితే స్వార్థపరులు వేసే ప్రతి యెత్తులోను 100 వంతులు తమకే ప్రయోజనమున్నా పొరపాటున ఒకవంతు అయినా ప్రజలకుకూడా ప్రయోజనం వుంటుంది అది ఒరిస్సా ఆంధ్రులకు వాదనకన్నా ఉపయోగపడింది

భాషాధారక సిద్ధాంతాన్ని త్రోసిపారవేసిన థార్ నివేదికను అందరు ఏకగ్రీవంగా త్రోసివేశారు. భాషాధారక రాష్ట్రవాదానికి నాయకులయిన ఆంధ్రుల నాయకత్వానికి మిగతావారు ఎదురుచూచారు యం. ఆర్. జయకర్ థార్ కమిటీపై 'ఆంధ్రులేమి చేస్తారో చూడవలసి వుంది' అనడం నిదర్శనము కాదా! ఆంధ్రులు కూడా భాషాధారక రాష్ట్రవిభజనను త్రోసివేసి చేసిన థార్ నివేదికను తీవ్రంగా ఖండించారు. మద్రాసు, ఒరిస్సాలో నన్న ఆంధ్రులు కూడా నివేదిక మూలసూత్రాలను ఖండించుచు, తమ కనుకూలంగా ఉన్న భాగాలకు లోలోన సంతసించారు. మొత్తంమీద యావద్భారతంలోనూ థార్ నివేదిక ఖండింపబడింది అదే సమయంలో జరుగుతున్న జయపూర్ కాంగ్రెస్‌లో దీని ప్రభావాన్ని కాంగ్రెస్ అగ్రనాయకత్వం గ్రహించింది. ఆ వ్యతిరేకమనోభావాన్ని దాటవేయదలంచింది డా. పట్టాభిని కలుపుకున్న కమిటీతో భాషారాష్ట్ర వాదులను సంతృప్తిపర్చగలిగింది అయితే భాషారాష్ట్ర విభజన విషయం 'నూతన పరిస్థితుల ననుసరించి పరిశీలించవలెనని చెప్పినది ఆ మహోత్సాహంలో నెహ్రూ, పటేల్‌ల గంభీర భాషణల ప్రభావంలో ఈ నూతన పరిస్థితుల కనుగుణంగా అన్నది ప్రధానంగా గమనిక రాలేదు

ఆంధ్రనాయకులలో ఢిల్లీకివెళ్లిన ప్రతివారూ ఆంధ్రరాష్ట్రవిషయం ఏదొకవార్త తెలిసికొని రాని రోజు లేదు. ప్రతిప్రకటనలో అత్యాశ, అందులో అణగింజంత నిరాశ. ఆ వేశంలో వచ్చిన ఆశ యెగిరిపోయేది, నిరాశ మిగిలిపోయేది ఈ ఆశలను నిరాశయ ఆంధ్ర నాయకత్వంతమ ముఠాలను బలపరచుకొనుటకు, ఆంధ్రజీవితంలోనే ఏర్పడిన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయాలను తికమకలుగా ప్రజలదృష్టిలో పెట్టి ప్రజాసమస్యలకు వికృతరూపం యిచ్చి దాటవేయడానికి ప్రయత్నిస్తూ వచ్చారు

మనడాక్టరు పట్టాభి ఉన్నాడు. మనకుకావలసిన ఆంధ్రరాష్ట్రం తెస్తాడని గంపెడంత ఆశతో సామాన్యఆంధ్రాభిమానులు ఎదురుచూస్తున్నారు ఆంధ్ర కాంగ్రెస్ మురారాజకీయాలలో మునిగి, మునిగి - చివరకు ఆంధ్రాభిమానంతో, దక్షిణదేశాభిమానంతో భాషారాష్ట్రనిర్మాణానికి సహాయపడుతాడనే ఆవేశంతో, సంస్థానాల ప్రజాఉద్యమాలను నడిపినాడనే ఉత్సాహంతో రాష్ట్రపతిపీఠం పొందగలిగారు పట్టాభిగారు. అయితే ఐక్యకేరళ, విశాల మహారాష్ట్ర, ఐక్య కర్నాటక, రాష్ట్రాలు ఏ విధంగా సాధించగలరు? తిరువాన్కూరు మహారాజాను గవర్నరుగా యేర్పరచుకొని తిరువాన్కూరు, కొచ్చిన్, సంస్థానాలు, మలబారుజిల్లా కలిపి ఐక్యకేరళ చేయమన్న సంగతి ఎవరికి జ్ఞప్తిలేదు. మహారాజాధిరాజులు రాజప్రముఖులుగా విశాల సౌరాష్ట్ర, విశాల రాజస్థాన్, విశాలంధ్ర్యరాష్ట్రాలు నిర్మిస్తున్న పటేల్ ధోరణిగ్రహించినవారు ఉపజాతీయత సిద్ధాంతంతో భాషారాష్ట్రాలు నిర్మిస్తారని ఎవరు ఆశించలేదు. మైసూరు, మహారాజా క్రింది, కర్నాటకులు, కొల్హాపూర్ మహారాజాక్రిందికి మహారాష్ట్రులు, నైజాంనవాబు క్రిందకి ఆంధ్రులు పోయి దానిని విశాలాంధ్ర విశాలకర్నాటక, విశాల మహారాష్ట్ర అనుకొనమంటే సంతోషించటాని భాషారాష్ట్రవాదులెవరు సంసిద్ధంగాలేరు.

'భాషారాష్ట్రాల నంగీకరించే నేనున్నాను వద్దనే యిద్దరు అంతల ఉన్నారు. వారిలో ఒకరిని సాధించుకోగలిగితే నేను రాష్ట్రాలు సాధించగలనన్న' 'డాక్టరు పట్టాభిగారి మాట జ్ఞప్తి వుంచుకుంటే ఫలితం యేమవుతుందో నాయకత్రయ నివేదిక ఏమవుతుందో అర్థం చేసుకోవచ్చు పైపెచ్చు నెహ్రూ కామన్వెల్తు సమావేశాన్నుండి రాగానే "ప్రపంచమంతా ఒకటి కావలసిన ఈరోజులలో ఉన్న రాష్ట్రాలనే విభజించ మనడం, భాషాసిద్ధాంతాలతోటి, మతసిద్ధాంతాలతోటి ప్రాంతాలవిభజన ప్రమాదకరమన్న" వాదనకూడా అన్వయించుకుంటే ఢిల్లీనుండి రాష్ట్రం యెట్లావస్తుందని ఆలోచగలం కాని డా పట్టాభిగారు అప్పుడప్పుడు చేసిన ప్రకటనలు, కల్పించిన ఆశలు మన ఆంధ్రరాష్ట్రసాధనకు అవకాశాలున్నవి కావాలనని అనుమానాలు కల్పించినవి అందువలన కొంత యెదురు చూడడం జరిగింది.

అందువలన ఈ ముగ్గిరిలో ఎవరి నెత్తురులాక్కోవాలెనో యోచించండి. ఇంకనై ఇండియా విభజన కూడదు అంటాడు నెహ్రూ. సంస్థానాల విషయం ఎవరు ముట్టకోద్దు రాజప్రముఖులతో విశాలరాష్ట్రాలేర్పరుస్తానంటాడు పటేల్. భాషాప్రాంతాలు రాష్ట్రాలుగా యేర్పడవలెనంటారు డా. పట్టాభి. ఇండియా మొత్తంగా రాజప్రముఖులను త్రోసివేసి ఆయా భాషాప్రాంతాలను ప్రత్యేకరాష్ట్రాలుగా కేంద్రప్రభుత్వంగాని కాంగ్రెస్ నాయకత్వంగాని విభజించనున్నదని, విభజించుతుందని తలంచడం ఆశాపాశమే అని అందరికి తెలిసిందే! వీటి అన్నింటి ఫలితమే నాయకత్రయ నివేదిక

ఇండియాలో క్రొత్తగా జాతీయపరిష్కారంగా భాషాసరిహద్దులను మారిస్తే ముఠాతత్వా

(19-వ పేజీ చూడుడు)

ఆసియా: చతుర్వర్గ వ్యూహం

[తూర్పు ఆసియాలో ఇటీవల కలుగుతున్న మార్పులను గురించిన నాలుగు వ్యాసాలలో ఇది మొదటిది.]

[ఆంధ్రూరాత్]

చీనా కమ్యూనిస్టుల విజయాల ఫలితంగానూ, ఇండోనీషియాలో డచ్చి సామ్రాజ్యయుద్ధం వల్లనూ ఆసియాలో నాలుగుకూటాలు ఏర్పడినాయి. ఏదో కబంధహస్తం కలచివేసినట్లు యుద్ధపూర్వస్థితిని ద్వితీయ ప్రపంచయుద్ధం తారుమారు చేసింది. గత సంవత్సరపు సంఘటనలవల్ల పావులన్నీ కదిలి కొత్తస్థానాల్లో పడి అన్నీ నాలుగువర్గాలుగా పేరుకున్నాయి.

అయితే ఈనాలుగువర్గాల పేర్పు ఇప్పుడిప్పుడే జరిగినందువల్ల స్థిరమైనవని చెప్పలేం. అదీ కాక అంతర్యుద్ధంవల్లనో స్వాతంత్ర్య యుద్ధంవల్లనో ఇండోనీషియా, మలయావంటి దేశాలలో ప్రజల్లోని వివిధపక్షాలు రెండేసి మూడేసివర్గాల పక్షం వహిస్తున్నాయి. అయినప్పటికీ ఏయే దేశాలు ఏవర్గానికి చెందినవో స్పష్టపరిస్తేగాని ఆసియాలో ఏపరిస్థితినీ అవగాహన చేసుకోడం కష్టం. అందువల్ల ఈవర్గాలలో మూడింటిని ఏకంచేయగలిగే అవకాశాల్నిబట్టే ఆసియాకమ్యూనిస్టు ప్రతికూల రాజ్యకూటసమస్య ఆధారపడిఉంటుంది.

ఈ నాలుగువర్గాలలో మొదటిది అమెరికాపైన ఆధారపడిన తూర్పు ఆసియా దేశాలని చెప్తే బాగుంటుంది. వానిలో అమెరికన్ సైనికాక్రమణలోఉన్న జపాన్, చీనాలో మిగిలిన కొమింటాంగ్, దక్షిణకొరియా, ఫిలిప్పైన్సు. ఈవర్గానికి ప్రెసిడెంట్ ట్రూమన్, జనరల్ మెక్ఆర్థర్ వాస్తవ నాయకులు.

రెండోవర్గం దక్షిణాసియాలో ఉంది. ఇవి మితవాద జాతీయప్రభుత్వాలు, ఇండియా, పాకిస్తాన్, సింహళం, బర్మా, సయాం, తరిగిపోయిన ఇండోనీషియన్ రిపబ్లిక్, ఇరానీ, ఇరాక్, సాధీఅరేబియా, ట్రాన్సు జోర్డన్ (ఇప్పుడు దీనిపేరు హాషీమైట్ రాజ్యం) సిరియా, లెబనాన్. వీనితో ఇజ్రాయల్‌ను కూడా చేర్చవచ్చును. ఈవర్గంలోకి చెప్పుకోదగిననాయకుడు పండిట్ నెహ్రూ.

మూడోవర్గం సామ్రాజ్య పరిపాలక వర్గం— ఇంగ్లండ్, హాలండ్, ఫ్రాన్సు వీరిదేశాలు కూడా దక్షిణాసియాలోనే ఉన్నాయి. వీరికి ఎర్నెస్ట్ బెవిన్ (బిటిష్ విదేశాంగ మంత్రి) నాయకుడు.

ఉత్తరాసియావర్గం కమ్యూనిస్టు రాజ్యాల కూటమి - సోవియట్ రష్యా, ఔటర్ మంగోలియా, ఉత్తరకొరియా, చీనాలోని కమ్యూనిస్టు ఆక్రమితప్రాంతం బహుశా వీనిలోకి వియట్‌నామ్ రిపబ్లికను కూడా చేర్చవచ్చును. ఈ వర్గానికిద్దరు నాయకులు జోసెఫ్ స్టాలిన్, మావ్-సి-టుంగ్. ఇప్పుడువచ్చిన ప్రశ్న ఏమిటంటే అజ్ఞాత యుద్ధంలో ఏవర్గం ఏ పక్షాన ఉంది? కమ్యూనిస్టువర్గం రష్యానే అంటిపెట్టుకుంటుందని వేరే చెప్పనక్కరలేదు. మిగతా మూడువర్గాల్నీ చేర్చి బలపరచి ఆసియా యూనియన్‌గా నిర్మించాలని బ్రిటన్ అమెరికాల ప్రయత్నం. ఇటువంటి కూటమి ఏర్పడకుండా చెయ్యాలని కమ్యూనిస్టువర్గం యత్నిస్తోంది. దీనికిగాను ఆసియాలోని కమ్యూనిస్టు పరిపాలితం కాని దేశాలలో అంతఃకలహాలనీ, అస్థిరత్వాన్నీ వివిధవర్గాలమధ్య గల భేదాల్నీ ఆధారం చేసుకుంటున్నారు. ఈ ఉభయుల యత్నాల ఫలితంపైనే ఆసియా భవితవ్యమే కాక ప్రపంచభవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుందిఅమెరికాపైనే కేవలం ఆధారపడే దేశాలవర్గం ఉందని ఇటీవల కొన్ని సంఘటనలపట్ల ఆయా దేశాల వైఖరివల్లనే స్పష్టమవుతోంది.

గత ఏప్రిల్ అధ్యక్షపదవికి పోటీచేసిన రిపబ్లికన్ అభ్యర్థి హెరాల్డ్ స్టాసెన్ ఉత్తర అట్లాంటిక్ పాక్టు మాదిరిగానే పసిఫిక్‌పాక్టు, ఒకటి మార్షల్ ప్రణాళికవంటిదే మెకార్థర్ ప్లాన్ ఒకటి అమలు జరపాలన్నాడు. ఈ ఉద్దేశం అత్యద్భుతంగా ఉందని ఆసియా నాయకుల్లో ఒకవర్గం వెంటనే గగనాని కెత్తారు. మొదట అందుకున్నవారు ఫిలిప్పైన్సు అధ్యక్షుడు ఎల్పిడియో క్విరనో, తరవాత కొమింటాంగ్ మితవాదనాయకులు, ఆపైన దక్షిణకొరియా అధ్యక్షుడు బహువృద్ధుడు సింగ్‌మన్‌రీ అందుకున్నారు. జపాన్ ఆక్రమణలో ఉండబట్టీ, పూర్వశత్రుదేశం అయింది. కాబట్టీ, అంతర్జాతీయరంగంలో ప్రతిపత్తి లేదు కాబట్టి వీలులేకపోతోంది కాని లేకుంటే అటువంటి పాక్టులో జపాన్ చేరడం తనకు ఎంతో సంతోషదాయకంగా ఉంటుందన్నాడు జపాన్ ప్రధాని షిగీరు యోషీదా.

పసిఫిక్‌పాక్టు పేరుకి ఇంత హర్షం తెలిపినవారికీ జనరల్ మెకార్థర్‌కీ, అమెరికన్ రాజకీయ రంగంలో మితవాదవర్గానికీ గల సన్నిహిత స్నేహవ్యవహారాలు మాత్రం చూస్తే వింత తోచకపోదు. అధ్యక్షుడు క్విరనో తిరిగి అధ్యక్షుడు కావడం తనకు హితమని జనరల్ మెకార్థర్ ఫిలిప్పైన్సుకు సందేశం పంపాడు. టోక్యోలో జనరల్ మెకార్థర్‌ను సందర్శించినవారిలో దక్షిణకొరియా అధ్యక్షుడు సింగ్‌మన్‌రీ ఒక్కడే రాజ్యాధిపతి. తత్ప్రతిగా సింగ్‌మన్‌రీ అధ్యక్షుడుగా నెలకొల్పబడినప్పుడు జనరల్ మెకార్థర్ ఉత్సవంలో పాల్గొన్నాడు.

ప్రధాని యోషిదా జపాన్‌లో ధనవంతులైన వర్తకులకు ప్రతినిధి. జపాన్‌లో కెల్ల అమెరికాకు మిత్రులు ఈ వర్తకులేనని మెకార్థర్ అభిప్రాయం. ఇంక పసిఫిక్‌పాక్టు ఉద్దేశానికి హర్షం ప్రకటించిన కొమింటాంగ్ మితవాదులే కొమింటాంగ్ చీనా రక్షణ బాధ్యతను జనరల్ మెకార్థర్ వహించాలని కోరినవారు. అంటే ఏ రెండు వందల కోట్ల డాలర్ల డబ్బు ధారపోసి అమెరికన్ సైన్యాన్ని తెచ్చి యుద్ధం చేసి పెట్టాలని వారి అభిప్రాయం. వాస్తవమేమిటంటే అమెరికాపై ఆధారపడినవారు అమెరికాలోని మితవాద నాయకుల్తో చేరి అమెరికన్ ప్రభుత్వం వద్దు మొర్రో అంటోంటే (ఇప్పటికే) వినక ఒక పసిఫిక్ పాక్టుని వారి నెత్తిమీద రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ దేశాలు ఇంతగా మొరపెట్టడానికి కారణం ఇక్కడి చంచల పరిస్థితులే. ఈ అస్థిరతకి ఎన్నాళ్లు చూసినా మందులేనట్లుంది. అంతఃకలహాలతో ప్రమాద స్థితిలో ఉన్న దక్షిణ కొరియాలో సింగ్‌మన్‌రీ ప్రభృతులు తమ ప్రభుత్వాన్ని ప్రజలపై పోలీసుల నుసికొలిపి, బెదరించి, తద్వారా తమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

ఫిలిప్పైన్సులో ప్రబలమైన లిబరల్ పక్షం రెండు కక్షలుగా చీలిపోయి అవినీతివల్ల బలహీనమై పోయింది. యుద్ధంలో జపాన్‌తో చేరిన జోస్ లారెల్ తిరిగి రంగంలో ప్రవేశించడానికి యత్నిస్తున్నాడు. కమ్యూనిస్టుల అధ్వర్యం కింద హక్ గోరిల్లాలు దేశంలో విచ్చలవిడిగా తిరుగుతున్నారు. చీనాలో కక్షలతో కుమిలిపోతున్న కొమింటాంగ్ అంతిమ యాతనల్లో ఉంది. నిజంగా చూస్తే పరాజయం పొందిన జపాన్‌లో ఇప్పటి పరిపాలనే స్థిరమైనదిగా కనిపిస్తోంది. దీనికి హేతువులు అమెరికా సైనిక బలం, ఆర్థిక సహాయం, జపాన్ మితవాద పక్షబలం.

పసిఫిక్ పాక్టువల్ల లభించగల అమెరికన్ సైనిక, పరికర సహాయం కోసం ఈ దేశాలన్నీ ఆతురపడుతున్నాయి. సైనికవ్యూహంలో రక్షణకు గాని దండయాత్రకు గాని అట్లాంటిక్ ప్రాంతం ప్రధానమైనదిగా అమెరికా నిశ్చయమైనందువల్ల గత సంవత్సరంకంటె ఈ సంవత్సరం తూర్పు ఆసియాలో అమెరికన్ సైనికులు బహు కొద్దిమంది కనపడుతున్నారు. అయితే అమెరికాపైన ఆధారపడిన ఈ దేశాల్లో-జపాన్ మినహా — అమెరికన్ సైనికదుస్తులు కనిపిస్తాయి. అమెరికా ఇక్కడ సైనికులకు శిక్షణ నిస్తోంది. ఈ దుస్తుల్ని సప్లై చేస్తోంది. కాని వాస్తవంగా పెద్ద యుద్ధమే సంభవిస్తే ఈ దేశాలు వేనికీ ఆత్మరక్షణకు బలం బొత్తిగా లేదు.

పసిఫిక్ పాక్టు అంటే ఇక్కడ ఇంత ఉత్సాహానికి మరొక హేతువుంది. ఇటువంటి పాక్టువల్ల అమెరికాపైన ఆధారపడిన పేరు తప్పుతుంది. సమానప్రతిపత్తితో మిత్రరాజ్యాలు కాగలవు. వారి ఆర్థికస్థితి ఒక్కసారి చూస్తేనే తెలుస్తుంది వారెంతవరకూ అమెరికాపైన ఆధారపడవలసి వస్తున్నది. ఫిలిప్పైన్సు ఎగుమతిచేసే వస్తుసముదాయం కంటె దిగుమతి చేసేది రెట్టింపు. విదేశవ్యాపారంలో లోపాన్ని అమెరికా ఇప్పిస్తున్న యుద్ధనష్టపరిహార, యుద్ధవీరులకు వేతనాలు వగైరాలతో భర్తీ చేసుకుంటోంది. ఇప్పుడు ఫిలిప్పైన్సునుంచి ఎగుమతి అయ్యే వస్తు సామగ్రిలో నూరింట 70 వంతులు సుంకభారం లేకుండా అమెరికా వెడుతున్నాయి

అమెరికా చెల్లింపులేకుండా అమెరికన్ మార్కెట్లకి సదుపాయంలేకుండా ఉంటే ఫిలిప్పైన్సు ఆర్థికంగా కూలిపోతుంది

దక్షిణ కొరియాకూడా అమెరికాపై ఆర్థికంగా ఇలానే ఆధారపడిఉంది. కొరియా ఆర్థిక సంపద దాదాపు అంతా సోవియట్ ప్రాబల్యంలో పడిన ఉత్తరప్రాంతంలోనే ఉంది. యుద్ధం ముగిసినది మొదలు ఇంతవరకూ అమెరికా దక్షిణకొరియాకి 35 కోట్ల డాలర్ల విలువగల ఆహారపదార్థాలు, ఎరువులు, పారిశ్రామిక ముడివస్తువులు, విద్యుచ్ఛక్తి పరికరాలు, రవాణాపరికరాలు మొదలైన వానిని సప్లై చేసింది దక్షిణకొరియా, దిగుమతిచేసుకునే వస్తుసామగ్రిలో నాలుగింట మూడువంతులు అమెరికా ధనసహాయంతో తెచ్చుకుంటున్నవే. ఈసహాయం ఇంకా లభిస్తోంది. ఈ సహాయం లేకపోతేదక్షిణకొరియా ఏనాడో ఆర్థికంగానూ రాజకీయంగానూ భగ్నమైపోయేదే.

కొమింటాంగ్ చీనాను ఆర్థికంగానూ సైనికంగానూ నిలబెట్టడానికి అమెరికాసహాయం ఎంతవరకూ సహాయపడిందో దీర్ఘచర్చ జరపవచ్చును. రోషాలూ రావచ్చును అమెరికా 200 కోట్ల డాలర్లు ఖర్చుపెట్టిందంటాడు డీన్ అచిసన్ (అమెరికా విదేశాంగ కార్యదర్శి). ఇంకా సహాయం చెయ్యాలని వాదించేవారు నూరుకోట్లైనా ఇవ్వలేదని చెప్తున్నారు. అది నుంచీ సహాయం చెయ్యరాదని వాదించేవారు అమెరికా ఖర్చుపెట్టినది 400 కోట్లపైబడి ఉంటుందంటున్నారు. అయితే ఈ సహాయం రాకపోతే కొమింటాంగ్ ముందే కూలిపోయేదని చెప్తే నమ్మవలసిందే.

జపాన్ యుద్ధానంతర ఆర్థికస్థితి ఎంత హీనంగా ఉన్నా అమెరికా ఆర్థికసహాయంవల్ల కోలుకుంది. ఈ సహాయం ఇప్పటికే నూరుకోట్ల డాలర్లకు పైన బడింది.

ఇంకా రోజూ పదిలక్షల డాలర్లు జపాన్ కోసం అమెరికా ఖర్చుపెడుతోంది. ఇప్పుడు జపాన్ దిగుమతి చేసుకుంటున్న ముడివస్తువుల్లో సగం అమెరికా ఆర్థికసహాయంవల్ల వస్తున్నాయి. ఇప్పుడింక జపాన్ ఆర్థికంగా బలపడాలంటే సమీపదేశాల్లో మార్కెట్లు ముడివస్తువులు ఆర్జించుకోడానికి అమెరికా సహాయపడాలి

అయితే జపాన్ ఆర్థిక పునరుద్ధరణలో అమెరికా ఈ రీతిగా సహాయపడ్డం, అమెరికాపైన ఆధారపడుతున్న ఇతర దేశాలకు ఇష్టం లేదు జపాన్ దురాక్రమణవిధానం తిరిగి తలెత్తుతుందని వీరి భయం. కొరియాలోనే బియ్యం కొరతగా ఉండగా, దూర ప్రాచ్య సైనిక కార్యాలయం కోరికపై జపాన్‌కు బియ్యం సప్లై చెయ్యడానికి అంగీకరించినందుకు దక్షిణకొరియా అధ్యక్షుడు సిగ్మండ్‌రీ మిత్రుల విమర్శలకు గురైనాడు. జనరల్ మెకార్థర్ కోరిక ప్రకారం జపాన్‌తో వర్తకం వృద్ధిచేసుకోడానికంగీకరించినందుకు ఫిలిప్పైన్సు అధ్యక్షుడు క్విరనో అతని దేశంలో చాలా విమర్శలకు గురౌతున్నాడు. జపాన్ నష్టపరిహారాల నికచెల్లించదని తెలిసినతర్వాత విమర్శ అధికమయింది. పసిఫిక్ పాక్టుకి వాస్తవికత కల్పించడంకోసం జపాన్ చీనాల మధ్య ఆర్థికసహకారం వృద్ధిచేసుకోడానికి టోక్యోనుంచి చీనా నాయకులు ప్రతిపాదనలు తెచ్చినందువల్ల లిబరల్ నాయకులు, మితవాద పారిశ్రామిక యజమానులు కమ్యూనిస్టుం పక్షానికి తిరిగిపోయారు.

[సశేషం]



గతవారం న్యూఢిల్లీలోజరిగిన అంతర్ధనివేశ సమాచారసంఘం సమావేశ చిత్రం. భారతప్రతినిధివర్గ నాయకులుగా ఆర్ ఆర్ దివాకర్ ప్రసంగిస్తున్నారు.

రైతులోకంపై స్టాలిన్ రహస్య యుద్ధం

హంగేరీ మాజీప్రధాని ఫెరెన్స్ నాగి

మాస్కో ప్రభుత్వం మాస్కో అనుయాయులూ ఒకపక్షాన, తూర్పు యూరప్, మధ్య యూరప్ దేశాలలోని కర్షకులు మరొకపక్షాన ఉభయులకీ మధ్య కొన్ని సంవత్సరాలుగా అజ్ఞాతయుద్ధం తీవ్రంగా జరుగుతోంది. ఈ అజ్ఞాతయుద్ధంగురించి మిగతా ప్రపంచానికి అంతగా తెలియదు. రష్యా అదుపులో ఉన్న దేశాలలో స్వాతంత్ర్యప్రియులు, ప్రజాస్వామ్యవాదులూ అయిన ఈ కర్షకవర్గం మొక్కలేటె ఈ అజ్ఞాతదేశాలలో స్టాలిన్ నియంతృత్వాన్నెదిరించి పోరాడుతోంది. వ్యక్తి స్వేచ్ఛా నిరోధానికీ, వ్యక్తిగత ఆస్తిపాస్తుల అపహరణకీ, అసంతృప్తిచెంది వాని పునస్సంపాదనకు పోరాడుతున్నారు. వీరి సంగ్రామం పైనే పూర్వప్రపంచం, నూతన ప్రపంచాల (యూరప్, అమెరికాల) భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

తూర్పు యూరప్‌లో మధ్య యూరప్‌లోనూ అధిక సంఖ్యాకులైన వ్యవసాయదారుల్ని కార్మికులుగా మార్చి, వ్యక్తిగతంగా ఆస్తిపాస్తులు కలిగిఉండే వ్యవస్థను మార్చి భూములన్నిటినీ ప్రభుత్వపరంచేసి ఉమ్మడివ్యవసాయం ప్రారంభించి కర్షకుల్ని వేతనాలు పొందే కూలీలుగా మార్చటం, కమ్యూనిస్టుల ఆశయం. వేతన ప్రమాణాల్ని ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఈమార్పు తీసుకురావడానికి అక్కడ ఎంత దౌర్జన్యాలు జరుగుతున్నాయో పశ్చిమ దేశాలవారికి తెలియదు. వర్జీనియాలో ఇప్పుడు ప్రశాంతంగా రైతుజీవనం గడుపుతున్న నాకు నా దేశంలో జరుగుతున్న ఈ అకృత్యాలను గురించి వినవలసి వస్తుందని ఎన్నడూ తలచలేదు. స్వంతభూమిఉండాలని కోరి మనసుకు వచ్చిన రీతిని జీవనం గడపాలని వాంఛించి నందుకుగాను ఈ రైతుల్ని జైళ్లలో పెట్టి హింసించి ప్రాణాలు తీస్తున్నారు. చివరి కివి నమ్మాను.

హంగేరిలో ఒక చిన్న గ్రామంలో ఒక రైతు మద్యగృహంలో ఉండగా ఇద్దరు నూతన వ్యక్తులు ప్రవేశించారు. వారిద్దరు దేశంలో మరెక్కడో రైతని చెప్పారు.

భూమిశిస్తు శాసనాల్నీ, సుంక భారాన్నీ ప్రభుత్వాన్నీ తీవ్రంగా విమర్శిస్తూ ఇద్దరూ చాలాసేపు మాట్లాడారు. రైతు ఒక గంటసేపటి వరకూ వింటూ కూర్చున్నాడు. ఆ తరవాత వీరు కూడా తన మాదిరిగానే కష్టాల్లో ఉన్న రైతులు కాబోలని వారితో మాట కలిపాడు. అణచిపెట్టుకున్న క్రోధాన్ని వెళ్లగ్రక్కాడు. అంతా వింటూ ఆ ఇద్దరూ అవునంటే అవు నన్నారు. మర్నాడు ఉదయమే ఇద్దరూ రైతు ఇంటికి వచ్చి అధికారపత్రాలు చూపించారు. వారిద్దరూ రాజకీయ రక్షకభటులు (పొలిటికల్ పోలీస్) రైతుపైన దేశద్రోహం అరాచక ప్రేరేపణ నేరాలు మోపబడినాయి. క్రమశిక్షణ నిమిత్తం రష్యా పంపబడ్డాడు. ఆ తరవాత అతని పతా లేదు.

రైతులోకంపై కమ్యూనిజంయుద్ధం రష్యాలో విప్లవకారుల ప్రభుత్వస్థాపనతో ప్రారంభ మయింది దేశానికి ఆహారాన్ని ఉత్పత్తిచేసే కర్షకుల్ని అదుపులోకి తెచ్చుకుంటేగాని దేశంలో బోల్షివిజాన్ని స్థిరంగా స్థాపించలేరని మాస్కో ప్రభుత్వం 1920 లోనే గ్రహించింది. ప్రచారంతోనూ, పెద్దపెద్ద వాగ్దానాలతోనూ బీదరైతుల్ని, వ్యవసాయకూలీల్ని పెద్దరైతుల పైకీ, భూమియజమానులపైకీ మాస్కో ప్రభుత్వం రెచ్చగొట్టింది. పెద్దరైతులపైన (కూలక్స్) పేదరైతులు తిరుబాటు చేశారు. "ప్రజావాంఛ" నాదరించి సోవియట్ ప్రభుత్వం కూలక్స్‌వద్దనుంచి భూములు స్వాధీనపర్చుకుని ఉమ్మడివ్యవసాయం ప్రారంభించారు. భూముల్లోనుంచి అనేక వేలమందిని వెళ్లగొట్టి సైబీరియా పంపారు. అనేక వేలమంది మార్గంలో మరణించారు. రష్యాచరిత్రలో ఈ రక్తపాతం మరువరాని దయింది. తరువాత చిన్న రైతుల భూముల్ని కూడా ప్రభుత్వం స్వాధీనపర్చుకుంది.

తూర్పుయూరప్‌లోనూ, మధ్య యూరప్‌లోనూ మాస్కో అనుయాయులైన పరిపాలకులు ఇప్పుడూ సరిగ్గా ఇదేపద్ధతి నవలంబించారు. రుమేనియాలో సగంభూమి ఇప్పుడు ప్రభుత్వం స్వాధీన మయింది. ప్రభుత్వం కూలీలద్వారా ఈ భూముల్ని సాగు చేయిస్తోంది. ఇంకా భూములు గల రైతులచేత విధిగా ప్రభుత్వపు భూముల్లో వారకి రెండురోజులు చొప్పున అత్యల్ప వేతనానికి పనిచేయిస్తున్నారు.

పోలండ్, రుమేనియా, బల్గేరియా, యూగోస్లావియాలలో భూముల్ని ప్రభుత్వపరం చెయ్యడానికి ఆ దేశాలలో కర్షక నాయకత్వానికి స్వస్తిచెప్పడానికిగాను భీభత్సం వ్యాపింపచేసింది మాస్కో. పోలండ్ కర్షకనాయకుడు మికోలోజెక్ దేశాంతరగతుడు కాగానే కర్షకలోకంలో పలుకుబడి గలవారిని 10 వేలమందిని అరెస్టుచేసి రష్యా పంపారు. రుమేనియాలో కర్షక నాయకుడు మానియూను 18 వేలమంది అనుచరుల్తోసహా అరెస్టుచేసి దేశద్రోహం నేరం కింద కారాగారవాసం విధించారు. వారిలో అనేకమంది అంతర్ధాన మైనారు. బల్గేరియాలో కర్షక నాయకుడు డా॥ జార్జియా. డిమిట్రాస్ తప్పించుకున్నాడు. కాని అతని అనుచరుడు నికోలే పెట్కోవ్ ఉరితీయబడ్డాడు. 12 వేలమంది కర్షకుల్ని వారి పొలాలనుంచి వెళ్లగొట్టి రష్యా పంపారు. హంగరిలో మత్యాస్ రకోసీ నాయకత్వం కింద కమ్యూనిస్టులు 1947 లో ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకొని జేలా వర్గమునూ, నన్నూ దేశం నుంచి వెళ్లగొట్టారు. కర్షక నాయకుల్లో మూడో వాడైన బేలాకోవాక్స్‌ను రష్యా పంపాడు. యువక కర్షకనాయకులు దాదాపు అందరినీ ఖైదుచేసి ప్రజాప్రభుత్వంపై ద్రోహం తలపెట్టిన నేరంపై శిక్షలు విధించారు. వారిలో దాదాపు 8 వేల మంది రష్యన్ క్యాంపుల్లోనూ నిర్బంధ కార్మిక కేంద్రాలలోనూ ఉన్నారు.

నాయకులు లేకపోయినా హంగేరిలో కర్షకుల సంఖ్య అత్యధికంగా ఉంది. వెంటనేవారిని అణచివెయ్యడానికి రకోస్ ప్రభుత్వానికి అసాధ్య మయింది. అందుకల్ల రష్యన్ పద్ధతి నవలంబించారు. కూలక్‌ల దౌర్జన్యాలను గురించీ బానిస కార్మికుల పీడన గురించీ పత్రికలు రేడియో తీవ్రంగా ప్రచారం చేశాయి. ఈ బానిసత్వాన్ని విదలించుకోవాలని పేద కార్మికులకు నిత్యం బోధ చేసేవారు. ఆస్తుల్ని సమానంగా పంచాలని ప్రచారం చేశారు.

యుద్ధానంతరం కమ్యూనిస్టులచేతికి చిక్కని ప్రభుత్వాలు అనేకభూమిశిస్తు సంస్కరణలు ప్రవేశపెట్టాయి. పెద్ద పెద్ద ఎస్టేట్లను విడగొట్టి భూముల్ని చిన్నరైతులకూ, వ్యవసాయకూలీలకూ పంచారు. ఎన్నడో ఆస్తిలేనివారికి ఆస్తి వచ్చింది. అయితే ఈపంపకం పక్షాలతో నిమిత్తంలేకుండా జరిగింది. రకోస్ ప్రభుత్వం రాగానే కమ్యూనిస్టుల అదుపులో ప్రాంతీయ కమిటీలు ఏర్పరచి పార్టీ సభ్యులకే భూమిని పంచేలాగ చేశారు.

ఒక వంక చిన్నరైతులకు, పశువుల్నీ విత్తనాల్నీ, కొనుక్కోడానికి ధనసహాయమిచ్చి, ప్రభుత్వానికి చెందిన ట్రాక్టర్లని ఉచితంగా వాడుకోనిచ్చి, తూర్పు యూరప్‌లో అపురూపమైన నూతన ఆధునిక పరికరాల నుపయోగించుకోడాని కిచ్చి, మరొకవంక 15 ఎకరాలు పైబడిన భూమి గలవారిని విపరీతమైన పన్నులతో వేచారు.

పెట్టుబడి పన్నువల్ల సామాన్య రైతులకి నూరింటి 50 వంతులు, పెద్దరైతులకు నూరింట 75 వంతులు తీసుకుంటున్నారు. పదెకరాల పైబడిన భూములు గల వారిపైన భూమిపన్ను, 15 ఎకరాలపైబడిన భూమిగల వారిపైన వ్యవసాయాభివృద్ధి పన్ను వసూలు చేస్తున్నారు. ఈపన్నుల విధానం దోపిడీవలె ఉంది. వీని వల్ల రైతులు అప్పులకు లోనౌతున్నారు. అప్పులపరంగా భూములు ప్రభుత్వపర మౌతున్నాయి.

కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో నిర్మించబడిన కార్మిక నియామకసంస్థ (లేబర్ ఎక్స్చేంజ్) చెప్పినప్రకారమే వ్యవసాయకూలీలు ఎప్పుడు ఎక్కడ పని చెయ్యాలో నిర్ణయం కావాలని ప్రభుత్వం ఉత్తరువు చేసింది. కూలక్స్ కూలీలు కావాలంటే రాదన్నమాటే.

హంగేరిలో మరొక విశేషం. ఏ రైతు ఏభూమిలో ఏ పంట ఎంత పండించాలో వ్యవసాయికోత్పత్తిసంస్థ నిర్ణయిస్తుంది. కూలక్స్ పండించలేని కోటాల్ని ఈసంస్థలు నిర్ణయిస్తున్నాయి, వారిలోపం కనపడగానే దేశానికి ప్రమాదం తెచ్చిపెట్టాలనే ఉద్దేశంతో ఈరీతిగా చేస్తున్నారని ప్రభుత్వపు ఇన్స్పెక్టర్లు నివేదిస్తారు. దానితో కూలక్స్ కారాగారాలకి వెడతారు. దీర్ఘకారాగారవాస శిక్షలు, ఆస్తి జప్తులు, జరిమానాలు, ఆజన్మ కారాగారవాసాలు, మరణం కూడా విధిస్తారు. ఇటువంటి నిర్భాగ్యులవద్ద గుంజిన భూముల్తో హంగేరీ ప్రభుత్వం 2000 ఉమ్మడి వ్యవసాయ కేంద్రాలు స్థాపించింది.

ఉమ్మడివ్యవసాయం గురించి మొదట ప్రభుత్వంచేసిన తియ్యని ప్రచారం చాలామంది రైతులను ఆకర్షించింది ప్రతివారికీ పెద్దపొలాలు ఇస్తారు. చౌకగా విత్తనాలు, ఎరువులూ ఇస్తారు. ప్రభుత్వపు డిపోనుంచి చౌకలో ట్రాక్టర్లు ఇతర పరికరాలు ఇస్తారన్నారు. తప్పకుండా దేశం సంపత్సమృద్ధం కాకతప్పదని ప్రభుత్వం చెప్పింది. రైతులకి ఈ వ్యవసాయం, అమ్మకపు పద్ధతులు రుచించాయి.

"అయితే ఏమి జరుగుతుందో చూశాక కాని దీని సత్యం తెలియలేదు." అని నాతో చెప్పాడొక రైతు. ఈ రైతు పారిపోయి ఆస్ట్రియా చేరాడు. ఉమ్మడివ్యవసాయకేంద్రాన్ని నడిపే పెత్తనదారు ఎక్కడ ఏపంట ఎప్పుడు పండించాలో, ఎవ రెన్ని గంటలు పనిచెయ్యాలో చెప్తాడు. ఎవరికి ఏర్పరచబడిన భూమిలో వారు ఆ రీతిగా విత్తనాలు వేసి, ఆ వ్యవధిలో కోతలు కొయ్యకపోతే వారి ఆహారపు రేషన్లు, లాభంలో భాగాలు తరిగిపోతాయి. ఈ కేంద్రాల పెత్తనదార్లు రైతులు కారు. వారు పోలీసు ఏజంట్లు, గూఢచారులు శిక్ష పడుతుందనే భయంతో ఎవరూ నోరెత్తడానికికూడా సాహసించరు. హంగేరీలో ఈనాడు 200 ఎకరాల రైతేనాసరే పదెకరాల రైతేనా సరే ఉమ్మడివ్యవసాయానికి ప్రతికూలురే.

భూమిగలవారందరినీ ధనవంతులైనాసరే పేదలైనాసరే ధనికవర్గానికి చెందినవారని గ్రహించి వారిని నిర్మూలించాలని మాస్కో నుంచి ఈ ప్రభుత్వాలకి ఉత్తరువు వచ్చింది. అసలు యుద్ధం ఆరంభ మయింది.


తూర్పు యూరప్‌లో రైతు ఎప్పుడూ పొదుపైనవాడే-తననూ తన కుటుంబాన్నీ స్వయంగా పోషించుకుంటాడు. స్వయంగా బంగాళాదుంపలు పండించితింటాడు. స్వయంగా పండించుకున్న ధాన్యాన్నే మిల్లుకు పట్టించుకుని దాన్నే తన ఇంట్లో ఆహారానికి వాడతాడు రైతుల ఈవ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని స్వయంకృషినీ భగ్నం చెయ్యడం కోసమే దాస్యపువెతలు, పశువులపై పన్నులు ఇప్పుడు ప్రభుత్వం విధిస్తోంది. వీని వల్ల రైతు తనకి కావలసిన దానిని మిగుల్చుకో లేకుండా ఉన్నాడు. 1948 లో హంగేరీ ప్రభుత్వం ధాన్యపు లెవీ విధించినందువల్ల రైతులకు వారి ధాన్యం 1949 జనవరి వరకైనా సరిపోలేదు. అప్పటినుంచి రైతు ఆహారప్సప్లైకి ప్రభుత్వం పైనే ఆధారపడవలసి వచ్చింది. ఎటువంటి "రాజకీయ నేరం" చేసినా రైతులరేషన్ కార్డులు లాక్కుని శిక్షిస్తున్నారు

రైతులు ప్రతీకారంగా కొన్ని యుక్తులు పన్నుతున్నారు. వీనిలో "బైసికిల్ పద్ధతి" ని ఇప్పుడు చాలామంది అనుసరిస్తున్నారు కోతలు కొయ్యగానే కట్టలు కళ్లంలో ఉన్నప్పుడు రాత్రివేళ రైతులు సైకిళ్లపై పొలాలు వెడతారు. కట్టల్ని సమంగా పరిచి పక్కన కాన్వాస్ గుడ్డలు పరుస్తారు. సైకిళ్లని కట్టలపై బోర్లించి వెనకచక్రాన్ని తిప్పుతారు. గింజలెగిరి కాన్వాస్ గుడ్డపైన పడతాయి. పని పూర్తికాగానే మళ్లీ కట్టల్ని కట్టి పేర్చి, కాన్వాసు గుడ్డల్లో గింజల్ని మూటగట్టుకుని సైకిళ్ళపైన ఇళ్ళకి తీసుకుపోతారు.

కాని ప్రభుత్వబలంతో పోలిస్తే ఈ యుక్తు లెంత? కమ్యూనిస్టుఏజంటు మోటార్లమీద పల్లెలన్నీ తిరిగి అక్కడా ఇక్కడా పొలాలు పరీక్షించి ధాన్యాన్నీ పశువుల్నీ ఆజమాయిషీ చేస్తున్నారు. రైతుల ప్రవర్తనలో అనుమానం కలిగితే చాలు రైతువద్ద ఏది ఉంటే అది గుర్రాలు, ట్రాక్టర్లు, ధాన్యపుమూటలు, ధనం లాక్కుంటారు. ఏజంట్లనాయకులు ఉచిత మనుకున్న శిక్షలు జరిమానాల మొదలు దెబ్బల వరకూ విధిస్తారు.

హంగేరీలో గాదులు నిండా ఉంటాయి అదనపు ఆహారాన్ని రష్యాకు అపారంగా ఓడల ద్వారా రవాణా చేస్తున్నారు. వీనితో పశ్చిమ రష్యాలో గాదులు నిండి చాలక అనేకవేల టన్నుల ఆహారం ఎండకి ఎండి, వానకి తడిసి పాడైపోతోంది. కాని అధికారరీత్యా బుడాపెస్టులో ప్రభుత్వం ఆహారం చాలా లోపమయిందనీ, ఈ క్షామం వల్ల ప్రజలరిపబ్లిక్‌కే ప్రమాదం ఏర్పడిందనీ ప్రకటించింది దీనికి మందు ఉమ్మడి వ్యవసాయ విధానం ఒక్కటే నన్నాడు రకోసీ. ఇకనుంచి ఉమ్మడి వ్యవసాయకేంద్రాలకి మాత్రమే చౌకగా విత్తనాల్నీ ఎరువుల్నీ ఇస్తారని ప్రకటించారు. ట్రాక్టర్లనీ, ఇతరవ్యవసాయ పరికరాల్నీ ఇతరులకి అమ్మకపోవచ్చుకూడా. ఇదీగాక లెవీలు, పన్నులూ మరింత భారమైపోతాయి.

అయితే మధ్య యూరప్‌లోనూ తూర్పు యూరప్‌లోనూ రైతులకు రష్యాలోరైతుల కంటె విద్య జ్ఞానం ఉన్నాయి అనేక తరాలుగా ఈదేశాలకు యుద్ధకాలంలోగాని శాంతి సమయంలోగాని రైతే ప్రాణాధారంగా ఉన్నాడు. బలవంతాన ఉమ్మడివ్యవసాయంలోకి ఈడ్వబడిన ఒక రైతులయువకుడు నాతో అన్నాడు! నేనే స్టాలిన్ అయితే, ఈ ప్రజాప్రభుత్వాని కేదయినా ప్రమాదం సంభవించేపక్షంలో రైతులదేశభక్తి రైతుల సహాయాన్ని అపేక్షించను."



పంజాబు కాలువసమస్యపై చర్చ జరుపుతున్న ఇండియాపాకిస్తాన్ ప్రతినిధులు ఎన్. గోపాలస్వామి అయ్యంగార్; సర్ మహమ్మద్ జఫ్రుల్లాఖాన్.

మనరాష్ట్రం మనదేశం

★ రాజ్యాంగ పరిషత్సమావేశం
★ అధ్యక్షుని అధికారాలు

రాజ్యాంగ పరిషత్సమావేశం జూలై 30 వ తేదీని తిరిగి ప్రారంభమయింది. వారం రోజుల్లో అనేక ముఖ్యరాజ్యాంగ సూత్రాలపై నిర్ణయాలు చేసింది. యూనియన్ అధ్యక్షునికి అపారమైన అధికారాల నిచ్చింది. దేశంలో ప్రమాదపరిస్థితి ఏర్పడేపక్షంలో, సామాన్య పరిపాలనా యంత్రాంగాన్ని రద్దుపరిచి గవర్నర్ ద్వారా పరిపాలన సాగించడం, సామాన్యపౌరస్వత్వ హక్కులకు సంబంధించిన న్యాయశాసనాలను తాత్కాలికంగా రద్దుపరచడం మొదలైనవి. పన్నుల్లో కేంద్రం రాష్ట్రాలపంపకం, ఉప్పుపై పన్ను, రాష్ట్రశాసనసభల్లో కౌన్సిల్ మొదలైనవానిపై చర్చ జరిగింది. ఆస్తిని ప్రభుత్వం స్వాధీనపర్చుకునే సందర్భంలో నష్టపరిహారం చెల్లించడంగురించి కూడా చర్చ జరిగింది.

రాష్ట్రశాసనసభల్లో కౌన్సిల్ ఉండాలా ఉండకూడదా అనే విషయాన్ని ఆయా రాష్ట్రశాసనసభలకే విడిచిపెట్టారు. అసెంబ్లీలో మూడింట రెండువంతులమంది వోటుతో కావాలో అక్కరలేదో నిర్ణయించుకోవాలి. కౌన్సిల్ ఉండేచోట వాని అధికారాలు తగ్గింపబడతాయి. ఏశాసనమైనా అసెంబ్లీ ఆమోదించిన తరవాత కౌన్సిల్ దానిని చర్చించి మొదటి పర్యాయం మూడుమాసాలకంటె, రెండో పర్యాయం ఒకమాసంకంటె జాప్యం చెయ్యడానికి వీలులేకుండా ఏర్పాటు చెయ్యబడింది. రెండు సభలకూ ఏశాసనం విషయంలోనైనా ఒకేనిర్ణయం కుదరనిపక్షంలో రెండూ కలిసి సభచేసి నిర్ణయించాలని మొదట రచనాసంఘం ప్రతిపాదించింది. ఇప్పుడా ప్రతిపాదనను ఉపసంహరించుకుని పై ప్రతిపాదన చేసింది. అసెంబ్లీ ఆమోదించిన శాసనాన్ని కౌన్సిల్ నిరాకరించేపక్షంలో అసెంబ్లీ దానిని తిరిగి చర్చించి ఆమోదిస్తే చాలు దానిని అమలుజరపడానికి గవర్నరు ఆమోదించవచ్చును. అసెంబ్లీ రెండో పర్యాయం చర్చించే సమయంలో శాసనంలో అవసరమనుకున్న సవరణల్ని ప్రతిపాదించవచ్చుకూడా. దీనివల్ల కౌన్సిల్ ఉండి ఉపయోగంలేదని పండిట్ కుంజ్రూ ప్రభృతులు వాదించారు:

శాసనసభకి విద్యాహీనులూ, అనుభవహీనులూకూడా సభ్యులు కాగలిగే అవకాశం ఉన్నందువల్ల, అనుభవజ్ఞుల్ని స్థానికసంస్థలు, వాణిజ్యసంస్థల ప్రతినిధుల్ని, వృత్తులు విశ్వవిద్యాలయాల ప్రతినిధుల్ని చేర్చి కౌన్సిల్ను నిర్మించినట్లయితే, కౌన్సిల్కి కూడా శాసనసభతో సమానంగా అధికారాలు ఇవ్వడం దేశానికి మేలని బ్రజేశ్వరప్రసాద్ గారు వాదించారు. ఉభయసభల సంయుక్త సమావేశంవల్ల అనుభవజ్ఞుల వాదాల్ని ఇతరులు వినే అవకాశం ఇచ్చినట్లవుతుందనీ, అప్పుడు వారి నిర్ణయాలు తీసుకోవడం మంచిదని చెప్తూ, అందువల్ల సంయుక్త సమావేశాల పద్ధతిని మానరాదని వారన్నారు. చివరికి కౌన్సిల్ అధికారాలను పరిమితంచేసే సవరణప్రతిపాదన ఆమోదించబడింది.

ఆయవ్యయాలకు సంబంధించని శాసనాల్ని గవర్నరు ఒక్కొక్కప్పుడు అనుమతించకుండా తిరిగి శాసనసభకు పంపే అధికారం ఇవ్వబడింది. యూనియన్ అధ్యక్షుని అనుమతి తీసుకోవలసిన శాసనాల సందర్భంలోకూడా అటువంటి అధికారం అధ్యక్షునికి ఇవ్వబడింది. గవర్నరు శాసనాల్ని తిరిగి పంపేటప్పుడు మంత్రివర్గంతో సంప్రతించి వారి సలహాపైనే పంపవలసి ఉంటుంది.

ఢిల్లీ, అజ్మీర్ మర్వారా వంటి కేంద్రప్రభుత్వపరిపాలిత ప్రాంతాలకు సంబంధించిన ఏదోభాగంపైన చర్చజరిగింది. ఈప్రాంతాల్ని యూనియన్ అధ్యక్షుడు చీఫ్ కమిషనర్లద్వారా గాని, లెఫ్టినెంట్ గవర్నర్లద్వారాగాని పరిపాలిస్తారు. ఈప్రాంతాల్ని స్థానిక శాసనసభలద్వారాగాని, మునిసిపల్ సంఘాలద్వారాగాని పరిపాలించే విషయమై నిర్ణయాధికారాన్ని అధ్యక్షునికి బదులు పార్లమెంటు కిస్తూ డా॥ అంబేద్కర్ ప్రతిపాదించిన సవరణ ఆమోదించబడింది. ఈ సందర్భంలో దేశబంధు గుప్తా ప్రభృతులు ఢిల్లీని ప్రత్యేక రాష్ట్రంగా నిర్మించాలనీ, కేంద్రప్రభుత్వంవల్ల కాకుండా ప్రత్యేకరాష్ట్రప్రభుత్వం ద్వారా పరిపాలింపచేయాలనీ వాదించారు. ఢిల్లీ నగర పరిపాలన గురించి విచారించడానికి ఇదివరలో భారతప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. కాలమూ పరిస్థితులూ మారినందువల్ల ఆ కమిటీ నివేదిక ఇప్పుడు ఆచరణయోగ్యం కాదని పండిట్ నెహ్రూ చెప్పారు. కేంద్రప్రభుత్వ పరిపాలనలో ఇప్పుడున్న ఢిల్లీ, అజ్మీర్ - మర్వారా, కూర్గు కాక ఇతర ప్రాంతాలేవైనా రావచ్చునని చెప్తూ వాని భవిష్యత్తును ఇప్పుడు రాజ్యాంగ నిర్మాణంలో నిర్ణయించకుండా పార్లమెంటుకు విడిచిపెట్టి ముందు ఒక శాసనంద్వారా నిర్ణయించడం మంచిదని పండిట్ నెహ్రూ సూచించారు. తరవాత తిరిగి దీర్ఘచర్చ జరిగింది. న్యూఢిల్లీ మినహా ఢిల్లీ నగరాన్ని తూర్పుపంజాబుతో చేర్చాలని చాలమంది సభ్యులు వాదించారు. సంయుక్త పరగణాలతో చేర్చాలనే వాదంవినిపించనేలేదు. ఢిల్లీ మారిపోయిందనీ, పంజాబ్ శరణార్థులతో నగరం నిండిఉన్నదనీ, అందువల్ల ఆ నగరం ఇంక తమ రాష్ట్రంలో చేర్చనక్కరలేదనీ మహావీరత్యాగీ, మోహన్లాల్ గౌతమ్ మొదలైనవారు చెప్పారు. ఒకవిధంగా "తూర్పుపంజాబ్ను ఢిల్లీలో చేర్చివెయ్యడం" మంచిదని వారన్నారు. చివరికి పార్లమెంటుకు నిర్ణయాధికారాన్ని విడిచిపెట్టాలనే ప్రతిపాదన ఆమోదించబడింది.

అధ్యక్షుని అధికారాలు:

దేశానికి ప్రమాదపరిస్థితు లేర్పడే పక్షంలో, అనగా అన్యులదురాక్రమణవల్ల గాని, దేశంలో అరాచకంవల్లగాని, ప్రమాదపరిస్థితు లేర్పడితే, ఆప్రాంతంలో సామాన్యపరిపాలనా యంత్రాంగాన్ని అధ్యక్షులు స్వాధీనపరుచుకోడానికి ఏర్పాటుచెయ్యబడింది. ప్రమాద పరిస్థితుల్లో గవర్నర్లు స్వయంగా పరిపాలనను స్వాధీనపర్చుకునే ఏర్పాటు 1935 రాజ్యాంగంలో ఉంది. కాని ఇప్పుడా అధికారాల్ని అధ్యక్షుని కిస్తున్నారు! అధ్యక్షుని ప్రకటనానంతరం అసాధారణ పరిపాలనావిధానం ఆరుమాసాలు అమలులో ఉండవచ్చుననే ప్రతిపాదనకు రచనాసంఘంతరపున డా॥ అంబేద్కర్ సవరణ ప్రవేశపెట్టారు. దీని ప్రకారం రెండుమాసాలవరకే అమలులో ఉంటుంది. ఆపైన పార్లమెంటు అవసరమని తలిస్తే అసాధారణ పరిపాలనా విధానాన్ని పొడిగించవచ్చును.

ఈ ప్రతిపాదనపైనా సవరణలపైనా సభలో తీవ్రవిమర్శన వచ్చింది. దీనితో ప్రజాస్వామ్యం నామమాత్రంగా మాత్రమే మన రాజ్యాంగంలో మిగులుతుందని ప్రొఫెసర్ షా అన్నారు. ఇటువంటి ఏర్పాటు ఏ ప్రజాస్వామ్యంలోనూ లేదన్నారు. ఈ ప్రకటన చేసేముందు అధ్యక్షులు మంత్రివర్గం సలహా పొందాలని కొందరు సూచించారు ఈ ఒక్క విషయంలో అటువంటి ఏర్పాటు చేస్తే మిగతా విషయాలలో అధ్యక్షుడు మంత్రివర్గాన్ని సంప్రదించకపోవచ్చుననీ, సంప్రదింపుల విషయాన్ని సామాన్య ఆచారంగా విడిచిపెట్టడం మంచిదనీ టి. టి. కృష్ణమాచారిగారన్నారు. దేశంలో ఇప్పుడున్న పరిస్థితుల్ని సభ్యులకు జ్ఞప్తికి తెస్తూ అధ్యక్షుని అధికారాలకు ఆక్షేపణ ఉచితంగాదని చెప్పారు. ప్రమాదపరిస్థితుల్లో వ్యక్తిగత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు కొంత నిర్బంధం కలిగినా దేశక్షేమం దృష్ట్యా ప్రజ లీపాటి త్యాగం చెయ్యవలసిన అవసరం ఉంటుందన్నారు. జరిగిన కొంతసేపూ తీవ్ర చర్చ జరిగినా త్వరలోనే ఈ ప్రతిపాదన ఆమోదించబడింది.

తరువాత అధ్యక్షుడు ఈ అసాధారణ అధికారాల్ని ఏక్రమంలో ప్రయోగించాలో వివరించే రెండు ప్రతిపాదనలామోదించబడినాయి. ప్రమాదపరిస్థితిని గవర్నరు అధ్యక్షునికి తెలపవచ్చును. లేదా అధ్యక్షుడే స్వయంగా ప్రకటించవచ్చును ఏరాష్ట్రానికి గాని, సంస్థానానికి గాని ఆంతరంగిక కల్లోలం లేదా అన్యుల ఆక్రమణవల్ల ప్రమాదం ఏర్పడితే, ఆ ప్రాంతాలను కాపాడే బాధ్యత కేంద్రప్రభుత్వంపైన మోపుతూ ఒక ప్రతిపాదన తేబడింది ఈ ప్రతిపాదనలపై పండిట్ కుంజ్రూ, డా॥ దేశ్ముఖ్, కామత్, నజీరుద్దీన్ అహ్మద్ గార్లు తీవ్ర విమర్శలు చేశారు. వీనివల్ల రాష్ట్రస్వపరిపాలన భగ్నమౌతుందనీ, కేంద్రప్రభుత్వ జోక్యం అధికం కాగలదనీ చెప్పారు. కాని ప్రస్తుత పరిస్థితుల్ని గమనిస్తే రాష్ట్రప్రభుత్వాల పరిపాలనలో కేంద్రప్రభుత్వం అనవసరంగా జోక్యం చేసుకునే ప్రమాదం అంతగా కానరాదనీ, రాష్ట్రాల ప్రాంతీయాభిమానం, విచ్ఛిన్న ప్రవృత్తి అధికంగా కానవస్తున్నవనీ, కేంద్రప్రభుత్వచర్యల పట్ల రాష్ట్రపాలకుల నిరసన అధికమౌతున్నదనీ జైదీగారు చెప్పారు.

ఏరాష్ట్రంలోనైనా పరిపాలనా యంత్రాంగం రాజకీయహేతువులవల్లగాని, ఇతరకారణాలవల్లగాని స్తంభించిపోయినట్లయితే, గవర్నరు నివేదిక ఆధారంపై అధ్యక్షుడు రాష్ట్రశాసన కార్యక్రమాల్ని, పరిపాలనను కేంద్ర పార్లమెంటు అధికారం కిందికి తేవలెనని ఒక కొత్త ప్రతిపాదన తేబడింది. అవసరమైనపక్షంలో ఈరాజ్యాంగంలోని కొన్ని నియమాలను అధ్యక్షుడు తాత్కాలికంగా ఆరాష్ట్రానికి వర్తింపకుండా

(17-వ పేజీ చూడుడు)



ప్రపంచపర్యటన చేస్తున్న అమెరికా యువజననాయకులు గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిని సందర్శించినప్పటి ఫోటో.

దక్షిణదేశ దేవాలయాలు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

పచ్చని పచ్చికబయళ్లలో, ముచ్చట గొలుపుచున్న సుందరనారికేళ వృక్షములమధ్య, నాకాశము నంటుచున్న హైందవ దేవాలయ గోపురము దక్షిణదేశ యాత్రికుని కేకైకదృశ్యమై సాధారణముగా దృష్టి గోచరమగుచుండును. ఉత్తరభారతము భోగభూమి యని, దక్షిణభారతము కర్మభూమి యని, చెప్పబడుచున్నది. భారతదేశచరిత్రమును బరిశీలించిచూచినయెడల నుత్తర భారతవాసులు రాజసవృత్తితో రాజ్యము నేలుచు, రాజ్యసంపాదనమునకై రక్తపుటేరులు పారింపుచుండిన కాలమున దక్షిణభారతదేశవాసులు సాత్వికులై, సచ్చిదానందరూపము పరబ్రహ్మము నుపాసించుచు సత్యాన్వేషణము జరుపుచుండిరను విషయము తెలియగలదు. ఉత్తరభారతీయులు దేశమునంతటి నొక్క కాలికిక్రి దెచ్చి దేశమును సర్వసంపత్సంపన్నముగా, సుభిక్షపఱుపగా దక్షిణభారతమున విద్యారణ్యుడు, శంకరాచార్యులు, రామానుజాచార్యులు మొదలగు మహనీయులు జన్మించి యుత్తరభారతమునకు జ్ఞానభిక్షము ప్రసాదించిరి! ఈ మహనీయుల నిరంతర కృషి ఫలితముగా దక్షిణభారతమున భక్తివ్యక్తి ప్రబలమైనది అందుకై దేవాయతనములు వెలసినవి!

భారతదేశమునందే నెలకొనిన యనేకములగు నితర మతములవారి దేవాయతనములకును, మన దేవాయతనములకును స్వరూప నిర్మాణములయందు కొంత భేద మగపడుచున్నది. పరిశీలనాదృష్టి లేనివారి కన్ని దేవాలయములు నొకేరీతిని నగపడుచున్నను నిర్మాణమునుబట్టి, నిర్మితకాలమునుబట్టి, యందారాధింపబడు దైవభేదమునుబట్టి యీ దేవాలయము లొకదానితో మఱొకటి భేదించుచున్నవి.

ఇక్ష్వాకుల నాడెన్నడో యే మహర్షి సత్తముని చేతనో దైవప్రతిష్ఠ పడసిన యీ దేవాలయములు పవిత్రపుణ్యస్థలములై యవి వెలసిననాటనుండి భక్తి సంస్కృతులకు ప్రధాన ప్రచారవాహికగా బనిచేయుచు పామర ప్రజానీకమున కమూల్యమయిన సేవ చేయుచున్నవి. ఈ పవిత్రస్థలములు సంపత్సంపన్నములై సంస్కృతి వైభవోపేతములై భగవదనుభూతి సాధనములై వెలయుచు పవిత్రముగా పారమార్థికముగా జీవితముల గడుపునటుల నానాడు ప్రజల కుద్బోధించుచున్నవి.

భారతదేశమున చాల ప్రాచీనకాలము నుండియు నీ దేవాలయములను నిర్మించుట ఒక పుణ్యకార్యముగా, ఒక పవిత్ర సంప్రదాయముగా నెంచబడుచున్నది. సప్తసంతానములలో దేవాలయములను నెలకొలుపుటయు నొకటిగా పేర్కొనబడుచున్నది. నన్నిచోడుని కుమారసంభవములో సప్తసంతానముల పరిగణన మిది చూడుడు -

"పూని మహాగ్రహార పురపుత్ర
సమున్నతి దేవతాలయో
ద్యాన తటాక సత్కృతి నిధాన
ములాశిశి తారకంబు సు
స్థానములై మహింబరగు
జంగమ మల్లయపేర సప్తసం
తానము లొప్ప నల్పుడు
ముదంబున దత్ప్రభు నాజ్ఞ పెంపునన్."

నన్ని - కుమారసంభవము - అవతారిక 46,

'కుక్కను చంపిన పాపము గుడికట్టినా పోదు' అను తెలుగుసామెత దేవాలయనిర్మాణమును ఒక పవిత్రకార్యముగా పేర్కొనుచున్నది.

దేవాలయ నిర్మాణవిధానము సరిగా నేకాలమున ప్రారంభింప బడినదో చెప్పుటకు దగిన యాధారములు కానరావు. భారతదేశమున చరిత్రకందని కాలమునకు జెందిన శవసమాధు లిటీవల కనుగొనబడినవి. చరిత్రకారు లా శవసమాధులను బరిశీలించి యది చరిత్ర కందని కాలపువానిగా (*Prehistorie*) నిర్ణయించిరి. ఆ శవసమాధులు లభించిన స్థలముల దెలుపు చిత్రపటములుగూడ ప్రకటింపబడినవి. వానినిబట్టి యాశవసమాధులు గానిన స్థలములే యానాడు జనపదస్థలములై యుండి తక్కిన ప్రదేశమంతయు నరణ్యప్రాయమై యుండియుండెనగు నని యూహింపదగును. ఆ శవసమాధులను ద్రవ్వి చూడగా నందు ఒక తొట్టె, అందులో మనుష్యుడు, తొట్టెలో మానవునికి గావలసిన యాహారాదిపరికరము, ఒక దీపము ఉన్నటులు తెలియుచున్నది. తొట్టెమూసి మన్నుకప్పి సమాధిజ్ఞాపకముగా నా సమాధిపై నొకరాతిని పాతుదురు. అతిప్రాచీనమయిన యీ సంప్రదాయమే కాబోలు ఆర్యుల పితృమేధకర్మములకుగూడ నెక్కినది. ఆర్యుల పితృమేధకర్మములలో 'శిలాస్థాపనము' చేయుదురు. శిలాస్థాపనము గావించి యా శిలకు అభిషేకాదులుచేసి పుణ్యనదులలో కలుపుదుర. ధనవంతులుగా నున్నవారు శిలను భూమిలో పాతి యాచోట శివలింగము ప్రతిష్ఠింతురు. ఇట్లు శవసమాధిస్థలములపై శిలాస్థాపనము చేయు సంప్రదాయమే దేవాలయనిర్మాణమునకు మూలసూత్ర మయి యుండు నని యూహింపదగియున్నది. ఇట్లనుటకుగూడ కొంత సాక్ష్యము కలదు. చిదంబరము వ్యాఘ్రపాదుని సమాధిస్థలముగా పేర్కొందురు. నటరాజస్వామి పతంజలిసమాధి యని చెప్పుదురు. మధురలో సుందరేశ్వరస్వామి దేవాలయము సుందరపాండ్యుని సమాధిపై యతని పేర వెలసినది. ఆంధ్రదేశములో గణపేశ్వరు డను కాకతీయసార్వభౌముని సమాధిపై గణపేశ్వరస్వామి యనుపేర శివలింగమును ప్రతిష్ఠాపించిరి. దాక్షారామ భీమేశ్వరాలయము చాళుక్యభీమేశ్వరుని సమాధిస్థలముగా పేర్కొందురు. చోడేశ్వరస్వామి వెలనాటిచోడుని సమాధియని, రుద్రేశ్వరస్వామి కాకతీయ ప్రతాపరుద్రుని సమాధియని చెప్పుదురు. శైవసిద్ధాంతము ప్రకారము శైవుడు మరణించిన పిదప లింగైక్యము చెందును. అట్లు లింగైక్యము చెందిన శైవభక్తుని పేర లింగము ప్రతిష్ఠించి యా చనిపోయినవారి జ్ఞాపకముగా దేవాలయములు నెలకొలుపుచుండినట్లు పయివృత్తాంతములబట్టి యూహింపదగును.

పయిని పేర్కొనిన చరిత్రవిషయములనుబట్టి చూచినయెడల తొలుత శైవాలయములే వెలసి యుండెదను నని, పిదప విష్ణ్వాలయములు నెలకొని యుండెదుననని యనుమానించుట కవకాశము కలదు. విష్ణుమూర్తి మూలబింబముకూడ శివలింగమువలెనే తొలుత శిలారూపముగానే యుండి, కొంతకాలమునకు బిదప రూపకల్పన జరగియుండు నని యూహింపదగును. *"god made man in his own shape. Man made god in his own shape."* భగవంతుడు మానవుని దన రూపముతో సృష్టింపగా మానవుడును దైవమునకు దన రూపమే కల్పించినాడు! భగవంతునికి దనరూపము గాక వేఱు రూపము కల్పించుటకు మానవహృదయ మంగీకరింపదు. 'సర్వ స్సగం స్సేషు విశ్వసితి' యని కదా యార్యోక్తి! ఇట్లు వెలసిన యీ దేవాలయములకు రాజులు మాహాత్మ్యములు కల్పించిరి. ఆళ్వారులు, నాయనార్లు వెలసి ఈశ్వర తత్వమును, మాహాత్మ్యమును అనుభూతిసాధ్యము చేసిరి. మహర్షితుల్యులయిన వారి సంకల్ప బలముబట్టి, వారి రచనములబట్టి యీ యా దేవాలయములకు మహిమాదికము లేర్పడినవి.

గ్రంథ ప్రమాణములబట్టి చూడగా మహాభారత రచనాకాలమునకే యీ దేవాలయ నిర్మాణాదికము వెలసినట్లు తెలియవచ్చుచున్నది. మహాభారతములో నారాయణీయోపాఖ్యానమున పాంచరాత్ర వైఖానస శైవాగమములు పేర్కొనబడినవి. కనుక మహాభారతరచనాకాలమునకు దేవాలయములు, వానికై యాగమశాస్త్రములు వెలసినట్లు చెప్పకొనవచ్చును.

కాని చరిత్రకారులు బుద్ధుని యవతారమునకు బిదప బౌద్ధస్తూపనిర్మాణములను జూచి వైదిక మతమునకు జెందినవారు తమ యిష్టదైవములకు దేవాలయాదికమును వినిర్మించియుందురని యూహించుచున్నారు. ఇందేది యెంతవఱకు విశ్వాస్యమో తెలియదుగాని క్రీస్తుపుట్టుకకు పూర్వము రెండవశతాబ్దివాటికే భారతదేశమున గంగానదీప్రాంతప్రదేశమున దేవాలయ వినిర్మాణము జరుగుచుండినట్లు ప్రత్యక్షప్రమాణము లభించుచున్నది. భోపాలు సంస్థానములోని 'బెజ్‌నగర్' అనుచోట గల మహావిష్ణు దేవాలయము క్రీస్తుపూర్వము రెండవ శతాబ్ది నాటిదిగా గుర్తింపబడుచున్నది. అది చక్కని యిటుకరాళ్ళచే గట్టబడిన సుందర దేవాలయము! దీనినిబట్టి క్రీస్తుపూర్వపు రెండవ శతాబ్ది కింకను బూర్వమే యనేక దేవాలయము లింతకంటెను ప్రాచీనమైనవి వినిర్మింపబడియుండునని, నేడు మన కవి లభించుటలేదని మనము తెలిసికొనవచ్చును.

క్రీస్తుశకము రెండవశతాబ్దినాటిదిగా చెప్పబడుచున్న 'శిలప్పదికారము' అను ప్రఖ్యాత ద్రవిడ మహాకావ్యమునందు గొన్ని దేవాలయములు పేర్కొనబడినవి.

కావేరిప్పూం పట్టణాధిపతియగు చోళుడు తన నగరమున ప్రతివత్సరము జరుపుచుండిన యింద్రోత్సవము నా సంవత్సరముగూడ మహావైభవముతో జరుపునటుల తన ప్రధానమంత్రి యగు వళ్లువని కాజ్ఞాపించినాడు. అతడు ఏనుగనెక్కి నగరవీథులవెంట బోవుచు నింద్రోత్సవము చాటుచున్నాడు. ఆ సందర్భమున నతడు ఆ నగరములోని దేవాలయములను ఒకటి వెంబడి నొకటి పేర్కొని యా దేవాలయములందు నాడు మహావైభవముతో రానాధనాదికములు జరపి యుత్సవములు జరుపుడని ప్రజలకు ప్రబోధించుచున్నాడు. ఆ నగరములోని దేవాలయముల పరిగణన మిది చూడుడు—

"పిరవాయాక్కై పెరియోన్ కోయిలుం
అరుముగన్ శాలేల్ అణికిల్ కోయిలుం
వాల్‌వళై మేని వాలియోన్ కోయిలుం
నీలమేని నెడియోన్ కోయిలుం
మాలైవెణ్ కుడై మన్నవన్ కోయిలుం
నాల్‌వగై దేవరుం మూవఱు గణంగళుం
వేఱు వేఱు కడవుళర్ సారుశిరంద్ ఒరుబాల్
అఱవోర్ పళ్ళియుం అఱవోం పడయుం"

'శిలప్పదికారము'

ఇందు శివునికి, సుబ్రహ్మణ్యస్వామికి, బలరామునికి, మహావిష్ణువునకు, దేవేంద్రునకు, ద్వాదశాదిత్యులకు, ఏకాదశ రుద్రులకు, అశ్వినీ దేవతలకు ఆనాటికే వెలసియుండిన దేవాలయములు పేర్కొనబడినవి. నాడు కావేరిప్పూంపట్టణమున బౌద్ధ, జైనదేవాలయములు కూడ నుండినవి! మఱికొన్ని సందర్భములందు గూడ నీ కావ్యమున మఱికొన్ని దేవాలయములు పేర్కొనబడినవి.

క్రీస్తుశకము ఒకటవ శతాబ్దిదో రెండవ శతాబ్దిదో యని చెప్పదగిన హాలుని 'సాతవాహన సప్తశతి' యందును నీ దేవాలయముల ప్రశంస కలదు. చూడుడు—

ఉయరివరదట్ట ధణ్ణాయ
ణిలుక్కపారావయాణ విరుయేహిం
ణితణాయి జాయవే యణు
సుణ్ణహిణ్ణం వదేవులయం.

1 శత. 64 గాథ.

పల్లెటూళ్ళలో గూడ నానాడు దేవాలయములుండినట్లు ఈ గాథ తెలుపుచున్నది

'సాలేయి అచ్ఛభల్లంప ఉయహకుగ్గామదేఉలద్దారే,
హేమన్త ఆలపహియో విజ్ఝాయన్తం పలాలగ్గిం'చాయ—

పాటయ త్వచ్ఛభల్లమివ
పశ్యత కుగ్రామ దేవకులద్వారే
హేమన్త కాలపథికో
విధ్మాయమానం పలాలాగ్నిమ్.

11 శత వి గాథ

వీనినిబట్టి క్రీస్తుశకము ఒకటి రెండు శతాబ్దముల నాటికే ప్రతి పల్లెటూరియందు గూడ దేవాలయములు వెలసియుండినట్లు ఊహింపదగును.

దేవాలయవినిర్మాణ మిట్లు చురుకుగా సాగుచుండగా నీ దేవాలయములం దారాధింపబడు దైవములు, దేవాలయనిర్మాణమునకు దగిన నివేశనములు. దేవాలయ స్వరూప భేదములు, పూజా ప్రకారాదికములు, తత్పూజాకాలములు, ఆయా దేవులకు నివేదనము చేయవలసిన యాహారాది పరికరములు, దేవార్చనమునకై నియోగింపబడు నర్చకుల యోగ్యతాదికములు - వీనిని గూర్చి తెలియ జేయుటకు శాస్త్రములు వెలసినవి. శిల్పశాస్త్రములు, శైవాగమములు, వైష్ణవాగమములు, వైఖానసాగమములు ఇందుకై యేర్పడినవే! ఈ యాగమములలో జెప్పబడిన రీతిని విగ్రహప్రతిష్ఠ జరగి పూజాదికములు యథావిధిగా నిర్వర్తింప బడుచో నా విగ్రహము మహిమోపేతమై దేశసౌభాగ్యము నినుమడింపజేసి ప్రజల నెల్లవేళల ననుగ్రహించుచుండు నని పెద్దల నమ్మిక.

దక్షిణదేశములో దేవాలయములు ప్రాచీన సంప్రదాయముల ప్రకారము కొన్ని ప్రత్యేక స్థలములయందు మాత్రమే నిర్మింపబడుచున్నవి. వారు వారు ప్రతిష్ఠించు విగ్రహస్వభావమును బట్టి కొన్ని దేవాలయములు కొన్ని చోటుల యందుమాత్రమే కట్టుచుండిరి. ప్రతిష్ఠింపబడు విగ్రహాధిదైవత మొక్కటే యయినను ఆయా విగ్రహముల శిల్పనిర్మాణభేదమునుబట్టియు నీ దేవాలయ నివేశనములు భేదించుచున్నవి. అందుచే నొక్క దేవుడే విగ్రహశిల్పభేదమునుబట్టి వివిధ స్థలములతో నుండుటకు వీలగుచున్నది. సాధారణముగా నీ దేవాలయములు నదీతీరములయందును, నదీ సంగమప్రదేశములయందును, సముద్రతీర ప్రదేశములందును, గ్రామములలోను, పర్వతముల మీదను, పర్వతములకు దిగువను, మహనీయులును, మహర్షులు వెలసిన, వెలయుచున్న పుణ్యస్థలముల యందును నిర్మింపబడుచున్నవి. ఉత్తరదేశములో తీర్థములకు, దక్షిణదేశములో క్షేత్రములకు, ప్రసిద్ధి. పుణ్యనదీప్రశస్తివలన నా తీర్థములకును, క్షేత్రనాయకుల ప్రభావాదికములవలన నాయా పుణ్యక్షేత్రములకును కీర్తిప్రతిష్ఠలు చేకూరినవి.

దేవాలయములలో ప్రతిష్ఠింపబడు మహావిష్ణు విగ్రహము సాధారణముగా నైకొందము.

(18-వ పేజీ చూడుడు)



రాజమండ్రిలో వీరేశలింగం హైస్కూలులో శ్రీ॥ శ్రీ॥ డాక్టరు గురుమూర్తిగారి ఛాయాపటమును శ్రీ బులుసు సాంబమూర్తిగారు ఆవిష్కరించినప్పటి చిత్రం

కథానిక

పెద అర్థాలు

శ్రీ కందుకూరి లింగరాజు

రామయ్యపంతులు ఒక్కసారి ఊపిరినిండా గాలి తీసుకున్నాడు. అందులో తృప్తి నిండింది. ఇన్నాళ్లు తిరిగిన శ్రమ, పడ్డ ఆవేదన ఆఖరైం దన్న భావనా కల్గింది.

ఈ కుర్చీలో కూర్చుంటే, వెనుక కొద్దినెలల నుండి తను కూతురు పెళ్లికి తిరిగినశ్రమ, ఖర్చు పెట్టినడబ్బు ఆఖరుగా పెళ్లి అమాంబాపతు అయిన ఏడువేల రూపాయిలు అన్నీ తిరుగుతాయి. పెళ్లికొడుక్కు ఆస్తివుంది, చదువువుంది తండ్రి మంచి పేరుప్రతిష్ఠలు ఉన్న వ్యక్తి అనే, అన్ని జిల్లాలు దాటివా ఆ సంబంధం నిర్ణయించుకున్నాడు. జిల్లాలు భేదంతో, ఆచారాలు భాషలూమారినా, భావిలో సుఖంగా వుంటుందన్న ధైర్యంలోనే నిశ్చయించేసేడు. ఇంట్లో మంగమ్మ మొదట్లో కొస్త జంకు చూపించింది. వాళ్ల ఇల్లు, ఫోజు, డబ్బుసంగతి చెప్పినపుడు, ఇంకే మనలేకనే, ఇప్పటికైనా అల్లుణ్ణి ఓవాడిని సంపాదించుకున్నానని అనువయం చేసుకుంది.

సాటివారు! "అంత దూరం సంబంధం చేసేరు. అమ్మాయి ఏం కష్టపడుతుందో" అన్న అధైర్యం పోసేసరికి, కొంచెం బెంగపెట్టుకున్నా మనగుడుపులకు వచ్చినపుడు, అల్లుడి విషయంలో, ఏవిధమైన విచిత్రఆలోచనలు పెట్టుకోవడం గాలిలో మేడలు అనుకుంది దాంతో అమ్మాయిని పువ్వుల్లో పెట్టుకునే పూజిస్తా డన్న ధైర్యం కల్గింది.

ఇప్పుడు, కూతురులేని ఇల్లు చూస్తుంటే, చాలా బాధగానే వుంది రోజూ ఏదో అల్లరి చేస్తూ, కేకలు వేస్తూవుండే సుందరి లేకపోవడం, చీకటిగదిలో కూర్చోపెట్టినట్లే వుంది. విస్తరి దగ్గరకూర్చున్నపుడు ఆయ నాతనూ కూడా బెంబేలుపడిపోయి, సుందరికబుర్లు రుద్ధంగానే చెప్పుకోవడంతో సరిపోయేది.

రోజూతారీఖులు చూచేది. సుందరి వెళ్లి అప్పుడే మూడునెలలు అవవస్తోంది. వెళ్లేముందు, 'అమ్మ, నీకు మూడురోజుల కోసారి ఉత్తరం వ్రాస్తా' అని వాగ్దానం ఇచ్చే వెళ్లింది. మూడు రోజులకి ఆ మొదట్లో ఉత్తరాలు వచ్చేవి. కాని నెలా అయ్యేసరికి ఆవుత్తరాలు కరువైయ్యేవి. ఒకటి రెండుసార్లు తను వ్రాసింది;' అమ్మని మర్చిపోయేవా ? అని. ఏదో వేళాకోళంగానే సమాధాన మిచ్చేది ఆ ఉత్తరాల్లో అల్లుడు ఏదోఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడని, అది తప్పక అవుతుందని ఉండడంతో మురిసింది అల్లుడూ కూతురూ వేరుగా కాపరం పెడతాన్లు అనేసరికి తన మొట్టమొదటి రోజులు జ్ఞాపకం వచ్చింది. అందులోవున్న మాధుర్యం, స్వేచ్ఛ; తను మొదట వేరుపడిన వయస్సుకన్న, చిన్నవయస్సులోనే వెళ్లడం, సంతోషం కల్గించింది.

ఆరాత్రి ఆయనా, ఆవిడాకూడా ఎన్నో విషయాలు జ్ఞాపకం చేసుకున్నారు. అన్నిట్లలోనూ సుందరిని గూర్చి, అల్లుణ్ణిగూర్చి మాటలు ఒచ్చేయి. వేరుసంసారానికి కావలసిన సారె అంతా ఏమేమో ఏ కరవు పెట్టింది. గోద్రెజ్ ఇనప బీరువా, స్ప్రింగ్ మంచాలు, టేబిల్ కుర్చీలు, రెండుసోఫాలు .వగైరాలన్నీ ఆర్డరు ఇవ్వండి అని చెప్పింది ఆయనా 'అల్లాగే' అంటే, వయస్సువచ్చిన కళ్లల్లోంచి, క్షణికం ... హాయలు మైకంలోంచే నవ్వుకున్నారు.

...క వాళ్లిద్దరూ, రోజూ పోస్టు కోసం ...చూడడంతోనే సరిపోతుంది. ఈరోజు, ...వాళ, తప్పక ఒచ్చి తీరుతుంది అన్న ...లోనే ఎదురుచూచి, లేకపోవడంతో, రేపు" అన్న వాయిదా వేసుకు నేవారు.

ఈ ఎదురుచూడడం, ఉత్తరం రాకపోవడంతో, రామయ్యపంతులుకు చికాకు కల్గింది. తను అల్లుణ్ణి చివాట్లు వేసేంత చనువు రానేలేదు. సుందర్ని ఏమైనా అందామా అన్న, ఒకట్రెండై మొట్ట మొదటిసారి వెళ్లింది. ఏం కించపడుతుందో అన్న అధైర్యంలో వ్రాయలేక పోయేడు.

అనకోకుండానే, ఆ రోజు ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది. మామూలుగావస్తే ఖంగారు పడక పోవును. ఖంగారుగానే ఉత్తరం చింపేడు మంగమ్మా ఆదుర్దా పడింది. చదివేసరికి ఒక్క చచ్చిపోయేడు ఒక్కసారిగా చచ్చిపోయిన తాతముత్తాతల ప్రతిష్ఠ, తండ్రి గౌరవం మంట కలసిపోయిందిఅనే బాధ మొఖంమీద ఆవరించింది.

ఆయన అల్లాడేలా అవడంతో మంగమ్మ గుబగుబా అయ్యింది ఆదుర్దాతోటే "ఏమిటండీ? అమ్మాయీ అల్లుడూ కులాసా ? ఎక్కడనుండండీ ? ఆవరసలో ప్రశ్నలు వేసింది

పరవూ మర్యాదా, పోయినట్లే బాధలో ద్యోతకమైన మొఖంతోనే ఉత్తరం చేతి కందిచ్చేడు. ఆఘిడా మాట్లాడకుండానే తీసుకుని, కళ్లు చికిలించుకుంటూనే "అమ్మాయిగారు మొన్న దొరతో లేచిపోయేగు పాణి గ్రాహీ" ఒళ్లు జీవచ్ఛవమే అయి "లేచిపోయింది" అని అనకుంటూనే గుమ్మానికి చేర్లపడింది.

'దొరగారితో లేచిపోయింది' అనేసరికి రామయ్యపంతులికి వియ్యంకుడి ఇంటిప్రక్కగా ఉన్న "రోజర్‌దొర" జ్ఞాపకం వచ్చేడు. అక్కడ తను ఉన్న రోజుల్లో, రోజూ ఉదయం, సాయంత్రం, అమ్మాయి అల్లుడూ వెళ్లడం, కాఫీలు పుచ్చుకోవడం, సినిమాలకు వెళ్లడంకూడా జరిగింది పంతులు అంతవరకూ దొర చాలా మంచివాడనే అనకున్నాడు. ఇక్కడకు వచ్చినతర్వాత రెండుసార్లు ఉత్తరం కూడా వ్రాసేడు ఇప్పుడు ఎంత దుర్మార్గపు పనిచేసేడు అన్న కోపం వచ్చింది "అమాయకురాల్ని అందంగా వుందని, చనువుగా తిరుగుతోందని చూచి సుందర్ని లేవతీసుకుపోయేడా? వాణ్ణి పట్టుకుని . " పళ్లు పటపటా కొరుక్కున్నాడు.

క్షణికం మంచిఅంతస్సు 'నీ పోలికేనోయ్' అని జ్ఞాపకం చేస్తే ఉలికిపోయేడు. వెనక జీవితంలో. ప్రక్క ఆచారిగారి పెళ్లాంతో తనూ రంకంథాయనం ఎదురుగా తిరిగింది దానికి తోడు తర్వాత తనలో రహస్యంగా దాచుకున్న ఇతర స్త్రీలు జ్ఞాపకం వచ్చింది

ఈ పోలికను తను ఒప్పుకోలేకపోయేడు; అందులోనూ కూతుర్కి ఒచ్చిందంటే ఎంత విచ్చలవిడిగావున్నా తను భార్యయెడల సత్య వ్రతుడులాగే వున్నాడు తన పోలిక ఎల్లా వస్తుంది ?' అది అసందర్భంగా కనపిస్తోంది ప్లీడరు తన కేసును సమర్థించుకున్నట్లే వాదన సమంజసంగా కనపడింది

కాని ఒక్కటి క్రొత్తలో తన భార్యని గూర్చి ఎవేవో విన్నాడు ఏదో కొంపెపని చేస్తే ఓ వెయ్యిరూపాయిలు ఎక్కువపెట్టి సంబంధం చేసేసేడు ఖంగారుగా మంగమ్మవల్లే తన పరువు, ప్రతిష్ఠ, మర్యాద మంట కలిసి పోయిందని కోపం, ఉక్కు రోషంకూడా వచ్చేయి.

ఎందుకు ఇల్లాంటిదాన్ని పెళ్లాడేనా అని. ఇరవై సంవత్సరాలు కాపురంచేసినా, విసుక్కుని నిరాశ చెందేడు

గడియారం, పదకొండు కొట్టడంచూచి, ఖంగారుగానే లేచి, ఓ చిన్న సూటుకేసులో కావలసిన బట్టలు వేసుకుని, ఉడుకూ మడుతూనే రెండు మెతుకులు కొరికేడు రైలు స్టేషనుకు వచ్చి 'బరంపురం' టిక్కట్టు కొన్నాడు. బండి కదలిందగ్గరనండి, ఏవేవో ఆలోచనలు వచ్చేయి తను ఏవిధంగా తలెత్తుకుని ఆ వియ్యంకుడి మొఖం చూడడమో బోధపడింది కాదు. అల్లుణ్ణి ఏవిధంగా పరామర్శించాలి " పెళ్లాల్ని చెప్పుచేతల్లో ఉంచుకోలేని ఇల్లాంటి వ్యక్తుల్ని చూస్తే నవ్వు వచ్చింది కూడాను.

స్టేషన్లో దిగి, వియ్యంకుడి ఇంటికి బండిలో వెళ్లేటప్పుడు ఎరుగున్నవారు ఎవరైనా చూస్తారేమో అని చాటుగానే ముఖంపెట్టి వెళ్లేడు. సందుముఖపులో వుండగా బండిలోంచి రోజర్సు ఇల్లు చూచేడు. తలుపులు తాళాలువేసి ఉండడం చూచి, తల కట్టినట్లే మనస్సు విరిగింది "దొంగ " తర్వాత వాక్యం నోట్లోనే అణగిపోయింది.

ఏమిటూ బండి ఆ గిందని వియ్యంకుడు బయటకు వచ్చేడు చిక్కి శల్యం అయినట్టే పంతులు బాడి దిగేడు "ఓహో, బావగారా ! రండి రండి !" నవ్వుతూ ఉంటూనే ఆయన ఆహ్వానం పంపేరు.

కుర్చీలో కూర్చుంటుండగానే "అంతా క్షేమమా ! ఓరే పాణీ ! కాఫీ తీసుకురా !" ఆయన కేక వేసేడు

పంతులుకు అర్థం కావటం లేదు. ఇదంతా తన్ని న్యూనత పంచడానికి చెసే విపరీత మర్యాదా అని అనుకున్నాడు; కుళ్లిపోయేడు.

"బావగాగు ! పాణి ఉత్తరం వ్రాయలేదూ మీకు...?" ఏం చెప్పాలో తెలియక బాధపడ్డాడు.

కాఫీ తీసుకువచ్చిన పాణితో "పాణీ ! బావగారికి ఉత్తరం వ్రాయలేదూ ?"

"వ్రాసేనండి" దొరగారితో అమ్మాయిగారు లేచిపోయిందని."

ఆ వాక్యం ములుకుల్లా తడితే, కాఫీ గొంతుకలోనే కొట్లాడింది పంతులుకు వియ్యంకుడు యథాలోపంలోనే తీసుకుని" అబ్బాయికి కలకత్తా తాతా కంపెనీలో ఉద్యోగం అయ్యింది. కోడలు వాడు మొన్న మెయిల్‌కు వెళ్ళేరు" అన్నాడు

"ఆ !" అదైనా నోటమ్మట తెలియకుండానే వచ్చింది

మర్నాడు తిరిగి బందరు బయల్దేరేడు. మధ్యలో విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా... మూడు జిల్లాలు దాటడం చూచేడు. 'జిల్లాలు దాటితే ఇల్లాంటి విపరీత అర్థాలమాటలు ఒస్తాయి' అని అంతస్సు చెపితే...ఉరుకులు రుకుకుంటూనే ఇంటికి వచ్చి మంగమ్మని దగ్గరసా తీసుకుంటూనే చెవులో అన్నాడు

ఆవిడా కరగిపోయి "ఇదా" అంటూనే భుజాలమీద గునిసింది

కథానిక :

అటూ - ఇటూ

మూలం :
భగవతీచరణవర్మ

అనువాదం :
ఆనందమూర్తి

బంగాళా వరెండాలో సుకుమారుడు కుర్చీ మీద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు ఆలోచినూ ఆలోచిస్తూ ఒక సిగరెట్టు ముట్టించి రెండు గుక్కలు పట్టేడు ఈలోగా వెనకనుంచి పేపరుపడ్డ చప్పుడైంది గభీమని లేచి పేపరు చేత తీసుకున్నాడు. ఆ వేళ పేపరులో పడ్డాయి ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న పరిక్షా ఫలితాలు. సిగరెట్టు అవతల పారేసి ఆతురతతో తన నెంబరు ఫస్టుక్లాసులో ఉండడంచూసి పరవశుడైనాడు. సుకుమారుడు యిప్పుడు ఎం ఏ మొదటి తరగతిలో కృతార్థుడైనాడు. ఆ తన్మయత్వంలో "నేను" అనుకొన్నాడు. తన అస్తిత్వాన్ని గుర్తించాడు సుకుమారుడు. ఈ ప్రకృతిలో ఎటు చూచినా తనే కనబడ్డాడు తనకు. ప్రకృతిలో తను, తనలో ప్రకృతి! ఆ ప్రకృతికూడ యాతని పారవశ్యాన్ని పంచుకు తింటోంది వాకిలిముందు గున్నమామిళ్ళమీదనుండి కోవెల లొక్కమారు కిలకిలమన్నాయి. కూయని కూతలు పెడుతూ రెక్కలు విదుల్చుకొని ఒకపిట్ట గూటిలోంచి విశాలాకాశంలోకి వింతలు చూచేందుకు ఎగిరి పోయింది ఉద్యానవనంలోకి లతల ఆకుల చాటుమాటున అణగి మణగిఉన్న పువ్వుగుచ్ఛాలు ఒక్కమారుగ వికసించి సువాసనలు వెదజల్లుతూ తమ ఉనికి వ్యక్తపరచుకొన్నాయి మీ కోసరమే కాచుకొన్నా మన్నట్లుగా కొదమ తుమ్మెదలగుంపు ఒక్కమారుగా వాటిమీది కురికి ఆనందంతో ఆమకరందమాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నై.

సుకుమారుడు ఆనందపరవశుడై తన్నుతాను మరచి తనతో సహకరిస్తున్న ఆ ప్రకృతిలో లీనమయ్యాడు.

తనని తాను గుర్తించుకొనేటప్పటికి సుకుమారుడు బంగళాదాటి చాలాదూరం వచ్చేశు. అనుకోకుండా అప్రయత్నంగా లాల్చీ జేబులోంచి ఒక కవరు తీసేడు ఉత్తరం చదవడం మొదలెట్టాడు. అది ఆ రోజుకి మూడోసారి! తనను ప్రేమిస్తున్న శాంత వ్రాసిన ఉత్తరాన్ని మళ్లా చదవ నారంభించాడు. ఆ గుండ్రని ముత్యాలవంటి దస్తూరిచూసి ముగ్ధుడై మురిసిపోయ్యేడు శాంత తన్ను ప్రేమిస్తున్నది ఆ ప్రేమ లేఖలో అక్షరక్షరంలో సుకుమారునికి శాంత మూర్తి సాక్షాత్కరించింది ఆ లేఖ నొక్కమారు హృదయానికి చేర్చుకొన్నాడు. సుకుమారుడు తన హృదయవీణను ఒకమారు మీటి చూచుకొన్నాడు. అన్ని తంత్రులు శాంత! శాంత! అని ప్రతిధ్వనించినవి! సుకుమారుని హృదయ వీణానినాదానికి శ్రుతిస్వరంగా వాళ్ల నాన్నగారి మాటలు స్ఫురణ కొచ్చాయి. "నాయనా! ఎం ఏ. మొదటితరగతిలో కృతార్థుడవైతే ఐసియస్‌కి యింగ్లండు పంపుతాను"...

నాన్నగారు నన్ను యింగ్లండు పంపుతారు. శాంత నన్ను ప్రేమిస్తోంది కాలేజిలో విద్యార్థులందరూ శాంతను ప్రేమించి ఆమెను బడసేందుకు ప్రయత్నిస్తున్నారు కాని శాంత వాళ్లనందరినీ కాదని నన్ను వరిస్తోంది .

సుకుమారునిహృదయం పొంగిపోయింది. ఒడలు పులకరించినవి గృహోన్ముఖుడైనాడు.

మార్గమధ్యంలో జనసమూహం. కోలాహలం అవ్యక్తానందపారవశ్యంతో సుకుమ... ఆ జనసమూహాన్ని సమీపింపబోతున్నారు. సమూహం దగ్గరి కొచ్చింది! అందుండి స్వతంత్ర నినాదాలు సుకుమారుని చెవికి పినిపించినై. సుకుమారునిలో ఏదో నూతన చైతన్యం కలిగింది. లాటీలు - ఖద్దరుటోపీలు కనబడ్డవి. సుకుమారుడు ఆ జనసమూహంలో కలిసిపోయినాడు. "స్వతంత్ర భారతకి జై" అంటూ జెండానెత్తి సమూహం ముందు కొచ్చాడు.

ఎగురగా పరప్రభుత్వపు సేనాబలగం వస్తోంది. ఎఱ్ఱటోపీలు! కొద్ది క్షణాలలో... "ఈ సభ అశాస్త్రీయమైనది. రెండునిమిషాలలో చెదరిపోండి. పోకుంటే లాటీదెబ్బలకు - తుపాకి కాల్పులకు గురికాగలరు పొండి ! పొండి !! పొండి !!!"— హెచ్చరించాడు అశ్వారూఢుడైన పోలీసు సూపరింటెండెంటు.

జనసమూహంలో కొంత అలజడి కలిగింది ఈ లోగా సమూహమధ్యంలోంచి "ఆగండి - నిలవండి - స్వతంత్ర భారత్‌కి జై" అని ఒక పురుషస్వరం !! వెంటనే ఒకతుపాకి కాల్పు !!

గుండు సుకుమారుని గుండెలు చీల్చుకు పోయింది !!!


తరుణవయస్కుడు, అందగాడు, ఉత్సాహపూరితుడు- సుకుమారుడు - నవ్వుతూ నేల కొరిగినాడు;

ఏ పరలోక స్వర్గాన్ని-ఏ కల్పనా స్వర్గాన్ని అపేక్షించి యీ యిహలోక స్వర్గాన్ని వదులుకొన్నాడు యీ యువకుడు ???


* * *

త్రివేణీ సంగమస్థలంలో కుంభమేళానికి జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఆసేతుహిమాచలమునుండి జనం ఆనాటి ఉత్సవాన్ని దర్శించడానికి - పుణ్యం సముపార్జించడానికి తండోప తండాలుగా వస్తున్నారు. దేవాలయ ప్రాకారంలో గంటలు మ్రోగుతున్నయి. లోపల నైవేద్యాలు జరుగుతున్నయి. ఉత్సవ ఊరేగింపు కొద్ది సేపటిలో వస్తుంది సమూహం క్రిక్కిరిసి


(18-వ పేజీ చూడుడు)



గుఱ్ఱంమీద నున్న ఈ ఆలకాపరి, సరంజామాలో - "వాకీ - టాకీ" - (నడుస్తూంటే టాకి రికార్డుచేసే యంత్రం) రేడియో సెట్టు ఉంది. నటులు గుఱ్ఱాలమీద దౌడుతీస్తూ నే, రేడియో సెట్ ద్వారా, దర్శకుడు సూచించే సూచనలను గ్రహించవచ్చును.



"రెడ్ రివర్" చిత్రంలోని ఈ దృశ్యంకోసమని నిర్మాతలు (
నదికి ఐదు ఆనకట్టలు కట్టి, నదీజలము గుఱ్ఱపుకౌతుల,




ఆవులమందల అరవులన్నీ ట్రక్కుమీదనున్న ఈ "మైక్రో ఫోన్" సునిశితంగా రికార్డు చేస్తుంది.


ఉత్తర అమెరికాలో పడమటి దేశభాగాన్ని
సమర్థులుమాత్రమే బ్రతకటానికి ఆస్కారం
అక్కడ బ్రతకటం కష్టం. నూరేండ్లక్రింద
నిర్మాతలు, చార్లె



నీళ్లలో గొడ్లమందను తోలినప్పుడు, తెప్పపై కెమెరాను నిలిపి చిత్రం "షాట్" చేస్తున్నారు.




ఈ చిత్రంలో "ఆలకాపరి" (నాయకుడు) పాత్ర ధరి
బాగు చేస్తున్నాడు. చిత్రనిర్మాణంలో




డమటి అమెరికా) దక్షిణ అరిజోనారాష్ట్రంలోని సాన్‌పెడ్రో
ాంల, ఎత్తుదాకా మాత్రమే వచ్చేందుకు శ్రద్ధ తీసుకొన్నారు.

ఈ పాతరకం రైలు ఇంజన్, నూరేళ్ల క్రిందట పడమటి అమెరికాలో రైలుపట్టాలంటూ వేసిన నాటిది. దీన్ని నిగనిగ లాడేట్లు మెరుగు పెట్టి, ఇప్పుడు ఈ చిత్రంలో వాడుతున్నారు.



‌మెరికన్ ఆటవిక చిత్రనిర్మాణం

...“వైల్డువెస్టు” అని పిలుస్తూంటారు. అక్కడిదేశం ఇప్పటికీ చాలామటుకు ఆలకాపరులదేశంగా, గొల్లలతోనూ, గుఱ్ఱపురౌతులతోను, నిండి ఉంటుంది. ...ున్న అక్కడి మానవధర్మాలు, సంఘశాసనాలు, చాలా ప్రాథమికంగా ఉంటాయి. మంచి గుఱ్ఱపురౌతు కానివాడు, మంచి “గుఱిగాడు” కానివాడు, ...టి అక్కడి జీవితాన్ని చిత్రిస్తూ, “రెడ్‌రివర్” అనే చిత్రాన్ని అమెరికన్ చిత్రనిర్మాతలు తీశారు. చిత్రంలో వాస్తవికతను నిర్మించేందుకు ఈ విషయాలలోనూ తదితరమైన వాటన్నిటిలోనూ చాలా శ్రద్ధ తీసికొన్నారు. ఈ దృశ్యాలు ఆ చిత్రనిర్మాణంలోని దృశ్యాలు.



స్తున్న జాక్‌వేన్.. ఇతని ఆలకాపరిదుస్తులు చిరిగితే దర్జీ
పనిచేస్తున్న 350 మందిలో ఈ దర్జీ ఒకడు.



ఆలమందమధ్యనుంచి “జీప్‌కారులో కెమెరాతో బయలుదేరి, వివిధకోణాలలో, గొడ్లవి, నటులవి క్లోజప్పులు తీస్తున్నారు. మందలో 5,000 దాకా గొడ్లు ఉన్నవి.

పిల్లలకథ :



గాజుపెట్టె గమ్మత్తు

అసలు: 'శ్రీ హాన్స్ ఆండర్సన్' ★ నకలు: 'శ్రీ ఆచార్య భార్గవ'

అతడు చాల బీద. అతడి పేరు సుధీర్.

ఓ రోజాతడు ఏమీ తోచక రోడ్డు వెంబడి నడిచి పోతున్నాడు. రేపటికి భోజనం ఎలాగా అని ఆలోచిస్తూ న్నాడు. చేతిలో ఎర్రని ఏగానీ లేదు. ఐనా అతడికి తన తండ్రినిగూర్చి అంతగా విచారం లేదు

ఇలా విచారిస్తుండగా అంద వికారమైన ఓ ముసిలామె అతణ్ణి పిలిచింది.

"ఏమమ్మా, పిలిచావు? నీ కేం కావాలి?" అని అడిగాడు సుధీర్.

"నీ కేం కావాలి?" అదే అని ప్రశ్న మళ్లీ తిప్పి ఆమె అడిగింది.

"నాకు డబ్బు కావాలి."

"నీకు కోరినంత ధనం లభించే ఉపాయం చెప్తాను. అల్లదిగో ఆ కనబడ్తూంది చూడు ఓ పెద్ద మర్రి చెట్టు. ఆ చెట్టు కొన కొమ్మలకు ఎక్కు. అక్కడ చెట్టులో ఒక సొరంగం లాంటి తొఱ్ఱ కనబడుతుంది. ఆ మార్గం గుండా నీవు దిగి పోవాలి. అలా వెళ్లితే నీ వొక హాలుకి చేరతావు. ఆ హాల్లో ఎల్లప్పుడూ వందల కొలదీ దీపాలు వెలుగుతూ మిరుమిట్లు గొలుపుతూంటాయి. అక్కడ గమనిస్తే మూడు ద్వారాలు కనబడతాయి. ఆ ద్వారాలు తెరుచుకుని లోపలికి వెళ్లడానికి వాటి తాళపు చెవులు ద్వారాల ప్రక్కనే తగిలించి ఉంటాయి.

"ఒక తలుపు తెరచుకుని లోపలికి పో. అక్కడ ఒక పెద్ద పెట్టె ఉంటుంది. ఆ పెట్టె మీద ఓ పెద్ద కుక్క కూర్చొని ఉంటుంది. దాని కళ్లు పెద్ద కోడిగుడ్డంత ఉంటాయి. భయంకరంగా ఉంటుంది. నీవుభయపడొద్దు. ఈ గుడ్డ తీసుకో. దీన్ని క్రింద పరచు. మెల్లిగా ఆ కుక్కను ఈ గుడ్డమీద కూర్చొబెట్టి నీకు కావలసినంత డబ్బు తీసుకో.

"నీకు,బంగారం కావలసి వుంటే, ఇంకో గదిలోకి పో. అక్కడి పెట్టె మీద కూడా కుక్క కూర్చొని వుంటుంది. ఆ కుక్కకండ్లు ఆపిలు పండ్లంత ఉంటాయి. భయం లేకుండా ఆ కుక్కను ఈ గుడ్డమీద పెట్టి నీవు కోరినంత బంగారం తీసుకో. నీకు నగానట్రా, రత్నాలూ, మణులూ కావాలనుంటే ఆ పక్క గదిలోకి వెళ్లు. అక్కడి కుక్కకళ్లు రొట్టెలంతేసి ఉంటాయి. భయపడకుండా ఈ గుడ్డ మీద ఆ కుక్కను కూర్చొబెట్టి నీకు కావలసినన్ని నగలూ, రత్నాలూ తీసికొని వచ్చేసెయ్." అని చెప్పిందా ముసిలామె.

"అచ్ఛా! ఈ ఉపాయం భలే ఫసందుగాఉంది. కష్టం లేకుండా ఎంతో ధనం. 'అవ్వా చాలా కృతజ్ఞుణ్ణి. ఎవు నాకింత సాయం చేసినందుకు నేను నీకు చేసే ప్రత్యుపకారమేముంది?" అన్నాడు సుధీర్.

"నాకు డబ్బా గిబ్బా వద్దు. ఒకే ఒక పని మాత్రం చేసి పెట్టు. మును పొకప్పుడు మా అవ్వ అక్కడికి పోయి నప్పుడు ఆమె అక్కడ తన గాజు పెట్టె మరిచి వచ్చింది. బాబ్బాయి, దాన్నిమాత్రం తెచ్చిపెట్టు అదే చాలు" అంది ముసిలామె.

సుధీర్ ఆమె చెప్పినట్లుగా చెట్టు తొఱ్ఱ గుండా హాల్లోకి చేరాడు.

మొదటి తలుపు తెరచి లోపలికి వెళ్లాడు. 'కోడి గుడ్డు కంటి' కుక్క కూర్చుని వుంది. ఇతణ్ణి చూచి ఆ కుక్క 'బౌ బౌ' అన్నది. భీకరంగా ఉరిమి చూసింది. సుధీర్ భయపడకుండా, ముసిలామె ఇచ్చిన గుడ్డ కింద పరిచి "నీవు బలే మంచి కుక్కవు కదూ? కొంచెం కూర్చొందూ?" అని దాని మీద ఆ కుక్కను కూర్చొబెట్టాడు. తనటోపీ నిండా పట్టినంత డబ్బు తీసుకుని ఇంకో గదిలోకి వెళ్లాడు. ఆ గదిలో ఆపిల్ కండ్ల కుక్క అతని వైపు చుర చుర చూసింది.

"నా వైపలా మింగేసేలా చూడకు. కళ్లల్లో దుమ్ము పడుతుందేమో?" అని అంటూ సుధీర్ గుడ్డమీద కుక్కను కూర్చొబెట్టి, తన టోపీ నిండా ఉండే డబ్బు అంతా అవతల పోసేసి, ఆ పెట్టెలో ఉండే డబ్బుతో దాన్ని నింపేసుకుని, ఇక మూడో గదికి వెళ్లాడు. అక్కడ 'రొట్టె కండ్ల' కుక్క కూర్చొనివుంది. అది అతడి వైపు అదోలా చూచింది.

"ఆహా! నిన్ను చూస్తూంటే నాకెంతైనా సంతోషంగా వుంది. నీలాంటి కుక్కను ఇంతకు మును పెప్పుడూ చూడలేదు." అని చెప్పి మును పటి లాగే పరచిన గుడ్డపై దాన్ని కూర్చొబెట్టాడు. తన కాలిబూట్లు విప్పి, ఆ రెంటినీ రత్నాలతో నింపేశాడు. ఆ కుక్కను యథాప్రకారం కూర్చొబెట్టేసి వెనక్కి మళ్లాడు.

అప్పుడాతడికి తటుక్కున ముసిలామె చెప్పిన గాజుపెట్టె సంగతి జ్ఞప్తికి వచ్చింది. మళ్లీ వెనక్కెళ్లి, దాన్ని తీసుకుని, తొఱ్ఱగుండా చెట్టు పై కొచ్చాడు.

అంతవరకూ అక్కడే తిష్ఠ వేసుకుని కాచుక్కూచుని ఉన్న ముసిలామె "ఆ పెట్టెను కిందికి తోసేయి" అని అరిచింది.

"ఆఁ. ఇది గాజు పెట్టె. తోసేస్తే బద్దలై పోతుంది."

"కాదు. త్వరగా కిందికి పడేసెయ్" ఆత్రంగా ఆక్రోశించింది.

కాని సుధీర్ పెట్టెను కిందికి గిరవాటేయ లేదు. అప్పుడు ఎక్కణ్ణుంచి వచ్చిందో, ఏమో ఓ పెద్ద రాయి అతని తలమీద బలంగా గుద్దింది. ఆ దెబ్బతో కిందపడి చచ్చి పోయేట్లే ఐంది. కాని ఎలాగో తమాయించుకుని ఆ చెట్టుకొమ్మల్ని కట్టి పట్టుకున్నాడు, మెల్లిగా అప్పటికి ఆ గండం తప్పించుకున్నాడు.

"నీవేనా, ఆ రాయి విసిరి కొట్టింది?" అని ఆమె నడిగాడు.

"ఔను నేనే. నా పెట్టె నాకిచ్చేయ్" అని ఆమె గదమాయించింది.

"నే నివ్వనే ఇవ్వను" అని బదులు చెప్పాడు సుధీర్.

ఈ సంభాషణతో ఆ ముసిలామెకు కోపం చాలా తీవ్రంగా వచ్చింది. కాని పాపం, ఏమీ చేయలేకపోయింది. కసితో నోటి కొచ్చినట్లల్లా తిట్టి పోసింది సుధీర్‌ను.

వీ ట్నేమీ లెక్క చేయకుండా సుధీర్ ధీరంగా దిగి రోడ్డు వెంబడి నడిచిపోసాగాడు. ఆమె ఇంకా అతణ్ణి తిడుతూనే వుంది.

అలా నడిచి సుధీర్ టౌనుకు చేరుకునేప్పటికి రాత్రైంది. అతడి వద్ద బంగారం, రత్నాలూ చాలా వున్నాయి. అందువల్ల బాగా బందోబస్తుగా వుండే ఒక పూటకూళ్ల యింటికి పోయి, ఒక మంచి గది, కమ్మని భోజనం తనకేర్పాటు చేయించమని ఆ యింటి యజమానితో చెప్పి, ఏర్పాట్లు చేయించుకొన్నాడు.

మర్నాడు ప్రొద్దుట బజారు కెళ్లి ఆ వూళ్లో దొరికే బట్టల్లోకల్లా ఖరీదైనవీ, అందమైనవీ కొనుక్కొన్నాడు. వాట్ని తొడుక్కున్నాడు. అందువల్ల చూసేవాళ్లందరూ అతణ్ణి ఓ పెద్ద జమీందారు కొడుకో, రాజకుమారుడో అనుకున్నారు. అందుచే ఆ వూళ్లోవాళ్లంతా బెల్లం చుట్టూ చీమల్లా అతనిచుట్టూ అస్తమానం మూగుతూండేవాళ్లు, తమ కేదైనా కాస్త లభిస్తుందేమో నని. అతనితో అందరూ స్నేహం నటించేవాళ్లు.

ఒక రోజు సుధీర్ వద్దకు ఓ మనిషి వచ్చి "ఈ వూళ్లో వుండే రాజకుమారిని గూర్చి నీ వేమైనా విన్నావా? నిజంగా అంత అందమైన స్త్రీ ఈ ప్రపంచంలో లేదనే చెప్పాలి. ఆమె పేరు కూడా ఆమె అందానికి తగినట్లే ఉంది—'నళినీ మోహిని!'"

"రాజకుమారినా? ఆమె నాకెక్కడ కనబడుతుంది? నేను చూడ్డానికి వీలు పడుతుందా?" అని ప్రశ్నించాడు సుధీర్.

"నీ వామెను చూడలేవు."

"ఎందు చేత?"

"ఆమె తండ్రి రాళ్లతో దృఢంగా కట్టిన యింట్లో భద్రంగా పెట్టి ఉన్నాడామెను. ఆ యింటికి ఒకటే ద్వారం. దాని తాళంచెవులు రాజు తనవద్దే ఉంచుకుంటాడు. ఎవ్వరికీ ఇవ్వడు. ఆమె ఎప్పుడూ ఇవతలికి రావడానికే వీల్లేదు. ఆఖరికి ఆ యింటికిటికీ కూడా చాలా ఎత్తున పెట్టించాడు."

"ఆమె కెందు కిలాంటి నిర్బంధం?"

"ఓనాడు ఓ సిద్ధుడు వచ్చి రాజు కూతుర్ని గూర్చి జోస్యం చెప్పాడు— 'ఈమె పూరిగుడిశల్లో వుండే ఒక బీదవాణ్ణి పెళ్లి చేసుకుంటుంది!' అని" అది విని ఆగ్రహం చెంది రాజు, ఆలాటి అవమానకరమైన స్థితి రాకుండా ఉండటానికని ఆమెను ఎవ్వరికంటా బడకుండా కాపాడుతున్నాడు.

'నే నెలాగయినా ఆమెను చూచి తీరాలి' అనుకున్నాడు సుధీర్.

అతడో రోజు నళినిని చూడ్డానికి ఆ శిలాగృహానికి (రాతి యింటికి) వెళ్లాడు. అతణ్ణి చూచినవెంటనే దగ్గరికిరానీయకుండా తరిమేశారు— రాజుసేవకులు.

మఱునాడు అతడు మంచి విలువైన దుస్తులు తొడిగి, అచ్చం రాజకుమారుడిలాగా అన్ని హంగులతోనూ ఆ రాజదర్శనార్థం వెళ్లాడు. వెళ్లి తన కోర్కెను వెళ్ల బెట్టాడు—'నళినిని చూడా' లని. రాజుకు పట్టరాని కోపం వచ్చింది. "అది నీకీ జన్మలో సాధ్యం కాదు" అని ఒక్క ఉరుము ఉరిమి వెనక్కి పంపించేశాడు. "ఇక ఎప్పుడైనా యిక్కడికి వచ్చాడంటే ముందూ వెనుకా ఆలోచించకుండా అతణ్ణి పట్టి చంపేయండి" అని రాజు సేవకులకు హుకుం ఇచ్చాడు.

ఇన్నాళ్లూ సుధీర్ జమీందారు బిడ్డలాగా దివ్యభోగంతో వెలిగించాడు తన వైభవం. ఓనాడు తనవద్ద ఇంకా ఎంత డబ్బు నిలవ వుందో చూచుకునే సరికి గుండె గుభేలు మన్నది. చాలా కొంచెమే వుంది. వెంటనే తనున్న బంగళా ఖాళీచేసి ఓ చిన్న పూరి గుడిశకు చేరాడు. తన బట్టలు తానే ఉతుక్కుంటున్నాడు. తానే వంట చేసుకుంటున్నాడు చాకిరీ అంతా ఒంటరిగానే చేసుకొనవలసి వచ్చింది. నౌకర్లను పెట్టుకోడానికి డబ్బు లేదాయె! మరేం చేస్తాడు? ఎటు

నంటి స్థితినుండి ఎటువంటి దశకు పతన మైనాడు పాపం!

అతడి డబ్బంతా ఖర్చయి పోయిందని తెలిసి, పాతస్నేహితులందరూ అతణ్ణి విడిచేశారు. చెర్లో నీ ళ్లున్నంత వరకే కప్పలు చేరతాయి. లోకస్వభావమూ యింతే!

ఆ కొంచెం డబ్బూ కొద్దికాలంలోనే అయిపోయింది. తిండీ, తిప్పలూ ఎలా? తన సామాన్లూ, బట్టలూ అన్నీ అమ్మేసుకున్నాడు.

ఓనాడు రాత్రి భోజనానికి ఏమీ దొరకలేదు. ఆకలి దహించుకుపోతోంది. ఇక బతకలేనేమో అని భయపడ్డాడు. అమ్మడానికి సామానేమైనా ఉందేమో అని గదంతా కలయచూచాడు. గాజుపెట్టె తప్ప ఇంకేమీ లేదు.

"ఈ గాజుపెట్టె అమ్ముకున్నా ఏమంత డబ్బు రాదు. ఈ పూట కేదో కాస్త ఇస్తుందిలే. ఇది గాజుపెట్టెగదా? లోప లేముందో కనబడ దేం చెప్మా' వింతగా వుందే? నగా, నట్రా ఏదైనా ఉండి వుంటుంది. లోప లేముందో ఓ నారి చూస్తే సరిపోతుంది" ఈలా అనుకుంటూ, ఆ పెట్టెను తెరువడానికి శాయశక్తులా ప్రయత్నించాడు. సతమతమయాడు. లాభంలేదు. కోపంతో ఆ పెట్టె మీద చేత్తో ఓ గుద్దు గుద్దాడు; ఆశ్చర్యంగా మూత తెరుచుకొని, కోడిగుడ్డు కన్ను కుక్క వెలికొచ్చింది పైగా—

"నీ కేం కావాలి?" అని అడిగింది.

"నాకా, నాకు డబ్బు కావాలి" అన్నాడు సుధీర్.

ఆ కుక్క ఒక క్షణంలో మెఱుపు మెరిసినట్లు వెళ్లి వచ్చేసింది. ఒక డబ్బు సంచీ తెచ్చి యిచ్చింది.

అప్పుడు సుధీర్ కొంచెం ఆలోచనలో పడ్డాడు. "సరే, తెలిసిపోయింది. ఇదీ సంగతి! నే నీ పెట్టెమీద ఒక దెబ్బ కొడితే గుడ్డుకంటి కుక్కవస్తుంది; డబ్బు ఇస్తుంది. రెండు సార్లు కొడితే 'ఆపిలు పండ్లకంటి' కుక్క వస్తుంది; బంగారం ఇస్తుంది. అలాగే మూడు మార్లు కొడ్తే?......" అనుకున్నాడు.

అప్పుడా పెట్టెను రెండు సార్లు కొట్టాడు. ఆపిలు కళ్లకు క్కొచ్చి, కావలసినంత బంగారం తెచ్చిపెట్టింది. మూడుసార్లు కొట్టాడు. 'రొట్టె కళ్ల కుక్క' వచ్చి సొమ్ములూ, రత్నాలూ ఇచ్చింది.

సుధీర్ దశ తిరిగింది మళ్ళీ ధనవంతు డయ్యాడు. మళ్ళీ మంచి మంచి దుస్తులూ, అవీ కొన్నాడు. పెద్ద షోకైన బంగళా కొన్నాడు. దర్జాగా వుంటున్నాడు అప్పుడు మళ్ళీ ఆకృతఘ్నులైన స్నేహితులందరూ అతని చూట్టూ చేర సాగారు.

"ఇంతకాలంనుంచి నీ దర్శనమే లేదే! .నిన్ను చూడాలని ఎంతగానో తల్లడిల్లి పోయేవాళ్లం." అని శుష్కోపచారాలు చెప్పేవాళ్లు.

కాని వాళ్ల స్వభావం తెలుసుకొన్న సుధీర్ ఈసారి మాత్రం వాళ్లకు చనువీయలేదు.

అత డెప్పుడూ ఆ దీనస్థితిలో— నిర్బంధంలో ఉన్న నళిని నిగూర్చి విచారిస్తూండేవాడు.

"పాప మామె కెంతటి దుర్భరస్థితి. ఎవ్వరితోనూ మాట్లాడకూడదు కదా! ఎవ్వరి మొగమూ చూడకూడదే— ఎంతటికీ ఆ నిర్దయుడైన తండ్రీ, సేవకులూ తప్పితే. ఆమెతోటలో సాయంత్రంవేళ కాస్త విహరించడానికైనా నోచుకో లేదు కాబోలు! తన దీనస్థితికి కుమిలి కుమిలి ఏడుస్తూంటుందో!"

ఈ చింతలో అతడి కానాటి రాత్రి కంటికి కూరుకు వస్తే వొట్టు. తను పక్కమీంచి లేచాడు. గాజుపెట్టె తీసుకొన్నాడు. ఓ దెబ్బ వేశాడు. కుక్క ప్రత్యక్ష మైంది.

"ఈ రాత్రిపూట ఎవ్వరూ కనుక్కోలేరు. ఆహా ఎంత హాయియైన రాత్రి! పిండి అరబోసినట్లున్న ఈ పాలవెన్నెల ఎంత ఆనందా న్నిస్తోంది. ఇటువంటి రాత్రి వెన్నెట్లో కొంచెం పచారు చేయాలని నళిని తప్పక కోరుకుంటూ వుంటుంది. ఆమె నెలాగైనా రహస్యంగా ఇక్కడికి తీసుకురా—"అని ఆజ్ఞ యిచ్చాడు కుక్కకు.

అది కనుమూసి తెరిచేంతలో తన వీపుమీద రాజకుమారిని ఎక్కించుకుని వచ్చి, సుధీర్ ముందు నిలిచింది. ఆమె ఇంకా నిద్రపోతూనే వుంది. ఆమె ముఖం ఎంతైనా సొగసుగా వుంది. కాని ముఖాన విచారంమాత్రం తాండవిస్తోంది.

సుధీర్ ఆమెవద్దకు వెళ్లి బుజాల మీద మెల్లగా నిమిరాడు. ఆమె మేలుకుంది.

"నే నెక్కడున్నాను? చాలా భయంవేస్తోంది," అని అరిచింది ఏమీ పాలుపోకుండా.

నీవు నాతో సురక్షితంగా సుందర ఉద్యానవనంలో ఉన్నావు. ఆ తెల్ల రోజాపూలవైపు చూడు! గాలికి మెల్లగా తల లాడిస్తూ మనల్ని పిలుస్తున్నట్లున్నాయి. కమ్మని వాసనలు నలుమూలలా వెదజల్లుతున్నాయి"— అన్నాడు సుధీర్.

"ఏమిటీ? ఉద్యానవనమా? అబ్బ! ఎన్నాళ్ల కీ భాగ్యం? ఎన్నో సంవత్సరాలకు తర్వాత మళ్లీ ఈనాడు ఈ మధురానుభవం! కాలికింద భూమి; పైన ఆకాశం; చుట్టూ తోట! నే నెంతసేపటికీ గది కిటికీలోంచి ఎంతో ప్రయత్నంమీద కనబడీ కనబడకుండా చూడాల్సిందేకాని, ఎప్పుడూ ఇలాంటి అనుభవమే లేదుగా! ఇప్పుడో రాతి గోడల మధ్య నిర్బంధంలో గాక స్వేచ్ఛ ......ఉద్యానవనం......పాల వెన్నెల ......పూలమొక్కల గుబాళింపు... ...ఏమి ఆనందం!" అని పరమానందంతో చెప్పింది.

ఆప్యాయంగా అతనితో ఆ రాత్రంతా తిరుగుతూందామె ఆ తోటలోనే. ఇంతలో తూర్పు తెల్లబడ నారంభించింది. నళిని మరల నరకానికి పోవాలసిన సమయం వచ్చింది. "ఇక నే వెళ్లిపోవాలి" అని అంది.

గాజుపెట్టెమీద కొట్టమన్నాడు సుధీర్. ఆమె అలాగే చేసింది. కుక్క వచ్చింది. "రాజకుమారీ, ఏమి ఆజ్ఞ?" అని అడిగింది.

"నీవు మంచి కుక్కవుగదూ? నన్ను మళ్లీ, ఎవ్వరికీ తెలియకుండా, ఉదయం అయ్యేలోపుగా నాచోటికి చేర్చు" అని చెప్పి, "సుధీర్, నా కింతటి ఆనందాన్ని చేకూర్చినందుకు నే నాజన్మాంతము నీకు కృతజ్ఞురాల్ని; వెళ్లొస్తా" అని అంది.

ఆమె కుక్కవీపుమీద కూర్చోగానే నిద్రపోయింది. అంతే. ఆ తర్వాత ఏం జరిగిందో ఆమెకు తెలీదు. తెలివొచ్చి చూచేసరికి తన మామూలు రాతి ఇంటిలోనే ఉంది. ఎదురుగా వికృతరూపంతో దాసీది 'అన్నా' నిలుచుని ఉంది. ఆ దాసీది "అమ్మా, ఏమంత గాఢ నిద్ర? మధ్యాహ్నమయిందే? నీ కోసం రాజుగారు ఎంతోసేపట్నుంచీ కాచుకొని ఉన్నారు" అని చెప్పింది.

ఎవరనుకుందో ఏమో—" నిజంగా నాకోసం నా రాజు కాచుకుని ఉన్నాడా?" చెంగు మని లేడిపిల్లలా పక్కమీంచి ఒక్క గంతు వేసి— "అన్నా, (దాసీది) ఈ రోజు ఎంత మంచిరోజు! అని ఎంతో సంతోషంతో అన్నది నళిని.

నళినివింతప్రవృత్తి చూసి, అన్నా ఈలా ఆలోచించసాగింది: ఈమె ఎప్పుడూ మధ్యాహ్నం పడుకునేది కాదే? అదీ ఎప్పుడూ విచారంగా ఉండేది కాని ఇలాంటి ఉత్సాహం ఈమెలో ఎప్పుడూ కనబడేదే కాదే?'

ఈమె ఆలోచనలకు భంగకరంగా మళ్ళీ నళిని మాటలు వినిపించినయ్. ఆమె ఇంకా రాత్రి జరిగిన మధుర సంఘటనలు గురించే కలలు కంటోంది. "ఇం కొక్క పెద్ద రోజంతా ఈ రాతి యింటిలో అఘోరించాలి" అని అనుకుంది.

ఆమె రాజకుమారివొళ్లంతా పరీక్షగా చూసింది. ఆమెదుస్తులమీద దుమ్ము ఉంది. అందులోనూ ఒక తోటలో ధూళి! పైగా ఆమెగదిలో వెతికితే ఒక తెల్ల రోజాపూవు కనిపించింది. రాజుగారితోటలో తెల్ల రోజామొక్కే లేదే? దీంట్లో ఏదో ప్రమాదం వుందని ఆమె ఈ విషయమంతా రాజుగారితో (రాణీ చచ్చిపోయిందిలెండి) మనవి చేసింది.

రాజు మండిపడ్డాడు. జాగ్రత్తగా కాపలా కాయండి. ఎక్కడికైనా వెళ్లుతుందేమో గమనించి ఉండండి!" అన్నాడు రాజు.

సుధీర్ నళినిని చూచినప్పటి నుండి ఆమెను పెండ్లాడాలని ఉబలాట పడుతున్నాడు. ఆమెను గాఢంగా ప్రేమించాడు. ఆమెను గురించే రాత్రింబగళ్లు చింతిస్తూండేవాడు.

ఇలా ఎట్లట్లో కొన్నిరోజులు గడిచాయి. ఇక అతడు రాజకుమారిని చూడకుండా ఉండలేక పోయాడు. గాజుపెట్టెమీద రెండుసార్లు కొట్టాడు. ఆపిలుకళ్లకుక్క వచ్చింది. నళినిని రోజాతోటలోకి తీసుకురమ్మని కుక్కకు ఆజ్ఞ యిచ్చాడు. కుక్క ఆమెను తీసుకొచ్చి సుధీర్‌కు ఒప్పగించింది.

అన్నా అతిజాగ్రత్తగా—కుక్క రావడం, నళినిని తీసుకెళ్లడం గమనిస్తూనే వుంది. ఆమె కుక్క వెంబడి పరుగెత్త నారంభించింది. అది దూరిన యింటివాకిటి తలుపుకు ఒక గుర్తు పెట్టి వచ్చింది.

ఈ విషయం తెలియని నళినీ సుధీరిద్దరూ ఆ తోటలో చాలాసేపు విహరించారు. సుధీర్ తన కథ అంతా ఆమెతో చెప్పుకున్నాడు. తను చెట్టు తొఱ్ఱలోంచి పోవడం, ధనమూ, దస్కమూ సంపాదించుకోవడం, గాజుపెట్టె లభించడం-అంతా సవిస్తరంగా చెప్పి, ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాడు. ఇదంతా వింటూంటే, సుధీర్ యొక్క ధైర్యమూ, అతనివైభవమూ తెలుసుకొన్న నళినికి అతనిపై ప్రేమ అధికం కాజొచ్చింది. ఆమెకూడా తన తల్లి చనిపోవడం, సిద్ధుడి మాటలు నమ్మి, ఆ అవస్థ రాకుండా తప్పించుకోడానికై తన్ను తండ్రి నిర్బంధంలో బంధించడం-మొదలైన విషయా లన్నీ వెళ్లబోసుకుంది.

"నిజానికి మానాన్న చాల మంచివాడు. కాని వయస్సు మళ్లుతున్న కొద్దీ అతనికి చాదస్తం అధిక మైంది. అనుమానం జాస్తి. ఐనదానికీ కానిదానికీ కోపపడతాడు. ఎప్పుడూ చిరాకుగా ఉంటాడు. అందువల్ల నాకూ సుఖం లేకుండా ఉంది. రాజన్న మాటే గాని, అతడికిస్థిమితం లేదు. రాజుగా ఉంటం కూడా పీడగా తోస్తూంటుం దతడికి. అతడికి తెల్ల రోజాపూలంటే ప్రాణం. కాని వాటిని ఎలా పొందడం. వాటిని మొక్కలు వేసి ఎలా పెంచడం? ఎంతో శ్రమ పడ్డాడు. ఎంతో ఖర్చు పెట్టాడు. కాని శాపం పెట్టినట్లుగా ఒక్క మొక్క బ్రతికి, ఒక్క పూవైనా అతడికి లభ్య మైంది, కాదు. అత డెప్పుడూ ఆ రోజాపూవుల కోసమే విచారపడుతూంటాడు. అతడి కా

భాగ్యము లేదు. "అని ఈవిధంగా నళిని ఏవేవో చెప్తూండగానే తెల్లవారిపోతోంది. వెళ్లిపోవాలని తొందరపడింది నళిని.

సుధీర్ రెండుసార్లు గాజుపెట్టెమీద కొట్టాడు. ఆపిలుకండ్ల కుక్క వచ్చింది. ఆమెను తీసుకెళ్లి ఆమెగదిలో దిగబెట్టి వస్తూ సుధీర్ యింటి వాకిట తలుపువిూద ఉన్న గుర్తు చూచి, రానున్న ప్రమాదం పసికట్టి సుధీర్‌తో ఈ విషయం చెప్పింది.

"అయ్యయ్యో, ప్రమాదం! తొందరగా నాతో రా. ఈవీధిలోనూ, ప్రక్క వీధిలోనూ ఉన్న ఇండ్లకంతా అన్ని తలుపులకూ ఇదే మాదిరి గుర్తులు పెట్టి వద్దాం. అలా చేస్తే మన యిల్లు గుర్తు పట్టలేరు." అని కుక్కతో అని, అల్లే చేశారు.

ఉదయాన్నే అన్నా, రాజుతో రాత్రి జరిగిందంతా పూస గ్రుచ్చినట్లు చెప్పింది. రాజు ఉద్దండమైన కోపంతో కొంత పరివారంతో బయలుదేరాడు దోషిని శిక్షించడానికి. గుర్తునుబట్టి ఇంటిని కనుక్కోవచ్చు ననుకొన్నారు.

"అదో, అదే యిల్లు!" అరిచింది అన్నా.

"అదికాదు, ఇది" రాజు గర్జించాడు.

ఒక్క సేవకుడు ప్రక్క వీధినుంచి రొజుకుంటూ, రొప్పుకుంటూ వచ్చి ఆ వీథిలోనే ఉంది గుర్తుపెట్టిన యిల్లన్నాడు.

తీరా చూచేప్పటికి అన్ని యిళ్లకూ గుర్తులున్నాయి. అప్పటికా ప్రయత్నం విఫలమైంది. రాజు కోపంతో ఇంటికెళ్లాడు.

అన్నా అంతటితో ఆ ప్రయత్నం విరమించుకో దలచలేదు. ఎలాగైనా కనిపెట్టి తీరా లనుకున్నది. పైపైగా ఆలోచించసాగింది. కొంతసేపటికి ఆమె మెదడులో ఓ చక్కని యుక్తి తళుక్కు మని మెరిసింది. అంతట ఆమె తనగదిలోకి వెళ్లి తలుపులు బిడాయించుకొని కూర్చుని, సూదీ దారం తీసుకొని, ఒక చిన్న వల అల్లింది. అందులో కొన్ని చిక్కుడు గింజలు పోసింది. ఆ వలను, రాత్రి కట్టుకోబోయే నళిని ఉడుపుల్లో దాచేసింది.

"ఇవ్వాళ రాత్రి నళిని బయలుదేరిపోయేప్పుడు ఆమెకు తెలియకుండానే, ఆమెదుస్తుల్లో ఉన్న వలసంచుల్లోంచి చిక్కుడుగింజలు ఒక్కటొక్కటిగా దోవపొడుగునా పడతాయి. దాన్ని బట్టి ఆ చూకీ తీసి దొంగను కనుక్కోవచ్చును. అని అనుకుంది అన్నా.

ఎప్పటి మల్లే నళినీ సుధీర్లు ఉద్యానవనంలో హాయిగా ఉన్నారు.

"నళినీ, రాజకుమారుడవాలని నా కెప్పుడూ ఆశ లేదు" — అన్నాడు సుధీర్.

"నా కంతకంటేనూ. రాజకుమారిగా ఎప్పుడూ పుట్టకూడదని నేననుకుంటూ"— అంది నళిని.

'ఏందుచేత ?"— నళిని బదులు చెప్పలేదు.

"నేను రాజకుమారుడుగా నే అవాలి. అలాగైతే నే నిన్ను నేను వివాహ మాడగలను." అని మళ్లీ అన్నాడు సుధీర్.

"ఎప్పుడూ ఆ కోరిక కోరుకోవద్దు. నీవు జమీందారుడివై యుంటే నిన్ను నే ప్రేమించి యుండలేను. నే నెప్పుడూ ఒక బీద పిల్లగానే ఉంటాను. నీవూ ఎప్పటి సుధీరుడివి గానే ఉండు. సుధీర్ గానే నిన్ను ప్రేమిస్తా గాని రాజకుమారుగా నిన్ను ప్రేమించలేను." అని చెప్పింది నళిని.

ఇలా ఆనందంగా వాళ్లు మాట్లాడుకునే సమయాన అక్కడకు రొట్టెకండ్ల కుక్క రొజుకుంటూ పరిగెత్తు కొచ్చింది తోటలోకి. ఆ కుక్క రాత్రిపూట ఎంతటి చీకటైనా సరే, పిల్లిమల్లే ప్రతీదీ శుభ్రంగా చూడగలదు. రాజు, అన్నా చిక్కుడుగింజల జాడతో తోటవైపు వస్తున్న సంగతి కనిపెట్టింది. ఏదో ఆపద సంభవింపబోతోందని పసికట్టింది. నళినివద్దకు వచ్చి ఆ కుక్క "రాజకుమారీ, రాజు, రాజు! తప్పించుకో!" అని అరిచింది. సుధీర్ వెంటనే ఆమెను ఆ కుక్కవీపుమీద కూర్చోబెట్టాడు. ఆమెను ఆ కుక్క ఎక్కడికో తీసుకువెళ్లింది.

అన్నా సహాయంతో రాజు సపరివారంగా రాత్రికిరాత్రే సుధీర్ యిల్లు చుట్టు ముట్టేశాడు. ఇక సుధీర్ తప్పించుకు పోలేడు. బోనులోబడ్డ సింహం. అతడు అంతంతమాత్రానికే భయపడేవాడు కాడు. అతనిపేరు సుధీర్. అది నేతి బీరకాయ పేరు కాదు. దాని అర్థం చాలా ధైర్యం కలవాడని. నిజంగా అతడు ధైర్యశాలే.

"రాజకుమారి నళిని నీతో ఉండలేదా?" అని అడిగాడు రాజు.

సుధీర్ బదులు చెప్పలేదు.

వాళ్ల కక్కడ కనబడింది—! అక్కడ నళిని కాలిబూటు ఒక్కటి ఒక రోజామొక్కవద్ద కనిపించింది. అందులో అది తెల్లరోజామొక్క. దీంతో రాజుకు మరీ ఆగ్రహం ఎక్కువ అయింది. ఎన్ని పాట్లు పడ్డా తను రోజాచెట్లు పెంచలేక పోయాడు. ఈ తోట నిండా తెల్ల రోజాలే!

రాజభటులు సుధీర్‌ను చుట్టుముట్టి బంధించి జైల్లో పెట్టారు. ఆ జైలుకు ఒకే ఒక చిన్న కిటికీ వుంది. "ఈ వేళ మధ్యాహ్నమే నీ తల తరిగేస్తాం." అని చెప్పి రాజు వెళ్లి పోయాడు.

పాపం సుధీర్‌కు ఎంత కష్టం సంభవించింది! నిస్సహాయుడు. కొన్ని గంటలలో చిత్రవధ చేయబడతాడు. అతణ్ణి రక్షించేవా ళ్లెవరూ లేరు. దిక్కులేని వాళ్లకు దేముడే దిక్కు.

...అతనికేం? గాజుపెట్టె ఉందిగా? కుక్కలు రక్షించలేవూ? సుధీర్ తనవద్ద ఆ పెట్టె ఉందేమో చూచుకున్నాడు. 'కలిసిరాని కాలానికి పైగుడ్డ పక్షులెత్తుకుపోతాయట!' మన సుధీర్ అజాగ్రత్తవల్ల తన గాజుపెట్టె తోటలోనే జార విడిచాడు. ఇక గత్యంతరం లేదు. చావాల్సిందే! సుధీర్ ధైర్యంగానే ఉన్నాడు. తన చేతివేలికి ఒక విలువైన ఉంగరం వుంది. అది వజ్రాల ఉంగరం.

ఉదయాన్నే అతడు కిటికీలోంచి వెలికి తొంగి చూచాడు. ఆ వీథిగుండా ఓ కుర్రాడు పోతున్నాడు.

"ఏయ్ అబ్బాయ్! ఇలారా; ఒక మాట" అని పిలిచాడు సుధీర్.

"ఎందుకూ పిలుస్తున్నావ్?" అన్నాడు కుర్రాడు.

"నీకీ వుంగరం కావాలా?"

"భలే ఉంగరం! కావాలి!" అని చంక లెగరేశాడు కుర్రాడు.

"ఐతే ఓ చిన్న పని చేయి, నీకీ ఉంగరం ఇచ్చేస్తాను. నీవు మా యింటికెళ్లి నా నౌకర్లతో-'సుధీర్ గారి గాజుపెట్టె తోటలో పడిపోయిందిట. దాన్ని నన్ను తీసుక రమ్మన్నారు. అని చెప్పు. వాళ్లిస్తారు. అది తెచ్చి పెట్టావంటే ఈ ఉంగరం ఇస్తా"—అన్నాడు సుధీర్.

"సరే, ఒక్క నిమిషంలో తెచ్చిస్తాను" అని చెప్పి కుర్రాడు పరుగెత్తుకుంటూ వెళ్లి ఒక్క త్రుటిలో గాజుపెట్టె తెచ్చిచ్చాడు సుధీర్‌కు. సుధీర్ సంతోషంగా వుంగరం కుర్రాడి కిచ్చాడు.

సుధీర్ గాజుపెట్టె జేబులో దాచిపెట్టుకున్నాడు. ఇంతలోగా ఆ జైలు తలుపులు తోసుకొని రాజభటులు లోపలికి వచ్చారు.

వాళ్లు నగరానికి వెలుపలగా దూరాన ఉండే ఒక చిన్న కొండ దగ్గరకు సుధీర్‌ను తీసుకుపోయారు. అక్కడే అపరాధుల్ని వధ చేసేచోటు. ఆ నగరంలో వుండే పెద్ద మనుష్యులంతా గుమికూడారు సుధీర్‌ను నరికేప్పుడు చూడాలని వాళ్లందరికీ— చాలా మట్టుకు—సుధీర్ని చూస్తే అసూయ అతడు దర్జాగా వుంటాడని. రాజు, పెద్ద పెద్ద ఉద్యోగస్థులూ అక్కడ హాజరయారు. సుధీర్ కు ఎదురుగా ఒక పెద్ద రాక్షసుడిలాంటి మనిషి. నిలబడి మిడిగుడ్లేసుకుని సుధీర్ వైపే చూస్తున్నాడు. ఎప్పుడెప్పుడు తెగేద్దామా అని ఆత్రంగా ఉత్సాహంగా వున్నాడా పచ్చికసాయివాడు. ఇప్పటి కాతడు ఎన్ని తలలు ఎగరగొట్టాడో! అతని చేతిలో పొడుగుపాటి కత్తి, నల్లటి దుస్తులూ, వైఖరీ చూస్తే సామాన్యమానవుడు గుండెలు ఠార్ మని చావాల్సిందే. కొన్ని నిమిషాల్లో సుధీర్ కరకు కత్తికి ఎర ఔతాడు. కాని అతడు ఎంత మాత్రమూ తొణక్కుండా నవ్వుమొఖంతో వున్నాడు. భయం అంటే ఏమిటో అతనికి తెలియనే తెలియదు.

"సిద్ధంగా ఉన్నావా" అని అడిగాడు రాజు తలారివాణ్ణి. తలారి అదే మాట సుధీర్ని అడిగాడు.

"నేను మీ చేతుల్లో చావడానికి సిద్ధంగా లేను. నే నంత పనికిమాలిన వాణ్ణి గాను" అంటూ సుధీర్ గాజుపెట్టె వెలికి తీశాడు.

రెండుసార్లు మూడుసార్లు సిద్ధంగా వుండమని సుధీర్‌ని హెచ్చరించాడు తలారి. సుధీర్ ఒక్కసారి, రెండుసార్లు, మూడుసార్లు—వరసగా గాజుపెట్టె మీద కొట్టాడు. మూడు కుక్కలూ అతని ఎదురుగుండా "జోహుకుం!" అంటూ వినయంగా నిలబడ్డాయి. 'ఓ నా కోడిగుడ్డుకంటి కుక్కా' ఈ నల్లభూతాన్ని (తలారి) దూరంగా తీసికెళ్లిపో. అతణ్ణి, అతడి కత్తినీ నట్టేట్లో పడేయ్!' అని సుధీర్ కుక్కకు హుకుం భరాయించాడు. అది అల్లే చేసింది.

మళ్ళీ సుధీర్ రొట్టెకండ్ల కుక్కతో "వీళ్లందర్నీ దూరంగా తరిమి కొట్టేయ్", అని ఆజ్ఞాపించాడు. చూస్తూండగానే ఆ కుక్క పెరిగి పెరిగి పెద్దదై ఒక యిల్లంత ఐంది. దాన్ని చూచి కొందరు గుండెలవిసి అక్కడే చచ్చారు. కొందరు పలాయన మంత్రం పఠించి కాలికి బుద్ధి చెప్పారు. ఒక్క పిట్టైనా మిగిలితే వొట్టు.

"రాజునీ, రాజుకూతుర్నీ నావద్దకు తీసుకురా!" అని ఆ రెండు కుక్కలకూ చెప్పాడు సుధీర్. అవి రెండూ చెరిఒక ప్రక్క కాపలా కాస్తూ రాజును తెచ్చి సుధీర్ ముందు నిలబెట్టాయి. ఇంతలోనే మూడో కుక్క మొక[illegible]ంచో తన వీపుమీద నళినితో అతని ముందుకు వచ్చి నిలిచింది

"ఇంకా రాజుగా వుండాలని వుబలాట పడుతున్నావా?

అని సుధీర్ రాజు నడిగాడు.

"వద్దు నాకురా జరికం, గీజరికం వద్దు. కాని తెల్లరోజా కావాలి. ఆ తోట ఎలాగైనా పెట్టాలి." అన్నాడు రాజు.

"ఐతే, తెల్ల రోజా ఎలా పెంచాలో చెప్తాగాని, నీ కూతుర్ని నా కిచ్చి పెళ్లిచేసి మమ్మల్ని ఇద్దర్ని రాజు, రాణిగా నీ సింహాసనంమీద కూర్చోబెట్టి పట్టాభిషేకం చేస్తావా?

"మహా సంతోషంగా చేస్తా" నన్నాడు రాజు.

నళినీ సుధీర్లకు మహావైభవంగా పెళ్లి జరిగింది. వాళ్లు హాయిగా వున్నారు. రాజుకూడా వాళ్లతోటే శాంతజీవనం గడుపుతున్నాడు ఏ బాదరబందీ లేకుండా. అతడు తెల్లరోజా మొక్కల్ని నాటి, వాటిని చూచుకుంటూ, ఆ పూలు ఆప్యాయంగా వాసన చూచుకుంటూ దివ్యానందం అనుభవిస్తున్నాడు.

తెలుగునగల సంస్కృతీకరణములు

శ్రీ బులుసు-వేంకటరవణయ్య

భాషాంతరీకరణములను, భాషాంతర గ్రంథముల యనుసరణములును— అనుకరణములను తెలుగున వెలువడుట నేటికి పరిపాటియైన పద్ధతి; కాని యిది నన్నయనాటినుండియు నేటివఱకు నవిచ్ఛిన్నముగా వచ్చుచున్నదే గాని క్రొత్తపద్ధతి కాదు. ప్రాచీన కాలమునందీపద్ధతి కేవలము సంస్కృతము ననుసరించియే తెలుగునకు వచ్చినది

కవిత్రయమువారి భారతము సంస్కృత మూలమునకు స్వేచ్ఛాంధ్రీకరణము ఎఱ్ఱాప్రగడ, సోమనాథాదుల గ్రంథములు నిట్టివే! శ్రీనాథుని గ్రంథములు కొంతవఱకును స్వతంత్రమార్గము ననుసరించినను, అవి మూలములకు మెఱుగు పెట్టు ననువాదములుగానే ప్రసిద్ధములు వేయేల? నాటికాలపు పౌరాణికకవులందఱును గ్రంథ రచనమునకు అనువాదపద్ధతినే మేలుబంతిగా గ్రహించిరని చెప్పవలెను

పయి పద్ధతినిబట్టి చూచినచో సంస్కృత గ్రంథములన్నియు మూలములనియు, ఆంధ్ర గ్రంథములన్నియు వాని ననుసరించి వెలువడినవే యనియు ఆంధ్రలోకమున నొక యభిప్రాయ మేర్పడినది

ఆంధ్ర గ్రంథముల కవసరమగు లక్షణము— వ్యాకరణము— తొట్టతొలుత సంస్కృతముననే రచింపబడినది, ఆంధ్రశబ్దచింతామణియు, అథర్వణ కారికావళియు, దీనికి దార్కాణములు, చింతామణివ్యాఖ్యయు సంస్కృతముననే కలదు; సంగ్రహముగా నున్న విషయములు కంఠస్థము జేసికొని, దానినుండి ఎక్కువ విషయములు గ్రహించుటకు సంస్కృత మనువుగా నున్నట్లు వేఱొకభాష యనువు పడజాలదు. ఆ కారణముననే ఏకమాత్రాలాఘవమున బుత్రోత్సవమును తలచు వైయాకరణులు ఆంధ్రవ్యాకరణములను సంస్కృతమున సూత్రీకరించిరి విషయమిట్లుండగా— కొందఱు సంస్కృతమునెడ తెలుగు వారికి గల గౌరవమే యిట్టి రచనలకు కారణమనియు, ఏదయిన గ్రంథమునకు ప్రశస్తి కలుగవలెనన్న, దానిమూలము సంస్కృతమున నుండవలెననియు, లేనియెడల ప్రశస్తిగాని, వ్యాప్తిగాని కలుగజాలదనియు తలచుచుండుట కలదు

కావుననే కొన్ని యాంధ్ర ప్రబంధములకు ప్రాశస్త్యమును గల్గించుటకు మనవారు— అట్టి ప్రబంధములకు గొన్ని మూలములను కల్పించుచుందురు కాని, యట్టి సంస్కృతీకరణముల వలన తెలుగు ప్రబంధములకు ప్రశస్తికి బదులు అపకర్షయే కలుగుట కవకాశమున్నది.

ప్రౌఢాంధ్ర ప్రబంధమగు పాండురంగ మాహాత్మ్యమున కొక సంస్కృతానువాదము కలదు, పూనాపరిశోధనాలయ గ్రంథాగారములో నున్న మాతృకకు దనూరైన ప్రతిక యొకటి ఆంధ్ర సాహిత్యపరిషత్కార్యాలయమున నున్నది; ధూర్జటి మహాకవి విరచితమగు శ్రీ కాళహస్తి మాహాత్మ్యమునకు నిట్టిదే యొక సంస్కృతీకరణము అత్యంత విపులము కలదు; అది ముద్రితము కూడ. మాహాత్మ్యప్రచారమున కిట్టి గ్రంథములు వెలువడియుండవచ్చును

పాలుకురికి సోమనాథ మహాకవి కృతమగు బసవపురాణము'ను కన్నడ కవియగు శంకరారాధ్యుడు సంస్కృతీకరించెను; పండితారాధ్య చరిత్రమును ౧౬-వ శతాబ్దిలో నుండిన గురురాజ కవి సంస్కృతీకరించెను పయి యనువాదములకు ప్రసిద్ధిగాని, ప్రాశస్త్యముగాని లభింపలేదు. ఇవి మూలాతిశాయులు కాకుండుటయే దీనికి గారణము కావచ్చును పైవాని యునికియు జాలమంది సాహిత్యవేత్తలకు దెలియదు.

మంచి ప్రశస్తిని పొంది, బాగుగా ప్రచారమునందున్న గ్రంథములకు గొఱత కల్పింపదలచి అనుసరణములు, అనువాదములును వెలసె మూలమున కపకర్షను కల్పింప యత్నించుట సాహిత్యలోకమునకు క్రొత్తి కాదు ఇట్టి సంవిధానము సంస్కృతవాఙ్మయమునందును గలదు భారతకథ నత్యద్భుతముగ గొన్ని మార్పులతో లోకోత్తరముగ నాటకముగా రచించిన మహాకవి కాళిదాసు రచనాసంవిధానమునకు నకలు పద్మపురాణమున గానవచ్చుచున్నది. కాళిదాసుని యూహా కల్పితమగు మేఘసందేశమున కొక మూలకథ కల్పింపబడినది దేశకాల భేదములనుబట్టియు, నభిరుచులనుబట్టియు కొందరు కవులు స్వరచనలను బురాణముల కెక్కించి వానిని ప్రచారమునకు దెచ్చుటకిట్టి వానిని కల్పించియు నుండవచ్చును. ఇట్టి కల్పిత మూలములవలన ప్రసిద్ధ గ్రంథముల కపకర్ష కలుగనేఱదు

పయిపద్ధతి ననుసరించియే తెలుగున చిన్న శ్రీ చిన్నయసూరి విరచిత 'బాలవ్యాకరణము' నకు 'హరికారికలు' అను మూలము— శిష్టు— కృష్ణమూర్తిశాస్త్రి రచితములు కలవని ప్రచారము చేయబడినది ఆ రీతినే శ్రీ బహుజనపల్లి— సీతారామాచార్యులుగారి 'ప్రౌఢవ్యాకరణము' నకును శ్రీ భాగవతుల— రామమూర్తి శాస్త్రిగారు వ్రాసిన మూలము— 'హరికారికా శేష సర్వస్వము' కలదు, ఈ కల్పితమూల సంస్కృత సూత్రములు రెండును ముద్రితములు. అయినను, ఇవి విద్వల్లోకపు విస్రంభమునకు బాత్రములు కాలేదు

అయినను, సంస్కృతీకరణము లన్నియును మూలగ్రంథముల కపకర్షను కలిగించు ననియును చెప్ప వలనుపడదు. మూలమున కుత్కర్షను గలిగించు ననువాదములును గొన్ని కలవు. సుప్రసిద్ధ ప్రబంధమగు వసుచరిత్రమునకు సంస్కృతమునందును, ఆంగ్లమునందును, తమిళమునందును కూడ అనువాదములు కలవు సుప్రసిద్ధ విద్వాంసులగు అప్పయ దీక్షితులవారి శిష్యుడు శ్రీ కాళహస్తికవి వసుచరిత్రమును చంపూప్రబంధముగా సంస్కృతమున ననువదించెను. పేరు నూరియను విద్వాంసు డీ ప్రబంధమును 'వసుమంగళనాటక' మను దృశ్యకావ్యముగా వ్రాసెను 'అంబలత్తాడుమయ్యన్' అను నతడు వసుచరిత్రమును తమిళము లోనికి భాషాంతరీకరించెను వసుచరిత్రములోని కొంతభాగమును గత శతాబ్దిలో శ్రీ కావలి— వెంకటరామస్వామిగారు ఆంగ్లము లోనికి మార్చిరి.

కూచిమంచి తిమ్మకవి రచించిన 'రసికజన మనోభిరామము' అను ప్రబంధమును కూచిమంచి జగ్గకవి పుత్రుడగు జగ్గకవి సుజనమనః 'కుముద చంద్రిక' అను పేరిట సంస్కృతీకరించెను. గత శతాబ్దిలో శ్రీ పక్కి అప్పలనరసయ్యకవి యాంధ్రమున రచించిన 'కుమార శతకము' ను శ్రీ రావు-ధర్మారాయనింగారు సంస్కృతమునకు మార్చిరి.

పయివానినిబట్టి చూచినచో ఉత్కృష్టములగు మూల గ్రంథములను భాషాంతరీకరించిన యెడల అన్య రాష్ట్రీయులకు గూడ మూలగ్రంథములలోని విశేషములును, చమత్కారములును అందుబాటులో నుండి, వారి మన్ననలకు బాత్రములు కావచ్చునను తలంపు అనువాదకర్తలకు గలదని నిశ్చయింప వీలగుచున్నది అనువాద కర్తలు తాము తెలుగు గ్రంథముల ననువదించుచున్నామని చెప్పకొనుటవలన మూలముల కెంతేని ప్రశస్తి కలుగుచున్నది. కాని ఆంధ్రమున నిట్టి యనువాదపద్ధతిని నామము సుటంకించుచు గ్రంథములను వ్రాయువారును అనువాదముల నొనర్చువారును మిక్కిలి యరుదు.

పయి విషయములనుబట్టి ఆంధ్ర గ్రంథములకు గల సంస్కృతానువాదములు అర్వాచీనములనియు అనువాదములు సంస్కృతములైనంత మాత్రమున వానికి ప్రాచీనత కలుగజాల దనియు తెలుగుగ్రంథములే ప్రాచీనములనియు అనువాదములనుబట్టి మూలములకు నాంధ్రములకెట్టి కొఱతయు గలుగజాల దనియు తెలిసికొనవలెను.

మనరాష్ట్రం మనదేశం

(9-వ పేజీ తరువాయి)

ఉత్తరువు చేయవచ్చును. (అయితే హైకోర్టుల అధికారాల్ని మాత్రం అధ్యక్షుడు రద్దుపరచలేడు) రాష్ట్రాలలో ప్రమాదపరిస్థితు లేర్పడినప్పుడు కేంద్రప్రభుత్వాధిపతికీ మాదిరి అసాధారణ అధికారాలు అమెరికన్ ఆస్ట్రేలియన్ రాజ్యాంగాలలో కూడా ఇవ్వబడినట్లు డా॥ అంబేద్కర్ చెప్పారు. రాజ్యాంగ నిర్మాణంలోని నిబంధనల ననుసరించి రాష్ట్రపరిపాలన సాగని పక్షంలో, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత అధ్యక్షునికీ పార్లమెంటుకీ ఇవ్వడం అవసరమని డా॥ అంబేద్కర్ అన్నారు.

రాష్ట్రపరిపాలనలో అధ్యక్షుడు అనవసర జోక్యం చేసుకునే ప్రమాదం లేకుండా కొన్ని ఏర్పాట్లు చెయ్యబడినాయని చెప్పారు మొదట రాష్ట్ర ప్రభుత్వాన్ని (రాజ్యాంగ నిబంధనల ననుసరించని పక్షంలో) అధ్యక్షులు ఒకసారి హెచ్చరిస్తారు అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వినని పక్షంలో శాసనసభను రద్దుపరచి తిరిగి ఎన్నికలు జరపాలని ఉత్తరువు వెయ్యవచ్చును అప్పుడు కూడా విఫలమైన పక్షంలోనే అధ్యక్షుడు పరిపాలనా యంత్రాంగాన్ని స్వాధీనపర్చుకుంటాడు దీర్ఘచర్చ అనంతరం ఈ ప్రతిపాదనల్ని పరిషత్సభ ఆమోదించింది.

ప్రమాదపరిస్థితి ఏర్పడిందని అధ్యక్షుడు ప్రకటించే ప్రాంతంలో వ్యక్తిగత పౌరసత్వాలను కాపాడుకోడానికి కోర్టుల ద్వారా (హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చెయ్యడం మొదలైన చర్యలను) వ్యక్తులు యత్నించకుండా ఆ నిబంధనలను తాత్కాలికంగా అధ్యక్షుడు రద్దుపరచవచ్చునని ఒక నూతన నిబంధనను డా॥ అంబేద్కర్ ప్రతిపాదించారు ఈ అధికారాన్ని, అనగా ఈ పౌరస్వత్వ నిబంధనలను తాత్కాలికంగా రద్దుపరిచే అధికారం అధ్యక్షునకివ్వాలో, పార్లమెంటు కివ్వాలో రాజ్యాంగ రచనాసంఘం ఇంకా నిర్ణయించుకోలేకపోయినందువల్ల ఈ నిబంధనను తరువాత చర్చించడానికి వాయిదా వెయ్యాలని డా॥ అంబేద్కర్ సూచించారు కొంత చర్చ అనంతరం ఈ సూచన ఆమోదించబడింది.

పన్నులు:

తరువాత పరిషత్సభ రాజ్యాంగంలోని పదో భాగాన్ని చర్చించింది. ఇది ఆయవ్యయాలకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వ రెవిన్యూ రాష్ట్రప్రభుత్వాల రెవిన్యూలకు సంబంధించిన సామాన్యనిబంధనలు ఆమోదించబడినాయి తరువాత రాష్ట్రాలు కేంద్రానికి మధ్య రెవిన్యూల పంపకానికి సంబంధించిన 249 వ నిబంధనపై చర్చ జరిగింది.

పన్నులన్నిటినీ కేంద్రప్రభుత్వమే వసూలు చెయ్యాలనీ, పన్నుల వసూలు విషయంలో రాష్ట్రప్రభుత్వాలకు అధికారాలుంచినట్లయితే దేశవిచ్ఛిత్తికి హేతువవుతుందనీ బ్రజేశ్వరప్రసాద్ గారు వాదించారు. పన్నులపంపకం విధానాన్ని సంస్కరించడంకోసం సర్కార్ కమిటీ నివేదనల్ని రాజ్యాంగరచనాసంఘం అంగీకరించనందుకు కొందరు సభ్యులు విమర్శించారు. ఈకమిటీని పరిషదధ్యక్షులు డా॥ రాజేంద్రప్రసాద్ నియమించారు.

వ్యావసాయకభూమి మినహా మిగతా ఆస్తుల వారసత్వ సుంకాలూ, ఎస్టేటుడ్యూటీలు, రైల్వే రవానారేట్ల సుంకాలు మొదలైనవానికి సంబంధించిన, అనగా కేంద్రప్రభుత్వం విధించి వసూలుచేసి రాష్ట్రాల కిచ్చే సుంకాలకు సంబంధించిన 250 నిబంధనపై చర్చ వాయిదా పడింది.

తరువాత వ్యవసాయికాదాయంకాక తదితర ఆదాయాలపై పన్నులను కేంద్రప్రభుత్వం వసూలుచేసి కేంద్రానికీ రాష్ట్రాలకూ పంచుకోవాలి ఏ నిష్పత్తిలో పంచాలో నిర్ణయాధికారాన్ని అధ్యక్షునికి విడిచిపెట్టాలని 251 వ నిబంధన సూచిస్తోంది ఈ అధికారాన్ని అధ్యక్షునికికాక పార్లమెంటు కివ్వాలని శాక్సేనా సూచించారు దీనివల్ల రాష్ట్రాలమధ్య విరోధాలు హెచ్చగలవనీ, కొన్నిరాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందనీ డా॥ అంబేద్కర్ చెప్పారు. 251 వ నిబంధనను సభ ఆమోదించింది.

ఉప్పుపై పన్ను:

ఉప్పుపైన పన్ను విధించరాదని 253 వ నిబంధన సూచిస్తోంది. ఉప్పుపై పన్ను విధించినా విధించకపోయినా ఇటువంటి నిషేధం ఉండరాదని మహావీరత్యాగి చెప్తూ ఈనిబంధనను తొలగించాలని ఒక సవరణ ప్రతిపాదించారు

ఈ సవరణకు రాజ్యాంగ రచనాసంఘం తరఫున డా॥ అంబేద్కర్ ఆమోదం ప్రకటించారు. ఉప్పుపై పన్ను విధించడానికి ప్రతికూలురే అయినప్పటికీ పన్ను విధించేదీ విధించనిదీ నిర్ణయించే అధికారం పార్లమెంటు కుండవలసిందే కాని రాజ్యాంగపరిషత్సభ నిర్ణయించరాదని మహావీరత్యాగి చెప్పారు

ఇంతలో పరిషదధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్ చర్చలో జోక్యం చేసుకుని ఈ సవరణను రాజ్యాంగ రచనా సంఘం అంగీకరించడం వింతగా ఉందన్నారు. ఉప్పు పన్ను తొలగించాలని గాంధీమహాత్ముడు ఆందోళన చేసినది అల్పకార్యం కాదు స్వల్పహేతువులకోసం కాదు ఈ పన్నువల్ల దేశంలోని కడు పేదకూడా ప్రతిపూటా, పన్ను చెల్లించవలసి వచ్చినందువల్లనే గాంధీజీ ఈపన్ను రద్దుచెయ్యాలన్నారు బ్రిటిష్ బలాన్నెదిరించి పోరాడడానికి ఈఉప్పుపన్నునే గాంధీజీ ఆయుధంగా ప్రయోగించారు. దీనివల్లనే దేశందేశం అంతా శాసనోల్లంఘనోద్యమంలో [illegible]డు వారాల్లో వారి ననుసరించింది ఆపన్ను నీనాడు తిరిగి విధింపదలిచినట్లయితే దేశంలో తిరిగి అంత కల్లోలం సంభవించి తీరుతుందని హెచ్చరించారు.

డా॥ రాజేంద్రప్రసాద్, గాంధీజీ స్మృత్యర్థమైనా ఇటువంటి నిషేధం ఉండవలసిన అవసరం ఉందో లేదో సభ్యులంతా తిరిగి యోచించుకోవాలన్నారు. దీనితో ఈ విషయంపై నిర్ణయం వాయిదాపడింది. [సీతారాం]

దక్షిణదేశ దేవాలయాలు

(10-పేజీ తరువాయి)

ఈ దేవతావిగ్రహపు స్వభావమునుబట్టి దీనికి యోగ, భోగ, వీరములను మూడు భేదములచే మూడు రూపము లేర్పడుచున్నవి. యోగవిష్ణు విగ్రహము సాధారణముగా జనపదస్థలములకు చాలాదూరముగా నిర్మానుష్యమయిన సుందర ప్రదేశములలో ప్రతిష్ఠింపబడును. యోగీశ్వరుడు కాగోరి యోగవిష్ణువు నారాధించు భక్తుడు నిశ్చలముగా, నిరుపద్రవముగా తపస్సు చేసికొనుటకు అట్టి ప్రదేశములే తగినవి గనుక యోగవిష్ణు దేవాలయము లట్టి ప్రదేశములందు నిర్మింపబడుచున్నవి.

భోగవిష్ణుదేవాలయములు సాధారణముగా జనసమ్మర్దప్రదేశములందే అనగా గ్రామములందును, నగరములందును, నెలకొల్పబడుచున్నవి. మహావిష్ణువు అవతారభేదముల విగ్రహములతో ననేక దేవాలయములు జనసమ్మర్ద ప్రదేశములందే వెలసియున్నవి. ఈ భోగవిష్ణువు, భక్తాభీష్ట ప్రదుడు. సర్వజనప్రియుడు. మహావిష్ణువు మఱియొక రూపభేదము వీర విష్ణువు. ఇతడు సత్యసంపదను, యుద్ధ విజయమును నొసగునని రాజులు, వీరులు మొదలగు వారీ రూపమునందే మహావిష్ణువు నారాధింతురు. వీర నరసింహ, ఉగ్రనరసింహ, దేవాలయము లిట్టివే. ఈ దేవాలయములు సాధారణముగా నగరములకు వెలుపల నిర్మింపబడుచున్నవి. ఇవికాక అభిచారిక దైవములని పేర్కొనబడు క్షుద్రదైవతముల ప్రతిష్ఠించిన దేవాలయములు మహారణ్యమధ్యములందును, కొండలలోయలయందును, నిర్మింపబడుచున్నవి. ఇట్లు ఆయాదేవుల స్వరూప స్వభావ భేదములనుబట్టి వివిధస్థలములలో నాయా దైవములకు దేవాలయములు నిర్మింపబడుచున్నవి.

దేవాలయ నివేశన విషయమునకు వలెనే మన పూర్వులు ఆయా నివేశనస్థలముల యందలి మృద్భేదమునకును సమాన ప్రాముఖ్యమును చూపిచుండిరి. తెలుపురంగు నేల బ్రాహ్మణ దైవములకును, పసుపురంగు నేల క్షత్రియదైవములకును, ఎఱుపురంగు నేల వైశ్యులకును, నల్లరంగు నేల శూద్రులకును శ్రేష్ఠములని చెప్పబడుచున్నది. ప్రాచీన శిల్పశాస్త్రములలో దేవాలయ నిర్మాణసందర్భమున నేల వాసనకూడ పరిగణింపవలయునని చెప్పబడి యున్నది. బ్రాహ్మణ దైవములకు మన్ను తియ్యగను, నీరు నేయివలెను నున్న నేల శ్రేష్ఠమనియు, క్షత్రియ దైవములకు రక్తవర్ణము గల చిక్కని ధాతువులతోడి నేలయు, వైశ్యులకు మిక్కిలి తెల్లనైన నేలయు, శూద్రులకు దుర్వాసనకల నేలయు శ్రేష్ఠములని చెప్పబడుచున్నది. ఈ వివరములను బట్టి ప్రాచీన శిల్పశాస్త్రజ్ఞులు, దేవాలయ నిర్మాణ కర్మఠులు దేవాలయములను నిర్మించు సందర్భమున నాయా భేదములను బట్టి తత్తదర్హ నివేశన స్థలముల నెన్నుకొనుటయం దెంతో జాగరూకులయి యుండిరనియు, దమ యిచ్చవచ్చిన చోట దమ యిచ్చకు వచ్చిన దైవముల ప్రతిష్ఠించి దేవాలయముల నెలకొలుపలే దనియు తెలియుచున్నది.

దక్షిణదేశములో సాధారణముగా నన్ని దేవాలయములయందును దేవాలయ నిర్మాణ పద్ధతి, దేవాలయ స్వరూపము ఒక్కటిగానే గోచరించుచున్నది. దేవాలయ నిర్మాణములలో ప్రధానములయినవి కొన్ని యిందు పేర్కొనబడుచున్నవి.

1. గర్భగృహము - ఇందు మూలవిరాట్టు ప్రతిష్ఠింపబడును. ఈ గర్భగృహమునకు మీద నొక విమాన ముండును. ఈ గర్భగృహమునందలి మూలవిరాట్టున కెదుట 'ముఖమండప' ముండును. ఇందు ఉత్సవ విగ్రహములను వేంచేపు చేయించి పూజాదికములు, అభిషేకములు జరుపుదురు. ఈ ముఖమండపమున కిరువైపులను ద్వారపాలకులుందురు. ఈ ద్వారపాలక విగ్రహములకు ముందు వైపున మహామండపము లేక అర్ధమండపము అని పిలువబడు నొక పెద్ద మండప ముండును. ఈ మండపమునందే వాహనాదులను తెచ్చి యుత్సవకాలములందు అలంకరింతురు. ఈ యర్ధ మండపమున కెట్టయెదుట ధ్వజస్తంభమును, బలిపీఠమును నుండును. ఇట్టి విభాగములతో రూపొందిన దేవాలయమునకు జుట్టును గట్టి రాతిగోడలతో ప్రాకార ముండును. ఈ ప్రాకారముఖమునందు ఒకటిగాని, యంతకింక నెక్కువగా గాని గోపురములు కట్టుదురు. దేవాలయములకు వెలుపలను లోపలను గూడ పుష్కరిణులు అని పిలువబడు జలాశయము లుండును. ఆ పుష్కరిణుల యందు స్నానముచేయుట యతి పవిత్రముగా నెంచబడుచున్నది. మూల విరాట్టును వెలయించిన గర్భగృహమునకు చుట్టును చిల్లరదైవములకును మతాచార్యులకును గట్టబడిన చిన్న చిన్న దేవాలయములుండును. పెద్దపెద్ద దేవాలయములయం దింకను గొప్పగా కాళావిన్యాసము ప్రక్కలించు శిల్పఖండములు కనువిందు గొలుపుచుండును. శ్రీరంగములోని రంగనాథస్వామి దేవాలయమున కేడు పెద్ద ప్రాకారములు కలవు. తత్ప్రాకారకుడ్యాంతర్భాగముననే రంగనగరము వెలయుచున్నది. ఆముక్తమాల్యదలోని శ్రీరంగనాథస్వామికి గల యేడుప్రాకారముల వర్ణన మిది చూడుడు—

> చని కాంచె న్విరజాభిధాంతిరుప్రు
> స్నహోద్యద్భవాతీర నం
> దనవాటీ వలయద్రుమావళి దళాం
> తర్ద్రశ్య పాపాళిభం
> జన చాంపేయసుమాయమాన విషము
> స్వర్ణావృతి వ్రాతర
> త్న నభస్స్పృక్శిఖరాళి దీపకళికా
> శృంగంబు శ్రీరంగమున్.
>
> ఆముక్తమాల్యద. ఆ. 7. ప 27.

దక్షిణ దేశములోని ప్రాచీన దేవాలయ శిల్పము మహోన్నతమై, మహా వైభవోపేతమై, చిత్రచిత్రశిల్పఖండ మండితమై యాయా దేవాలయములలోని దైవముల నారాధించు భక్తాగ్రగణ్యులకు, ప్రజలకు భక్తిగుణమును ప్రజ్వలింప జేయుచున్నది. మహోన్నత దేవాలయ గోపురశిఖరమును దలయెత్తి చూచిన ప్రతి హైందవుడును, నా దేవాలయశిల్పమునకు దల యొగ్గి వినమ్రుడై నమస్కరించి భక్తి గౌరవములతో దత్కళావైదగ్ధ్యము నగ్గింపక మానడు. ఈ దేవాలయములు సంస్కృతి నిలయములై విద్యాతీర్థములై వెలసి నేటి భవన నిర్మాణసాధనములు లేని యా ప్రాచీన కాలముననే మనవారు అనవరతతపస్సాధ్యమయిన యుత్తమ శిల్పకళను వెలయించి యెట్టి మహోన్నత శిల్ప కళాఖండముల వెలయించిరో యూహింప జేయుచున్నవి. 'క్రొత్త యొక వింత ప్రాత యొకరోత' అని తలపబడుచున్న యీ కాలమున గూడ నీ దేవాలయములు మహోన్నత శిల్పకళానైపుణ్యము వెలయుటచేత ప్రత్యేక శిల్ప గౌరవము పడసియున్నవి. మన ప్రాచీన శిల్పకళావేత్తల కళావైదగ్ధ్యము, నిర్మితసామర్థ్యము అట్టివి! ఈ కాలమునకే కాదు ఏకాలమునకు గూడ నివి జగాదివ్యటీలై విశ్వమెల్ల వెలుగులు వెదజల్లగలవు.

దక్షిణ దేశములోని కొన్ని దేవాలయములు పూజా స్థలములుగా మాత్రమేగాక ప్రసిద్ధ గురుకులములుగను, విశ్వ విద్యాలయములుగనుగూడ వెలసినవి. చిదంబరము, కంచి మొదలగు స్థలములలోని దేవాలయములలో ప్రాకారముల నంటి విద్యామండపములు నిర్మింపబడియున్నవి. అవి విద్యార్థులు, ఆచార్యులు కూర్చుండి పాఠప్రవచనముల చేయుట కనువుగా నున్నవి. ఈ విద్యాసంస్థలు, గురుకులములు మహారాజులనే పోషింపబడుచుండినవి. అందు విద్యాభ్యాసము చేయు విద్యార్థులకు విద్యాసౌకర్యముతోబాటు ఉచితముగా భోజనాదివసతులు కల్పింపబడుచుండెను.

కొన్నిచోట్ల దేవాలయములు రక్షణస్థలములుగా గూడ వెలయుచుండినవి. రాజ్యములో నంతఃకలహములు అల్లకల్లోలములు, అరాచకములు చెలరేగినపుడు ప్రజలు దేవాలయములలో దాగుకొని తమ్ము, తమ ధనసంచయమును గాపాడుకొనుచుండిరి. ఇందు కొఱకై యీ దేవాలయములలో 'నేలమాళిగ'లు కూడ నిర్మింప బడుచుండెను. ఆపత్సమయములందు ఈ నేలమాళిగలలో ప్రధానదేవ విగ్రహములను దేవధనమును దాచుచుండిరి. ఈ దేవాలయముల చుట్టును బజారులు గ్రామములు ఏర్పడినవి. ఆ ప్రదేశమునకు చుట్టుప్రక్కల నుత్పత్తియగు పదార్థములా బజారులలో నమ్మకము చేయుచుండిరి. ఉత్సవసమయములందు చుట్టుప్రక్కలనున్న పల్లీయులు, గ్రామీణులు ఈ దేవాలయ ప్రదేశములయందు జేరి యచట తమ నిత్యావసర పదార్థముల కొనుగోలు చేయుటమాత్రమే గాక బంధుమిత్ర సందర్శనములకు, నూతన పరిచయములకు నది పదవకాశము కనుక యిచ్చటనే పెండ్లి సంబంధములు కుదుర్చుకొని పెండ్లి పేరములుకూడ సాగించుచుండిరి. ఈ తీరున ప్రధాన దేవాలయములలో నేటికిని జరుగు వివాహసంప్రదాయ మేర్పడి పరంపరగా సంప్రదాయముక్రింద చెల్లుబడి యగుచున్నది.

ఇట్లు దేవాలయములు పూజాస్థలములు మాత్రమే గాక విద్యా సంస్కృతులకును ప్రధానకేంద్రములై వ్యాపారమునకు, సాంఘిక శుభకార్యావసరములకు మంగళ నిలయములై, ప్రజాసామాన్యమునకు మహోపకారములై విలసిల్లుచు తత్తద్దేవాలయనిర్మాణము గావించిన మహనీయుల పవిత్ర సంకల్పములకు బ్రబల తార్కాణములై వెలయుచున్నవి!

అటూ - ఇటూ

(11-వ పేజీ తరువాయి)

ఉంది. పిల్లలు - పెద్దలు - వృద్ధులు-యువకులు - స్త్రీలు - మానవప్రపంచమంతా అక్కడే వుంది.

అరహదారికి ఒక ప్రక్కగా ఒక వికలాంగుడు - ముదుసలి - కుష్ఠవ్యాధి పీడితుడు - పీలిక పేలికలతో దిగంబరుడై - చలికి వడవడ వడుకుతూ కూర్చున్నాడు. ఒడలంతయు కుష్ఠము! అంగము లన్నియు వికృతములైనవి. శరీరమంతా పుండ్లతో రసిగారుతూ బొమికలగూడుగా నున్నాడా ముదుసలి! ఉదరము వెన్నునంటినది. ఆ జనసమూహం వైపు చూస్తూ వికలములైన ఆ హస్తాలనెత్తిజూపి ఏదో అర్థిస్తున్నాడు.

ఆ యాత్రాసమూహం తన దారిన తాను పోతోంది.

కొందరు ఆ వికలాంగుని చూడనైన చూడలేదు. చూచీ - చూడనట్లు వెళ్లిపోయినవారు కొందరు. చూచి అసహ్యించుకొన్నవారు మరి కొందరు. 'అయ్యో-పాపము - భగవానుడు రక్షించుగాక!' అని యింక కొందరు.

'పాపిష్ఠివెధవలు! పవిత్రయాత్రాస్థలిలో యీ కుష్ఠరోగుల నుండనీయ కూడదు.' అని వేరొక కొందరు.

పలువురు పలువిధాల అనుకొంటూ వారి దారిన వారు పోతున్నారు.

అప్పటినుండీ అమ్మా! అయ్యా! అంటూనే ఉన్నాడా వికతజీవి!

ఆ సమూహంలో ఒక పురాణయువతి ఉత్సవ దర్శనానికి వెళ్తూ మార్గంలో యీ యాచకుని చూచినది. ఆమె దయార్ద్రహృదయ. తాను తింటున్న రొట్టెముక్కను ఆ కుష్ఠరోగిముందు విసరినది. ప్రక్కనే కాచుకొనివున్న ఒకకుక్క ఆ రొట్టెను నోట గరచుకొని బరుగెత్తబోయింది. కుష్ఠరోగి తన కఱ్ఱతో అదిలించి ఆ కుక్క తోకను గట్టిగా పట్టుకొని యీడ్చి నోటిలోని రొట్టెముక్కను పెకలించి తీసుకొన్నాడు. ఆ కుక్క వీని చెయ్యి కరచింది. రక్తం కారుతున్న ఆ చేతితోనే రొట్టెను తింటున్నాడు.

జనసమూహంలో కోలాహలం వినబడ్డది. మఠాధిపతిగారి యేనుగు ఆ గజిబిజిలో కలవరపడి, సమూహం మీదకు రొగపడింది. కవ్వున కేకలతో స్త్రీలు - శిశువులు బాలలు - యువకులు - వృద్ధులు - ప్రాణరక్షణకై పరుగులెత్తుతున్నారు. గజిబిజిపాటు హెచ్చింది.

ఆ కుష్ఠరోగి లేవలేక చేతికఱ్ఱతో లేచి కుంటుకుంటూ స్త్రీలనూ బాలలనూ తోసుకొంటూ ప్రాణరక్షణకై అందరికన్న ముందు పరుగెత్తుతున్నాడు !!!

అనాథుడు - దరిద్రుడు - రోగి - మృతప్రాయుడు - వృద్ధుడు - ప్రాణాలను గుప్పెటిలో బెట్టుకొని ముందు తోసుకుపోతున్నాడు.

ఏ పరలోకనరకాన్ని - యే కల్పనానరకాన్ని అనుభవించడానికి భయపడి యీ యిహలోక నరకాన్ని అనుభవించడానికి ఉద్యుక్తుడయ్యాడు యీ వృద్ధుడు ???

నేడు ఆంధ్రరాష్ట్రం ఎందుకు?

(6-వ పేజీ తరువాయి)

...తో, వ్యక్తిగత ముఠాలతో కొట్టుకలాడు తున్న కాంగ్రెస్ నాయకత్వం ప్రజాపద్ధతినే అమలు జరపగలుతుందా? అధికారవాంఛలోనున్న పంపిణీలు, అందుకు సంబంధించిన ముఠాలు, ఆ ముఠాలకు సంబంధించిన స్థానికముఠాలు ఏవి ఎక్కడ విరిగి పోతవో తెలియదు. జాతీయఉద్యమ ప్రభావం రావడంతో ఈనాడు పరిశ్రమలు వ్యాపారాలు జరుగుతున్న వ్యక్తిపద్ధతి కొన్నిచోట్ల అచటి ప్రజల భాషాధారక జాతీయసిద్ధాంతానికి వ్యతిరేకం అవుతుంది దక్షిణాది అరవల మధ్యలో నున్న ఆంధ్రవ్యాపారులు, ఆంధ్రుల మధ్యలో నున్న అరవ, ఉద్యోగులు, మార్వాడీ గుజరాతీ వ్యాపారులు, అరవ, ఆంధ్ర మహారాష్ట్ర ప్రాంతాల్లోనున్న ఉత్తరదేశ వ్యాపారులు, ఆయాప్రాంతాలలోవున్న లంచగొండి ఉద్యోగులలో ఎవరికి వారు తమను రక్షించుకొనటకు ఇతర భాషాప్రాంతంవారిపై ఆరోపణలు వీరి కందరికె పైనుండి వత్తాసిరావడం ఈవిధంగా ప్రజలపద్ధతి కాకుండా, పాలన, స్వార్థంలతో నడుస్తున్నపుడు భాషాప్రాంతాల నిర్ణయం జరగడంఅంటే తామిన్నాళ్లనుండి వాడుకుంటున్న భాషా, కులం, మతం పేర్లు పటాపంచలవుతవి.

అరవలతో లాలూచీఅయి డాక్టరు పట్టాభి గ్రూపు కామరాజనాడారుతో రాజీ పట్టాడంటున్నారే, ఆంధ్రులు మలబారు అడవులు గుత తీసికోవడం యెట్లాజరిగింది. అరవల బలంతో శ్రీ ప్రకాశంగారు వూడిపోనారంటున్న రోజులలో ప్రకాశంగారే తనకు 40 మంది, అరవలు వోటుచేయడంవల్లనే ఆమాత్రం బలమైనావచ్చిందని 1947లో తెనాలిలో నాగేశ్వరపు ప్రదర్శన సందర్భంలో చెప్పారే! అధికార పదవి అదిష్టించేటంతవరకు ఆంధ్రరాష్ట్రం కావాలెననే ప్రతి ఆంధ్రుడు అధికార స్వీకరించిన వెంటనే ప్రస్తుతం ఆంధ్రరాష్ట్ర విభజన అవసరం లేదంటారే, రాజాపానగల్లు పెలలమ్రి ఆంజనేయులుగారి ఆంధ్రరాష్ట్ర తీర్మానాన్ని బలపరిచారా? బొబ్బిలి మంత్రి కాగానే చిన్న జేబుఅంత ఆంధ్రరాష్ట్రం ఎందుకు లెమ్మన్నది ఎవరెరుగరు, బొబ్బిలి మునిస్వామినాయుడు గారు ప్రధానమంత్రి అయినపుడు ఆంధ్రరాష్ట్రం ప్రసక్తి తేవలదన్నది ఎవరికి తెలియదు సర్ కే. వి రెడ్డినాయుడు గవర్నరయినపుడు ఆంధ్ర రాష్ట్రం ప్రస్తుతం తలపెట్టరాలదన్నది అందరికి తెలిసిందేకదా. ప్రకాశంగారు ప్రధానమంత్రి అయినపుడు ఆంధ్రరాష్ట్రం విషయం పరిశీలించటానికి ఇండియా కార్యదర్శికి కూడా తీరక లేదని 1947 సెప్టెంబరు 7 వ తేదీ శాసనసభలో చెప్పిన దెవరు మరచియుందురు

వీటి కారణం ఆనాటి వ్యవహారాలలో ఉన్న ఋలాలను, అధికారాన్ని పోగొట్టుకొనుట కిష్టంలేకపోవడమేగదా. ఈ పరిస్థితుల నవగతం చేసుకున్న మనకు విశాలాంధ్ర నిర్మాణం నాయకవర్గంవల్ల జరిగేది కాదని అవగతంచేసుకొనిన మనకు ఈ నాయకత్రయ నివేదిక భాషాధారక ప్రాంతాలను సమన్వయపరచి విశాలాంధ్ర, విశాల మహారాష్ట్ర, ఐక్యకేరళ, ఐక్యకర్నాటక ప్రాంతాలను నిర్మిస్తుందని ఏవిధంగా ఆశించగలం?

థార్ కమిటీ చెప్పినట్లు భాషాధారక రాష్ట్ర నిర్మాణాలను అసలు త్రోసివేయము అన్నారు. అయితే అనేకావసరాలున్నవి, వాటిని గుర్తించుకోమన్నారు. ప్రస్తుతం ఆలోచించజాలము అన్నారు. ప్రజల వత్తిడిని గ్రహిస్తాముని ప్రజలకు శాంతవచనాలు చెప్పారు. ప్రజల వత్తిడి వచ్చినా ఒక ఆంధ్రరాష్ట్రం యిస్తామన్నారు. తగాదా ప్రాంతాల్లోకి అడుగు పెట్టం అన్నారు. ఒక రాష్ట్రంలో వుండి వివాదాలు లేకపోతే విభజించటానికి ప్రయత్నిస్తామన్నారు. బొంబాయిలో గుజరాతీ పెత్తనం వుండాలిసిందేనని నిర్ణయించారు. మద్రాసు విషయంలో పేచీవచ్చింది. మహారాష్ట్రిల పలుకుబడికన్నా గుజరాతీ పెట్టుబడిదారుల పలుకుబడివల్ల బొంబాయి భవిష్యత్తు మహారాష్ట్ర ప్రజానీకంనుండి గుంజుకొన్నారు. మద్రాసు పెవరు లాక్కోడమా అనేది సమస్య అయింది. మద్రాసు నగరంలో 1931 జనాభా ప్రకారం ఉన్న 6,47,230 మందిలో 4,11,823 అరవలు, 1,24,649 మంది ఆంధ్రులు ఉన్నారు. మద్రాసు నగరం సగం వరకే ఆంధ్రుల దనడంతో మద్రాసు అంతా అరవలదేనని తేలిపోతున్నది. జనాభా వివరాలు పరికించితే ఆంధ్రులు పులుకోటవరకు ప్రధానముగా అల్పసంఖ్యాకులుగా నున్నట్లు తేలుతుంది. అంతేకాని అన్నిగ్రామాలలో నూటికి 50 కి ఎక్కువ వున్నట్లు తేలడంలేదు. అందుచే ఇది అరవ ఆంధ్రప్రాంతం అనవలసివస్తుంది. మద్రాసు దక్షిణం అరవలదే అయినపుడు, మద్రాసులో ఆంధ్రులు నూటికి 30 వంతున వున్నపుడు ప్రధానంగా అరవప్రాంతమేనని తేలుతున్నది ఈ పరిస్థితులలో మద్రాసును తమిళప్రాంతంలో కల్పడం వాదన ప్రకారం సరిఅవుతుందికదా అట్టియెడ ఏమీ తేల్చక వదలడమెందుకు తటపించినదో ఆలోచించవలసి వుంది. ప్రజల నిర్ణయానికి వదలవలసింది ప్రజల నిర్ణయానికి మద్రాసు వదలుచో, బొంబాయిలోని ప్రజలు బొంబాయిలోనూ ప్రజల నిర్ణయం తీసుకొనమని కోరినారుగా! థార్ కమిటీ పరిపాలనవాదన, నాయకుల అధికారవాదన, పంపిణీవాదన ప్రజావాదనకు వ్యతిరేకం గాదూ. చివరకు ప్రజానిర్ణయం యివ్వలేకపోయినారు యివ్వజాలరు అందువలననే ఆంధ్రులు మద్రాసును వదులుకుంటేనే ఆంధ్ర రాష్ట్రం అని అన్నారు. అదీ మద్రాసు రాష్ట్రంలోని 11 జిల్లాలతోనే అన్నారు.

అన్నీ ప్రజాభిమతంమీద ఆధారపడి నిర్వహిస్తున్నట్లు అందరు అంగీకరిస్తే రాష్ట్రం నిర్మిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర దురభిమానాలతో కలుషితమగుతూ, నిజమగు భాషాధారక జాతీయసిద్ధాంతాన్ని అపకతవకలుచేసి, అవసరమయితే తమ స్వార్థాల కుపయోగించుకుంటూన్న రాష్ట్రరాజకీయ వాతావరణంలో మద్రాసు వదులుకోవడమా, ఉండడమా అనే సమస్యపై కేంద్రీకరింపచేసి అసలు భాషాధారక సమస్యను జాతీయ సిద్ధాంతాన్ని మూలకు నెట్టదలంచారు. ప్రతి చిన్నసమస్యలోనూ ముఠాలుగా విభాగమైపోయిన ఆంధ్ర జీవితంలో నాయకులు ఏకాభిప్రాయానికి రావడం అసంభవం. ఆలోచనకన్నా ఆవేశాలు మించిపోయివున్నవి. ఆలోచనకు, ప్రజాసమస్యలకు తావన్నమాట లేదు. వాటి గోడు పట్టించుకొనేవారు కన్పించడంలేదు. ఆంధ్రజనసామాన్యం మహాభావంలో ఆంధ్రరాష్ట్రం ఒక రాజకీయ నినాదం అనేది, ప్రధాన సమస్య అనేది అందరికి తెలిసిందే. ఆంధ్ర మధ్యతరగతిలో ప్రతివారిలోనూ రగులుకుంటున్న అగ్ని ఆంధ్రసమస్య మంత్రిత్వపు తగాదాలలో మధ్యతరగతి ప్రజలను తమ వెంట వేసుకోవడం అవసరం. అది ఎవరి స్వార్థాలకు నష్టంరానిదిగావుంటే, ఒక ఆశయంగా వుండడం మరింత తేలిక. అందుకు ఆంధ్రరాష్ట్రం సాధ్యంగా తలంచారు. తమలోవున్న పేచీలు ఆంధ్రతమిళ పేచీలుగా ప్రజలలో భ్రమలు కల్పింపబడినవి. ప్రజలు అరవవాండ్రకు మద్రాసు వదలుదామాఅని, అరవలకు మద్రాసు దానం చేయడానికి పట్టాభి యెవరని ఒక రావేశపడుతుంటే, మరొక ముఠా మన ఆశయం ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రరాష్ట్రం సాధించే అవకాశంలో అడ్డపడుతున్నారు. లేకపోతే అంతా వచ్చేసేదేనని అంటున్నారు. ఈనాటి మంత్రివర్గ తగాదాల కన్నింటికి ఈ ఆంధ్రరాష్ట్రమే పరిష్కారం అని రెండు గ్రూపులవారూ ప్రచారం చేస్తున్నారు. దీనినిబట్టి ప్రజలు నిజంగా ఇది మద్రాసు రాజధానిలోని ఆర్థిక రాజకీయ దుస్థితి అంతా తమిళతగాదా కావాలెననే దుర్భ్రమలకు తావు కల్పింప బడుతున్నది. ప్రజలు ఈ ఆవేశంలో కొట్టుకోపోయేటట్లుచేసి తమ పచ్చాలను పెద్దలు గడపుకుంటున్నారు.

ఆంధ్రరాష్ట్రం నిర్మాణంచేయడం అంటే-రాజప్రముఖుల అధ్వర్యంలేకుండా భాషాప్రయుక్తంగా రాష్ట్రం విభజించడంఅంటే భాషాధారక జాతీయదృక్పథాన్ని, సిద్ధాంతాన్ని ఈనాడు ఈ కాంగ్రెస్ నాయకత్వం ఆచరణలో అమలుజరుపడం అన్నమాట. అది జరపడం అంటే ఆంధ్రరాష్ట్రం నిర్మించిన వెంటనే మహారాష్ట్రిలు, కర్నాటకులు తమ భాషాభాగాల ప్రత్యేకతకు ఆందోళన చేయకమానరు. ప్రతి రాష్ట్ర మంత్రివర్గాలల్లోను భాషా ముఠాలక్రింద కులాల ముఠాలవుంద, మరియితర మురాల క్రింద ప్రజలను తప్పుదారిలోపెట్టి వీరి నుపయోగించుకొని తమపనలు చేసుకుంటున్నారు. భాషాధారకంగా కొంత విభజనఅయితే ప్రజలలో అసలు ఆ జాతీయభావం, స్వయనిర్ణయ దృక్పథంకు పునాదులు వేయడం అవుతుంది. ఆంధ్రాభ్యుదయానికి అప్పుడుఅంతా అరవపరిపాలనయేనని తప్పుకోపోయేటందుకు ఆనాడు అవకాశం వుండదు. ఆహారసమస్యా పరిష్కారానికి అరవల తరుగుప్రాంతం కారణమని, ప్రాజక్టుల నిర్మాణానికి అరవలు అడ్డుతగులుటయే కారణమని, విద్యాభివృద్ధికి అరవలు అడ్డుతగులుతున్నారని, ఆంధ్రేతరుడు విద్యామంత్రి ప్రాజక్టుల మంత్రి కావడంవల్ల అంతా అన్యాయం జరుగుతున్నదని తలంచే దుర్భ్రమపోతుంది. నిజంగా ఎప్పుడైనా అడ్డతగిలినవి లేకపోలేదు. వాటికి విరుగుడు చూడగలుగుతాం. ఆంధ్రసమైక్యతకు సమానాభివృద్ధి ఆంధ్రప్రాంతంలో లేకపోవడం అనేది ముఖ్యం అందు కెవరికివారు, ఏ ప్రాంతాని కాప్రాంతం వెనుకబడియున్న కారణంతో తమకే ప్రాధాన్యత యివ్వమని కోరడం సహజం ఆకోర్కెను అసలు అవకాశాలున్న కొద్దిలో ఈనాటి సాంఘిక గిరిగీతను, ఆర్థికఅవధులను, రాజకీయ ముఠాతత్వాలను దాటిపోలేక ఏ అభివృద్ధి చేయలేకపోతూ దీనికంతా కారణం అన్యథా చూపుతున్నారు

ఆంధ్రప్రాంతంలో తెలంగాణా దుర్భర జాగీర్దారీవిధానంలో నలిగిపోతున్నది. బస్తరు, మన్యం మురాదారీ భూస్వామ్యపద్ధతితో క్రుంగిపోతున్నది. దక్షిణాంధ్రం కరువు, జమీందారులతోనూ బాధపడుతున్నది. ఇక మద్రాసు రాష్ట్రంలో చూస్తే ఉన్న జిల్లాలలో ఉత్తర భాగంలో విశాఖజిల్లా యెల్లపుడు కరువుతో నలిగి నవసిపోతున్నది భరింపరాని జమీందారీ, ఈనాందారీవిధానంతో కృషించిపోతున్నది. ఎప్పుడూ కరువే! బాగా అభివృద్ధిపొందిన ఒకటి రెండు బస్తీలు తిన తిండిలేక అలమటించే జనం పశ్చిమప్రాంతాలకుపోతే ప్రతి సంవత్సరానికి, రెండుసంవత్సరాలకు కరువులు. దక్షిణజిల్లాలు నెల్లూరు, చిత్తూరులు చూస్తే జమీందారీబాధ, మొత్తంమీద అప్పులబాధ. మధ్యప్రాంతం గుంటూరులో మధ్యతరగతి రైతులతో సరిపోతున్నది. కృష్ణ గోదావరి జిల్లాలలో మరల జమీందారీ అగ్రహారం దారీ బాధలు అధికోత్పత్తికి ఆటంకం అవుతున్నది. ఇంత కాంగ్రెస్ రాజకీయాలతో చైతన్యంవచ్చినా, వీరేశలింగం గారితో సాంఘిక సంస్కరణలు ప్రబలుటకు ప్రయత్నించినా, గాంధీజీ హరిజనోద్ధరణతో అస్పృశ్యతానిర్మూలానికి ప్రయత్నాలు జరిగినా ఆర్థిక విధానంలోను, సాంఘిక సమానత్వంలోనూ, రాజకీయ స్వాతంత్ర్యంలోనూ పురోగామిగా నడవవలసినంత నడవడమూ లేదు, అక్కడక్కడ కొంత అభివృద్ధివున్నా అవి సమానంగానూలేదు. అందువలన యేర్పడిన అసమానఅభివృద్ధి ఫలితంగా అనేక అనుమానాలు, భయాలు పెచ్చపెర్లినవి.

అరవలతోపాటే పడి ఉద్యోగాలు, ప్రాజక్టులు ఇతర అభివృద్ధులు, పరిశ్రమలు సాధించుకొనిన ఉత్తరసర్కారులలోని వారిని చూచి రాయలసీమ మధ్యతరగతిలో అసంతృప్తి అనుమానం; ఒకటి రెండు పట్టణాలలో అభివృద్ధి కొంత ఉన్నా జనమంతా ఎంతో వెనుకబడిన విశాఖలో నిత్యకరువులు అందుచే అనుమానాలు పెరిగినవి. వీటి పరిష్కార సాధనల నవలంబించుచూ తమ స్వార్థాలు పూర్తిచేసుకునే వారు. ఈ స్వార్థాలను పూర్తిచేసుకునే వారిని చూచి అటులే తను పని కాలేదేయని ఆవేశపడి ప్రజలలో నిరాశకు కారణమయ్యే మరొక ముఠాప్రాంతము ఇది ఇటులుండగా, వీరిని ఉపయోగించుకొని, విడదీసి తమ పబ్బం గడుపుకో ప్రయత్నించే తమిళ నాయకత్వం, రామపాద సాగర ప్రాజక్టుముందా, కృష్ణాపెన్నా ప్రాజక్టు ముందా అని రెంటిని ఎగరకొట్టడానికి ఆంధ్ర ప్రజలముందు పెట్టింది ఇరువురు పేచీలు పడ్డారు. ఈలోగా భవానీ ప్రాజక్టు పూర్తిచేసుకుంటున్నారు. పెట్టుబడిదారీ ఆర్థికవిధానంలోని అవకతవకలు ఈ విధంగా కాక మరొక విధంగా వుంటవని యెట్లా తలంచగలం? అయితే వీటికి పడే ఆవేశాలను, ప్రాంతాలుగా ఒకచోట, ముఠాలుగా మరొకచోట రూపొందచేసి వాటితో పీడితప్రజలను మభ్యపరచి, మధ్యతరగతి ప్రజలను ఆవేశపరచి, ఆవేశాలతో కాలం గడిపి అసలుసమస్యలను దూరంగా నెట్టడం జరుగుతున్నది దానిని ఛేదించుటకు ఈ ఆంధ్రరాష్ట్ర సాధనం ఉపయోగపడగలదు. ఆంధ్రరాష్ట్రం సాధించినతర్వాత పరిష్కారం కాకపోయే ప్రతిసమస్యకు అసలు సమస్యను పరిష్కరించుటకు ప్రజల పద్ధతిలో నిర్ణయం తీసికోకపోవడమే కారణంగాని, ఈ ఆంధ్ర అరవ పేచీలు కారణం కావని తేలిపోగలదు. ఈ ప్రక్కదాటుమార్గం పోయి అసలు సమస్యమీదికి రాగలదు

కొంతలో కొంత భాషాభివృద్ధికి పునాదులు వేయక తప్పవు. అటులే ఆర్థికంగా కొన్ని ప్రాజక్టులు ప్రారంభించక తప్పదు. అవి చేయలేనపుడు అసలుసమస్య బయటపడకనూ పోదు. ఈ వాతావరణంతో భాషాభివృద్ధికి పునాదులు వేసి స్వభాషారాష్ట్రవాదాన్ని ఊతగా తీసికొని ప్రభుత్వవ్యవహారాలన్నీ తెలుగుభాషలో జరుగుటకు ప్రయత్నించాలె ఆందోళన చేయాలె భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణం జరుగుటతో భాషాధారక జాతీయోద్యమం, ఉపజాతియోద్యమం ప్రజల మనోభావ ప్రబలం కాగలదు ఈ రాష్ట్రసాధనతో కర్నాటక, మహారాష్ట్రిలను జాతీయోద్యమోన్ముఖులను చేసిన వారమవుతాము. భారతదేశంలో భాషాధారక జాతీయోద్యమానికి పునాదులు వేసి 80 సంవత్సరాల క్రితం బయలుదేరిన భాషారాష్ట్ర సిద్ధాంతాన్ని అమలు జరిపించినవార మవుతాం. ప్రజావుద్యమాలు కేంద్రీకృతమై ఆంధ్రుల వాంఛయగు విశాలాంధ్రను నిర్మింపజాలక పోయినందువలననే అసలు (ఉప) జాతీయోద్యమం రూపురేఖలు లేకుండాపోయి కులతత్వాలు జాతీయోద్యమాలను దిగజార్చకుండా ఉంచినవారమవుతాం. జాతీయభావంతో జాతీయాహంకారం రెచ్చకొట్టడం అవుతుందేమోనని తలంచవచ్చును. అందుకే ఈనాడే ఆంధ్ర తమిళ వివాదం జాతీయదురహంకారానికి పోనీయకుండా, ఈ చ్ఛాయల అంద అవకాశవాదులు తలలు దాచుకొనకుండా చేయవలెనంటే జాతీయ ప్రాతిపదిక ఉపాధులైన భాషాధారక రాష్ట్రాల నిర్మింపజాలె ఈ భాషారాష్ట్ర నిర్మాణంతో యేర్పడిన ఆంధ్రోత్తేజాన్ని ఆంధ్రుల అభ్యున్నతి కనుగుణంగా నడచుటకు ప్రజానీకం పూనుకోవాలె, అపుడే ఆంధ్రజాతి తన జనాన్ని దగ్గరకు చేర్చుకోగలదు. విశాలాంధ్రకు సాధనంగా అన్నివైపుల ఆంధ్రులు ఆంధ్రోద్యమాన్ని నిర్వహించుకోగలరు. విశాలాంధ్రం వివేకాంధ్రం కాగలదు. దానిఅంతా అది అవుతుందని ఎవరికి వారు కూర్చొనడ

(22-వ పేజీ చూడుడు)

కులాసా కబుర్లు

"సరసం - విరసం"

[జి. యస్. సూరి]

అలహాబాదు హైకోర్టులో ఈ మధ్య ఒక వింత క్రిమినల్ కేసు విచారణకు వచ్చింది. పిటీషనరు కాన్పూరు వాస్తవ్యుడు. జరిగిన నేరం భార్య ముక్కు కొరికాడని. మేజస్ట్రీటు గారు విచారణ చేసినప్పుడు పోలీసులు తెగి పడిన ముక్కు ముక్కను కోర్టులో ప్రదర్శించారు. "ఆ ముక్కు నాదే" అని ఆ అపర శూర్పణఖ సాక్ష్యం ఇచ్చింది. నేరం చేశావా లేదా అని కోర్టువారు ముద్దాయిని ప్రశ్నించారు. కొరికిన మాట నిజమేనండి అని ఒప్పుకున్నాడు నింది తుడు. ముక్కు లేని భార్యతో కాపరం చెయ్యవలసి వచ్చినదే ఉచితమైన శిక్ష అని భావించి నప్పటికీ, కొద్దో గొప్పో దండించక పోతే శిక్షాస్మృతి ఒప్పుకోదు కాబట్టి మూడు నెలల పాటు జైదులో ఉండి రమ్మన్నారు మేజస్ట్రీటు గారు. క్రింది అప్పీలు కోర్టులో ఆ శిక్షను ఖాయం చేశారు.

కష్టసుఖాలను గమనిస్తారేమో నని ముద్దాయి హైకోర్టుకు పిటీషన్ దాఖలు చేశాడు. జడ్జీగారి ముందు లాయరుగారు బల్లగుద్ది మాట్లాడాడు ఏదో ఆవేశంవల్ల ఒళ్లు తెలియక పసక్కుమని ముక్కు తాలూకు కొసను కొరికినమాట వాస్తవమే, గాని వేరే దురుద్దేశం లేదన్నాడు చూస్తూ చూస్తూ కొరకదలచి ఎవడైనా పెళ్లాం ముక్కు కొరికివేస్తాడా అని అనుభవజ్ఞుడైన న్యాయమూర్తిని హెచ్చరించాడు. జరిగిన శాస్తి చాలు కాబట్టి శిక్షను రద్దు చెయ్యమని బ్రతిమాలాడు. సావధానంగా ఆర్గ్యుమెంటు యావత్తూ విని జడ్జి గారు తీర్పు చెప్పారు. కాస్తో కూస్తో ఆవేశం ఏమైనా మిగిలి వుంటే మూడు మాసాలు జైలులో ఉండడమే శ్రేయస్కరమనిన్నీ, ఈ లోపుగా గాయం మానిపోవటం గూడ జరిగి ప్రియురాలు సంసారసాగరం ఈదటానికి సిద్ధం కాగలదనిన్నీ, కాబట్టి క్రింది కోర్టు తీర్పును ఆమోదిస్తున్నామని పిటీషనును త్రోసి వేశారు. ఆ అమాయకపు ఇల్లాలికి ముక్కు పోవటమే గాక మొగుడుకూడ మూడు నెలల పాటు ఎడబాటు అయినాడు.

పత్రికలలో ప్రకటించిన వార్తను బట్టి ఒక్క సందేహం మాత్రం నివృత్తి కావటం లేదు. భర్తగారికి సంభవించిన ఆవేశం కోపావేశమా లేక ప్రణయావేశమా? ఈ విషయాన్ని మూడు కోర్టులవారూ విచారించినట్లే తోచదు. ఇంత ముఖ్యమైన అంశాన్ని ఎందుకు నిర్ధారణ చేయలేదో ఊహించటం కష్టంగా ఉన్నది. అది నిజంగా కోపావేశమైనట్లయితే ముద్దాయి శిక్షకు పాత్రుడు గాక తప్పదు. అట్లా కాకుండా ప్రణయావేశం అయినట్లయితే కోర్టు వారు చూసీ చూడకుండా విడుదల చేయవలసి ఉంటుంది ఒకవేళ ఆ ఇల్లాలిముక్కు నువ్వు చెట్టు పువ్వువలె ఎంతో అందంగా ఉన్నదనుకోండి, పాపం ఆ భర్త ఆ అందాన్ని చూసి చూసి, తృప్తి పొందక పారవశ్యంలో అనుకోకుండా, అంతపనీ చేశాడనుకోండి. అప్పుడు ఆ రసికుడు ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం శిక్షార్హుడవుతాడని గుండెలమీద చెయ్యి వేసుకుని ఎవ్వరనగలరు?


అటువంటిది నేరమని ఈకాలపు న్యాయవేత్తలు అంటారేమో గాని మన ప్రాచీనస్మృతి కర్తలు ఏంతమాత్రమూ అనేవాళ్లు గారు. ధర్మశాస్త్రాలు అందుకు ఒప్పుకోవు. ప్రణయ సంబంధమైన సకల విషయాలలోను పరిశోధన చేసి, భోగట్టా తీసి, రసికజనమనోభిరామమైన సూత్రాలను రచించి మహర్షి అనిపించుకున్నాడు వాత్స్యాయనుడు. సర్వసంగపరిత్యాగులై, చీమలు దూరని చిట్టడవులలో కాకులు దూరని కారడవులలో కందమూలాదులు తిని, ఒంటికాలిమీద తపస్సు చేసి ఋషులైనారు మిగతావాళ్లు. సరదాగా, కులాసాగా, ప్రపంచంమీద విముఖత లేకుండా, వ్యక్తిగతంగా సర్వవిషయాలను అనుభవించి, పరిశీలించి, సిలబస్ ప్రకారం మొదటి రకపు టెక్స్టుబుక్కును వ్రాసి పారేసి ఋషి పుంగవుడైనాడు వాత్స్యాయనుడు. దానికి సంబంధించిన కర్మకాండలో నఖక్షతం అని, దంతక్షతం అని ఇత్యాది సరసాలను అతి సూక్ష్మంగా వివరించాడు. వీటిని అనుసరించడంలో సరసం కొంచెం మోటుగా పరిణమిస్తే అందుకు బాధ్యుడు ఆ భర్త అవుతాడా? ఒక్కనాటికీ కాదు దీనిలోని బాధ్యత యావత్తూ వాత్స్యాయనుడిదే.

అసలు ఈ విషయం రచ్చకు ఈడ్వవలసింది కాదు. గుట్టుచప్పుడుగా కూపంలో చెయి మలుపుకోవలసింది. నడికోర్టులో ముద్దాయి యెవడైనా "అయ్యా! నేను బొందన పడ్డానండి. వాత్స్యాయనుడనే బవిరి గడ్డాలవాడు నా పుర్రెలో వెర్రి సరదాలను ప్రవేశపెట్టి నా కొంప తీశాడండి" అని బట్టబయలుగా చెప్పుకోగలడా? యేముద్దాయిభార్యఅయినా బోనులోకి ఎక్కి "మా ఇంటాయన నా ముక్కు మురిపెంచూసి మోజు బడి, ఏదో పుస్తకంలో వ్రాసినట్లుగా చెయ్యబోయి, పుటుక్కున నాదుంప తెంచాడండీ" అని సాక్ష్యం ఇవ్వగలదా? ఇటువంటి కష్టసుఖాలను ఆలోచించి అనుభవజ్ఞులైన న్యాయమూర్తులు ముద్దాయిశిక్షను రద్దుచేసి ఓదార్చి పంపవలసింది. అందుకు బదులు కారాగారవాసం. పాపం ఆ గృహస్థు ఎంత విలపించి పోతున్నాడో! కనబడిన కామసూత్రాల పుస్తకాన్ని అల్లా కాల్చి వేస్తానని ఎన్ని ప్రతిజ్ఞలు చేస్తున్నాడో!

అయినా ఆడదానికి ముక్కు తెగకొట్టినవాళ్లందరూ శిక్షకు పాత్రులైనారా? రామాయణం చిత్తగించండి. లక్ష్మణుడు ఏం చేశాడు? ఒక ముక్కేగాకుండా చెవులుగూడ చెడ నరికాడు. పైగా శూర్పణఖ ఆయనభార్య అయినా కాదు. ఆయనఅందం చూసి మోహించిన మనిషీ కాదు అంతటి కఠోరమైనపని చెయ్యటానికి ఎటువంటి ఆవేశమూ సంభవించలేదు. అన్నమీద మోజుపడిన స్త్రీని వికలాంగిని చేయటానికి ఈ లక్ష్మణుడికి ఏమి హక్కు ఉంటుంది? అవతారమూర్తి అయిన శ్రీరాముడు ఈ కమాటంలో అనవసరంగా జోక్యం కలుగచేసుకున్నాడు అంతపని చేసిన తమ్ముణ్ణి శిక్షించాడా? లేదు పైగా మెచ్చుకుని వీపు చరిచాడు. ముక్కూ చెవులూ తెగిన ఆడదానినిచూసి అన్నదమ్ములు నవ్వుకున్నారు. అది శిక్షింపదగిన నేరం అయినట్లయితే శ్రీరాము డంతటివాడు ఊరుకునేవాడా? ఎన్నటికీ కాదు. అయినా మహారాజుతమ్ముడు కాబట్టి ఏ ఇబ్బందీ లేకుండా తప్పించుకో గలిగాడు లక్ష్మణుడు మూడు మాసాలపాటు జైలులోగడిపి ముక్కిడిభార్యను ఏలుకోబోతున్నాడు కాన్పూరు వాస్తవ్యుడు ఇంతే తేడా కాకపోతే శూర్పణఖను రాక్షసిఅన్నారు రాక్షసికి మాత్రం తెలివి తేటలు ఉండవూ? అన్నతో చెప్పి తగిన శాస్తి చేయించింది

ఆ మధ్య మద్రాసు ఫిలిం స్టూడియోలలో ఇటువంటి వ్యవహారమొకటి జరిగిందిట. ఫిలిం సగంలో ఉన్నదిట. ఆ నాడు షూటింగుకు నాయకపాత్ర ధరించే తారామవ్వ తయారయింది. మేకప్ రూంలోకి వెళ్లేసరికి వేషాలు వేసే వాడికి ఆమెగారి చెక్కిలిపైన రూపాయంత చుట్టుకొలత గల గాట్లు కనబడినవట. ఏమిటమ్మా ఇది అని అడిగితే ఆమెగారు ముసిముసి నవ్వులతో "ముఖం కడుక్కుంటుంటే ఉంగరం గీసుకున్నదండీ" అని అన్నదిట. ఆ మక్కు ఈ మక్కు పెట్టి చేతనయినంతవరకు మరమ్మత్ చేయటానికి ప్రయత్నించాడుట. కాని డైరెక్టరుగారు ఒప్పుకోలేదుట. క్లోజ్ అప్‌కు పనికిరాదు కాబట్టి షూటింగు మూడు రోజులు వాయిదా వేశాడుట.

తతిమా మహర్షులు వ్రాసిన ధర్మశాస్త్రాలకు చెలామణి ఉన్నా ఉండకపోయినా వాత్స్యాయనుడి మహాగ్రంథం మాత్రం మంచి చెలామణిలో ఉంటూనే ఉన్నది. అది ప్రచారంలో ఉన్నంతవరకూ ఇటువంటి అవకతవకలు తప్పవు. మద్రాసుమంత్రివర్గంవారు చెయ్యి చేసుకుని ఆ రకం పుస్తకాలను బహిష్కరించేవరకూ ఇలాగే జరగక మానవు.



నేటి ప్రపంచం

★ చీనాగురించి అమెరికా నివేదిక
★ ఇండో - బ్రిటిష్ స్టెర్లింగ్ ఒడంబడిక

చీనా రాజకీయాల్లో అమెరికా అనుసరించిన విధానంగురించీ, జాతీయవాదులకు అమెరికా చేసిన సహాయంగురించీ అమెరికన్ విదేశాంగ శాఖ ఒక నివేదికను ప్రకటించింది. చాంగ్ కై షేక్‌కి అమెరికా చేసిన 200 కోట్ల డాలర్ల (దాదాపు 750 కోట్ల రూపాయల) సహాయం చాంగ్ కై షేక్ కేవలం ప్రభుత్వం అసమర్థత వల్లనే నీళ్లపాలయిందని నివేదికలో చెప్పబడింది. అమెరికా ఆర్థిక, సైనిక సహాయ విధానం పరాజయం పొందిందని అంగీకరించారు. ఇంక చీనాదేశాన్నంతనీ ఆక్రమించుకోవలచిన కమ్యూనిస్టులను నిరోధించగలవారెవరూ లేరని స్పష్టపరిచింది. చీనాలో అంతర్యుద్ధఫలితాన్ని అమెరికా ఎంత నివారించాలని యత్నించినా సాధ్యపడలేదని చెప్పింది.

ఈ సంపూర్ణ పరాజయానికి ఈ కింది హేతువులు నివేదికలో వివరించబడినాయి. 1. చీనా నాయకులు సమస్యాపరిష్కారానికి అసమర్థులైనారు. వారి సైన్యాలలో యుద్ధం చెయ్యాలనే మనోబలం జీర్ణించిపోయింది. ప్రభుత్వానికి ప్రజల్లో పరపతి నశించింది. 2. కఠిననియమాలు, శిక్షణ విధించి ఉన్మత్త ఆవేశాలతో ఉద్యమం నడిపి, ప్రజలకు సంరక్షకులు, ముక్తిదాతలుగా చలామణీ అయినారు. 3. అసలు జాతీయ ప్రభుత్వాన్ని జయించవలసిన అగత్యం లేకపోయింది. ఆ ప్రభుత్వం దానంతటదే పీగిపోయింది.

1946 లో జనరల్ జార్జి మార్షల్ హెచ్చరికను మన్నించకుండా చీనా జాతీయ ప్రభుత్వం బ్రహ్మాండమైన సైనికసన్నాహాలు చేసింది. ఇటువంటి విధానంవల్ల ప్రభుత్వం నాశనమౌతుందని మార్షల్ చెప్పినా వినలేదని ఈ నివేదిక తెలుపుతోంది. అయితే ఒక విషయం వింతగా ఉంది. ప్రభుత్వం నాశనం అవుతుందని తెలిసీ మార్షల్ చీనాకోసం మిలియన్లకొద్దీ డాలర్లు వెచ్చించడానికి ఒంగీకరించారా? ఇది నమ్మశక్యం కాకుండా ఉంది. మంచూరియాలో కమ్యూనిస్టుల ప్రాబల్యం హెచ్చుతున్నదని తెలిసి అమెరికా మధ్య చీనాలో యుద్ధసన్నాహాలకి చీనా ప్రభుత్వాన్ని ప్రోత్సహించింది. యుద్ధకాలంలోనూ, అంతకుముందూ అమెరికన్ ఫాక్టరీలలో అపారంగా తయారైన యుద్ధ సామగ్రిలో చాలభాగాన్ని అమెరికన్ ప్రభుత్వం చీనా తలకు రుద్దింది. యుద్ధంలో ఖర్చుకాగా మిగిలిన యుద్ధపరికరాల్ని, మోటార్లనీ, లారీల్ని, మందు గుండు సామగ్రినీ తమదేశంలో గుట్టలుగా పేర్చుకుని కూచోలేక, నిరుద్యోగవ్యాప్తికి భయపడి అమెరికా ఈ మారణాయుధాల్ని పీలుగా కోరికిన దేశాలపై రుద్దింది. ఇప్పుడు చీనాపని తీరింది. అమెరికన్ తుపాకి, మందుగుండుఫ్యాక్టరీల యజమానుల్ని, కార్మికుల్ని పోషించడానికి ఇంత పెద్ద మార్కెట్ ఏదేశంలో దొరుకుతుందో అమెరికన్ ఫాక్టరీయజమాన్లు వెదుకుతున్నారు. పశ్చిమయూరప్ సిద్ధంగా ఉంది. అమెరికన్ ఫాక్టరీల ఉత్పత్తిబలం పడిపోకుండా, నిరుద్యోగం పెరిగిపోకుండా అమెరికన్ ప్రభుత్వం కాపాడాలికదా. ఇవి గాక బర్మా, సయాం, ఇండియా, పాకిస్తాన్ అరబ్ దేశాలున్నాయి. అరబ్ దేశాలు ఆరంభంనుంచీ అమెరికన్ ఆయుధాల ఫాక్టరీల్ని శక్తికొద్దీ పోషిస్తూనే ఉన్నాయి. కాని ఆ ఫాక్టరీల ఉత్పత్తికీ అరబ్ దేశాల కొనుగోలుశక్తికీ పోలికే లేదు.

చీనాలో ఆయుధసామగ్రి కొనుబడి, యుద్ధం జాతీయ ప్రభుత్వానికి ప్రధాన కార్యక్రమమైనాయిగాని దేశఆర్థికబలం గురించి వారు యోచించనైనా లేదు. ఫలితం - ఆహారం ధరలు మనదేశంలో ఇళ్ల అమ్మకపు ధరలకంటెకూడా పెరిగిపోయాయి. బస్తానిండా కరెన్సీనోట్లు ఇచ్చినా ఒక్కపూట ఆహారం దొరకలేదు. దేశంలో తుపాకులు మందుగుండుసామగ్రి నిండిపోయింది. వాటిని కమ్యూనిస్టులకు అమ్మి ప్రభుత్వోద్యోగులు ఆకలి తీర్చుకోవలసివచ్చింది.

చీనాలో దుర్ఘటనకి హేతువు కేవలం చాంగ్ ప్రభుత్వం అసమర్థత అనేమాట నిజమే. అయితే దేశం ఆర్థిక వ్యవహారాల్ని పొత్తిగా మరిచిపోయి వ్యవహరించడంలో ఉంది చాంగ్ ప్రభృతుల అసమర్థత.

1948 నవంబరులో 41 డివిజన్ల సైన్యం జాతీయవాదుల పక్షాని కెదురుతిరిగి కమ్యూనిస్టులతో కలిసిపోయిందనీ ఈ సైన్యానికిగల ఆయుధపరికరాల్లో నూరింట 85 వంతులు అమెరికా సప్లై చేసినదే ననీ ఈ నివేదిక తెలిపింది. ఈ మాదిరిగా అనేక వేలమంది సైనికులు కమ్యూనిస్టులతో చేరిపోయారని తెలిపింది. చీనాలో ఆహారధరలు అనేకవందలరెట్లు పెరిగిపోతుంటే అమెరికన్ సైనిక సలహాదార్లు, ఆర్థిక సలహాదార్లు, చీనా జాతీయప్రభుత్వం చూస్తూ ఊరుకున్నారు. అమెరికానించి ఒక్కగింజ ఆహారం రాలేదు. చీనాలోని ధాన్యపు రాష్ట్రాలనుంచి ఇతర రాష్ట్రాలకు ఆహారం రవానా కాలేదు. ఇంక సైనికులికి ఆయుధాలిచ్చి ఏమి ప్రయోజనం? అవి సైనికులకు కమ్యూనిస్టులకద్ద ఆహారంకొనుక్కోడానికి ఉపకరించాయి.

పరాజయానికి చాంగ్ ప్రభుత్వానిదెంత బాధ్యతుందో అమెరికన్ ప్రభుత్వానిదీ అంతే బాధ్యతుంది. చీనాకి ఆర్థికసైనికసహాయం ఇచ్చేముందు, చీనా ప్రభుత్వం సైన్యాలకు పెట్టే ఖర్చుల్ని తగ్గించుకుని ఆర్థికపునర్నిర్మాణ కార్యక్రమాల్ని ప్రోత్సహించగలదని వాగ్దానాలు తీసుకోవాలని 1947 లో జనరల్ వెడ్‌మెయర్ నివేదికలో సూచించాడు. చీనాకిచ్చే సైనిక సహాయంలో వైమానిక నౌకాదళాలను సైన్యాలతో సమానంగా వృద్ధిపరచడంలో అమెరికాకు సహాయపడాలనీ, సూచించాడు. కమ్యూనిస్టుల్ని నిరోధించడానికిగాను మంచూరియాలో అంతర్యుద్ధాన్ని మాన్పడానికి ఐక్యరాజ్య సమితికి నివేదించాలనీ, మంచూరియాపై అయిదు అగ్రరాజ్యాల అజమాయిషీ విధించాలని సూచించాడు. ఈ సూచన లన్నిటినీ "చీనా ప్రభుత్వానికి ఆగ్రహం వస్తుందనే కారణంవల్ల" అమెరికన్ ప్రభుత్వం బహిరంగ పరచలేదు. చీనా జాతీయప్రభుత్వం అమెరికా చెప్పుచేతల్లో ఉన్నప్పటికీ అమెరికా ఆ నివేదికలో సూచించబడిన ప్రకారం చీనాకి సలహాలివ్వలేదు. చీనా మిలిటరీఖర్చులు తగ్గించుకోలేదు. చాంగ్ కై షేక్ తన దేశం భవిష్యద్గతిని కానలేక పరాజయం పొందాడు. చీనాతో స్నేహం ప్రకటించి, సహాయం చేస్తున్నట్లు చెప్పుకుని, విషయాలన్నీ తెలిసికూడా అమెరికన్ ప్రభుత్వం తప్పుదారినే పట్టింది. అది చీనా విషయంలో తప్పుదారేకాని అమెరికన్ ఫాక్టరీ యజమానులికి మంచి మార్కెట్ల దారి అయింది. అమెరికన్ ఫాక్టరీల అమ్మకానికి చీనా ధనం చెల్లించలేదు కాబట్టి అమెరికన్ ప్రభుత్వం చెల్లిస్తుంది. అంటే అమెరికన్ ప్రజల ధనంతో ఫాక్టరీల ఉత్పత్తిని అమెరికన్ ప్రభుత్వం కొని చీనాకి సప్లై చేసి నష్టపడింది. మరొకవైపున చీనా ఆర్థిక వ్యవస్థను భగ్నం చెయ్యడానికి అమెరికా పరోక్షంగా తోడ్పడింది. చీనాలో ఉభయపక్షాలకూ మధ్య సమాధానం కుదర్చడానికి యత్నించి విఫలుడైన జనరల్ జార్జి మార్షల్ కమ్యూనిస్టులకు విజయం తప్పదని అప్పుడే చెప్పాడు. ఇప్పుడూ పరాజయానికి అమెరికా చాంగ్ ప్రభుత్వాన్నే నిందించ నక్కరలేదు. అమెరికా కూడా సమానంగా నింద భరించవలసిందే.

కమ్యూనిస్టులకు హెచ్చరిక:

చీనా కమ్యూనిస్టులు సమీపదేశాలపైకి గాని దాడిచేసి, రష్యా దురాక్రమణ విధానానికి తోడ్పడినట్లయితే, అది ఐక్యరాజ్య సమితి సిద్ధాంతాల అతిక్రమణగా పరిగణించగలరనీ, ఆ సిద్ధాంతాల ప్రకారమే చర్య తీసుకోగలరనీ అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఆచిసన్ హెచ్చరించాడు. ఇది స్పష్టంగా కొరియా, ఇండో చీనాలలోని కమ్యూనిస్టులకు సహాయపడకూడదనీ, హాంకాంగ్‌పైన దాడి చెయ్యకూడదనీ, సయాం బర్మా సరిహద్దుల్ని వారు దాటకూడదనీ హెచ్చరించడమన్నమాట. పరాజయాన్ని అంగీకరిస్తూ ఇటువంటి హెచ్చరిక చెయ్యడంలో ఒక విషయం స్పష్టపడుతోంది. చీనా ఆక్రమణలో జాతీయవాదుల పక్షాన ఇంకెంతమాత్రం అమెరికా జోక్యం చేసుకోరని వాగ్దాన మిచ్చి, కమ్యూనిస్టుల్ని చీనాతో తృప్తిపడుమని కోరుతున్నాడు.

నివేదిక తుదిభాగంలో ఈ రీతిగా చెప్పబడింది: "చీనాలో ఇప్పటి సంఘటన లెంత విషాదకరంగా ఉన్నప్పటికీ, అన్యదేశసామ్రాజ్యవాదానికి లోబడిన పార్టీ పరిపాలనకింద ప్రజాసామాన్యం ఎంతటి యాతనల ననుభవించనున్నప్పటికీ, చిట్టచివరికి చీనాలో ప్రజల సహజవ్యక్తిత్వమే బలపడి, చీనా పురాతన నాగరికతాబలమే చివరికి జయిస్తుందనీ, పరదేశ దాస్యంనుంచి ముక్తి పొందగలదనీ ఇంకా విశ్వసిస్తూనే ఉన్నాము. ఈ లక్ష్యంతో పనిచేసే వారిని ప్రోత్సహించగలం.

దీని ఆంతర్యం యుగోస్లావియా టిటోవలెనే చీనా కమ్యూనిస్టులలోని నాయకులు రష్యా నెదిరించి నిలవాలని బోధిస్తూ, ఆ రీతిగా నిలబడితే అమెరికా తప్పక సహాయం చేస్తుందని ఆచిసన్ హామీ ఇస్తున్నాడన్నమాట.

కాని ఇది అసంభవం కావచ్చును. టిటో రష్యాతో ఎంత తగవులాడినా కమ్యూనిస్టురాజ్య కూటానికి ద్రోహం చెయ్యడనీ, అమెరికాతో చేరి సహాయం పొందడానికి సిద్ధపడడనీ రుజువైంది.

యుద్ధగతి:

దక్షిణ చీనాలో కమ్యూనిస్టులు అతివేగంగా దేశాన్ని ఆక్రమించుకుంటున్నారు. చీనాలో ధాన్యపు కొట్టాలని ప్రసిద్ధిచెందిన రెండు రాష్ట్రాలనూ హూనాన్ రాష్ట్రం ఏ పోరాటం లేకుండా కమ్యూనిస్టుల హస్తగతి మౌతోంది. హూనాన్ రాష్ట్ర రాజధాని చాంగ్షా ఇదివరకే వారి పర మయింది. రాష్ట్రగవర్నరు జనరల్ చెన్ కమ్యూనిస్టులతో చేరిపోయినట్లు అతనినే కమ్యూనిస్టులు గవర్నరుగా నియమించినట్లు వార్త వచ్చింది. దక్షిణానికి కాంటన్ నగరంపైకి అరు కమ్యూనిస్టుసైన్యాలు, పశ్చిమమున ముస్లిం రాష్ట్రమైన కన్సుపైకి ఆరుకమ్యూనిస్టుసైన్యాలు దాడి చేస్తున్నాయని వార్తలు వస్తున్నాయి.

స్టెర్లింగ్:

స్టెర్లింగ్ నిలవలు, ఖర్చులగురించి కామన్వెల్త్ ఆర్థికమంత్రులసభలో సంప్రదింపుల ఫలితంగా కామన్వెల్త్ దేశాలమధ్య సమాధానం కుదిరింది. ఈ ఒడంబడికవల్ల కామన్వెల్త్ డాలర్ నిలవల నిధి యాజమాన్యంలో భారత దేశంకూడా తిరిగి చేరింది. స్టెర్లింగ్ నిలవల్లో పది మిలియన్ల పౌన్లు అధికంగా వాడుకోడానికి అంగీకారం కుదిరింది. డాలర్ మారకంగల అమెరికా కెనడా మొదలైన దేశాలనుంచి భారతదేశం కూడా ఇతర కామన్వెల్త్ దేశాలతోపాటు దిగుమతుల్ని నాలుగింట ఒక వంతు తగ్గించుకోడానికి అంగీకరించింది. వీలైనంత వరకు ఆ దేశాలకు ఎగుమతుల హెచ్చించడానికి అన్ని దేశాలూ యత్నిస్తాయి.

అయితే దీనివల్ల భారతదేశానికి ఎంతవరకూ ఉపయోగం కలుగుతుందనేది సందేహమే. డాలర్ దేశాలనుంచి దిగుమతులు తగ్గించుకుంటే మనకి కావలసిన ఆహారాన్ని ఆస్ట్రేలియానుంచి తెచ్చుకోవాలి. అమెరికాలో ధరలకంటె స్టెర్లింగ్ ప్రాంతంలో (మూలంగా కామన్వెల్తుదేశాలనుకోవచ్చును.) ధరలు చాలా అధికంగా ఉన్నాయి.

ఈ ధరలకి కొంటే నష్టమే. పోగా బ్రిటన్ నుంచి మనకి అవసరమైన యంత్రపరికరాలు దిగుమతి కావడమే లేదు. బ్రిటన్ మనకి బాకీ ఉన్న స్టెర్లింగ్ నిలవలనించి అధికభాగం విడిచిపెట్టడం ఒకవిధంగా మంచిదేకాని దిగుమతి వస్తువుల నిర్ణయవిధానాన్ని సంస్కరిస్తేగాని ఆట బొమ్మలమీదా సిగరెట్లమీదా టూత్ పేస్టులమీదా అధికభాగం ఖర్చైపోతుంది. [సూర్యం]

నాకబలి
(5-వ పేజీ తరువాయి)

వల్ల, ఈ అమాయికపు పల్లెటూరిపడుచు విషయంలో తనూ, దాదాపు శంకరంవిధానంలోనే ఆలోచిస్తున్నట్లు అనిపించి తనను తను చీదరించుకొని మనస్సు స్వస్థత పరచుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడు.

ఆమె అతన్ని చిన్నకుఱ్ఱవాణ్ణిలాగే చూస్తూ మాట్లాడుతున్నట్లుంది. కాని మధ్యమధ్య కబుర్లలో పెద్దరికమూ ఇస్తోంది.

అతను సరిగా తల ఎత్తి మాట్లాడలేకున్నాడు. కాని ఆమె అల్లాంటి మొగమాట మేమీ నిలవనిచ్చేటట్లు లేదు. కవ్వించి కవ్వించి పల్కరిస్తూ, తలఎత్తి జవాబు చెప్పేదాకా ఎదిరిస్తూంది. కాని అంతా పల్లెటి అమాయికత్వపు స్వచ్ఛస్వరూపమో ఏమో అది! ఆమె భర్త దొరకమానిరి చవవు. ఆమె దీ దాదాపు అంతేకాని, ఆమెతనంవల్ల అతనికి కనిపిస్తున్న దింతో ఏమో, మరొక మాదిరిచనువుగా ఉంది. అక్కడ కూర్చోటానికి బెరుకుగా ఉంది. కాని ఆమె మాట్లాడుతూంటే లేచి వెళ్లటం మోటుగా ఉంటుందేమో నని సందేహం

ఇవి పల్లెటికుటుంబీకుల అమాయికపు చనువు చేతలని మనస్సు సమాధానం చేసుకొని కాసేపు తల వంచుకుని ముక్తసరిగా ఆమె ప్రశ్నలకు జవాబులు చెప్తూ అల్లాగే కూర్చున్నాడు. ఇంతలో మామమాట వీధిగుమ్మంలో వినబడింది.

ప్రాణం తేరుకున్నట్లు ఒక నిట్టూర్పు విడిచి బైటి అరుగుమీదికి వచ్చి కూర్చుని మామతో ఉత్సాహంగా సంభాషణ సాగించాడు.

నిజంగా స్వతంత్రంవచ్చిందా?

శ్రీమతి వేదుల మీనాక్షిదేవి

“స్వతంత్రం వచ్చింది. స్వతంత్రం వచ్చింది” అన్నమాట పిల్లలదగ్గరనుండి పెద్దల దాకా, బీదప్రజల మొదలు భాగ్యవంతుల దాకా, నిరుద్యోగుల మొదలు పెద్ద వుద్యోగుల వరకూ ప్రతివారి నోటా వింటున్నాం. ఆ మాటతో చెవులు గింగిర్లెత్తిపోవడం అందరకూ అనుభవైకవేద్యమే. మన మంతా ముక్తకంఠంతో అంటున్న యీ స్వతంత్రంమాత్రం యెవరికి వచ్చిందా? అని నాకు ఒక్కొక్కప్పుడు సందేహంగా వుంటూవుంటుంది. మొత్తంమీద చెప్పాలంటే యింగ్లీషువాళ్లున్నన్నాళ్లు నోరెత్తడానికి భయపడ్డవాళ్లందరికీ మాట్లాడడానికి స్వతంత్రం వచ్చిందనే చెప్పాలి. అందుకనే పరిపాలన అంతమై మనదేశనాయకులు పరిపాలనా భారాన్ని స్వీకరించగానే వీరి పరిపాలనను స్తంభింపచెయ్యడానికి దేశంఅంతటా అనేక తరగాలవారు సమ్మెచేశారు. అందువల్ల ఆ సమ్మెలు చేసినవా రందరికీ స్వతంత్రం వచ్చిందనే చెప్పాలి.

ఇక యెవరికి స్వతంత్రం వచ్చిందీ, యెవరికి రానిదీ చూడాలి.

కొందరు కాంగ్రెస్ సభ్యులు త్యాగాలుచేసి జైళ్లకెళ్లి దేశంలో యింతటి ప్రతిభాశాలు లుండగా స్వతంత్రం రాకేం చేస్తుంది? వచ్చి తీరుతుంది అనే విశ్వాసం కలిగించి తుదకు స్వరాజ్యం రాగానే యింతవరకూ సుఖమనేది యెరుగకుండా బ్రతికాం. ఇక యీ జీవితశేషాన్ని హాయిగా గడుపుదామనే వుూహతో (పైకి చెప్పకపోయినా) బాహటంగానూ, చాటుగానూస్వతంత్ర భారతంలోని ప్రజానీకాన్ని కూడా పీడించి డబ్బుచేసుకుంటున్నారు. అంటే వీరికి అసలైన స్వతంత్రం వచ్చిందన్నమాట.

ఇక వ్యాపారస్థులమాట చూద్దామంటే వీరి మాయలు నమ్ముకోవడం బ్రహ్మతరం గాదు. ఎవరి దగ్గిర వారి మాట. మనిషి కొక ధర. దేశంలో వున్న సామ్యం నమించుగా వీరి దగ్గర వుందని చెప్పవచ్చు, గాంధీటోపీ, ఖద్దరు లాల్చీ, వుందూరుఖద్దరుధోవతి ధరించి చీకటి వ్యాపారం. బహిరంగసభలలో “మహాజనులారా! బ్లాకు మార్కెట్లు నశించాలి” అని గంభీరోపన్యాసము. సామాన్యప్రజానీకమునకు జీవితావసర వస్తువులకు కరువు. భాగ్యవంతులకు, పెద్దవుద్యోగులకు జీవితావసర వస్తువులూ, విలాసవస్తువులు కూడా సమృద్ధి. తద్వారా మారుబేరవర్తకాలు. సామాన్య ప్రజకు అమ్మే వస్తువులు కేవలం మట్టే అని చెప్పాలి. “మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, తుదకు మట్టిలోనే కలసిపోయే యీ మనుష్యులకు మట్టియిస్తే యేమి?” అనే వేదాంతం వీరిలో గోచరిస్తోంది. కాబట్టి వీరికి కూడా సంపూర్ణంగా స్వతంత్రం వచ్చిందనే చెప్పాలి.

రాజకీయపక్షాల విషయం చూద్దాం. వీరు గాంధీమహాత్ముణ్ణి మొదలు నిరుపేదవరకూ చంపుటకూ, దోచుకొనుటకు, పరాభవించుటకు హక్కు సంపాయించుకున్నారు. కాని సాధ్యమైనంతవరకూ వీరు పరోక్షుమందేగాని ప్రత్యక్షంగా వుండరు. వీరికి కూడా స్వతంత్రం పూర్తిగా వచ్చినట్టే.

కార్మికుల సంగతి ఆలోచిద్దాం. తపాలాశాఖవారు, రైల్వేపనివారు, బస్సుపనివారు, ట్రాంపనివారు వొకమారే సమ్మెచేశారు. దాని వల్ల జనం చాలా బాధపడిపోయారు. సరుకులు వొకచోటినుంచి మరొకచోటికి చేరడానికి వీలు లేకపోయింది. అందువల్ల ఆహారపదార్థాల కొరతజిల్లాలవారు చాలా కష్టపడిపోయారు. ఉత్తరా లందలేదు. ఇవన్నీ యిలా వుండగా “పులిమీద పుట్ర” అన్నట్టు పాకీవారి సమ్మె ప్రారంభమైంది ఏ వీధిచూసినా పెంటపోగులతో నిండిపోయింది. కొద్దిరోజులకే దుర్వాసన ప్రారంభమైంది. కొంతమంది కాంగ్రెస్‌వారు, స్కౌట్లు పోలీసువారి సహాయంతో పై వూళ్లనుండి మనుష్యులను రప్పించి బాగులు చేయించారు. కొన్నివూళ్లలో సమ్మె చేసినవారు పట్టణ పరిశుభ్రతలో పాల్గొనేవారిని తన్నడంకూడా జరిగింది. ఇంతకీ జీతాలు చాలవని యీ రభస అంతాను. ఇంతవరకూ వస్తే

కాని యజమానులు దిగిరారు. ఏ ధర్మాత్ముల్లో మధ్యవర్తిత్వం వహించి సమ్మెచేసినవారి కోర్కెల నించుమించుగా తీర్చే సాధనంచూసి వారికీ వీరికీ రాజీ కుదిర్చి మళ్లీ యథాప్రకారంగా పనులు సాగేటట్టు చేశారు. సమ్మె చెయ్యడంద్వారా వారు కోరినవి నెరవేరడం జరిగింది అదే వారికి ఆయుధంలా పనిచేసింది. నో రుంటే ఊరు కాస్తుందికదండీ! అందుచేత వీరూ స్వతంత్రం పొందినవారిలో లెక్కే.

ఇతర జనాన్ని చూద్దాం. వంటవాళ్లు, పాలవాళ్లు, కూరలవాళ్లు, చాకళ్లు, విద్యాసంస్థలలోని విద్యార్థులకు స్వతంత్రం యెప్పుడూ వుండనేవుందికదా!

మనదేశ నాయకుల విషయం చూద్దాం. వీరిలో స్వతంత్రంవచ్చిన లక్షణా లేవీ కనపడ్డం లేదు. తప్పుచేసినవాళ్లని నాలుగు చీవాట్లు పెట్టడానికి వీల్లేదు. చీవాట్లెడితే “గాంధీ అనుయాయులమని పేరుపెట్టుకుని అంత అహంకారమా? చీవాట్లెడితే హింసపెట్టినట్టే. సత్యాహింసలను అక్షరాలా అమలుజరిపేవారిలా ప్రవర్తింపవచ్చునా?” అని అంటారు. అందుచేత “అమ్మా వూరుకోండి. బాబూ వూరుకోండి” అని బ్రతిమలాడి మంచిమాటలు వాళ్ల మనస్సుకి నచ్చచెప్పి, నిద్రాహారాలు లేకుండా, విధీవిరామంలేకుండా ప్రజలకోసం నానా బాధలు పడుతున్నారు. ఇంగ్లీషువారి పరిపాలనలో వాక్స్వాతంత్ర్యం లేకపోయినా మనదేశ నాయకులు స్వేచ్ఛగా ప్రభుత్వమును విమర్శించేవారు వారు జైళ్లకు పంపినాసరే. ఆనాడే వాక్స్వాతంత్ర్యం వుందని చెప్పాలి. ఇప్పుడు యేతగవారిని గురించీ పూర్తిగా విమర్శించడానికి వీల్లేదు. అల్లాగ చేస్తే దేశంలో అల్లరులు బయలుదేరుతాయని భయం. అందుచేత బాధాకరంగాని పద్ధతిలో మాట్లాడాలి. కొన్నికప్పిపుచ్చాలి. దీన్నిబట్టి మనదేశనాయకులకు స్వేచ్ఛా వాయువులు వీచే యీ సమయములో వాక్స్వాతంత్ర్యమే లేదని చెప్పాలి. పోనీ చేసే పనులలో స్వతంత్రం వుందేమో చూద్దాం. ఏదైనా వొక సంగతిని వొక విధంగా చెయడానికి యేర్పాటు చేసుకుంటే ఆ వుద్దేశ్యాన్ని అన్ని పార్టీలవారు విమర్శించి, యెదుర్కొంటారు. అందరికీ నచ్చే పద్ధతిగా చెయ్యమంటారు. అంతా తలోదారిగా వుంటారు. “లోకోభిన్నరుచిః” అన్న విషయం వీరి జ్ఞప్తియందున్నట్టు కనబడదు. వీరందరినీ కూడగట్టుకు రావాలి యే పనిచెయ్యడానికీ. ఇదంతాచూడగా మనదేశనాయకులకు వాక్స్వాతంత్ర్యంతోపాటు స్వతంత్రం కూడా లేదనే చెప్పాలి.

గృహిణుల విషయం పరిశీలిద్దాం ఇంతమంది సమ్మెలు చేసినా, మగవారు “వంటింట్లో ఆడవారిసమ్మె” అని కథలురాసినా మేం సమ్మె చెయ్యలేక పోయాం. అది మా అసమర్థతే అనాలి. వాళ్ల కున్న కట్టు మాకులేదు. అదీగాక మా జాతి అనాదినుండి సహనానికి అలవాటు పడ్డది. అందుచేత మా భారత మహిళలకు సమ్మె చెయ్యడం అవమానంగా తోస్తుంది.

సమ్మె చెయ్యనంతమాత్రాన గృహిణులకు సమస్త సదుపాయా లున్నాయనేందుకు వీల్లేదు. రోజురోజుల్లా వారు యింటిపనులలో తమ యావచ్ఛక్తీ వినియోగించి నిమగ్నులై పోతారు వారి స్వంతపనులకుకూడా తీరిక లేకుండా అంటే మరేం కావులెండి. కాలకృత్యాలు తీర్చుకోడం, భోజనం చెయ్యడమే సుమండి. ఆవేళకే యే అవాంతరమో వచ్చి పడుతుంది. పోనీ పై పనులకు నౌకర్లను, వంటకు మనిషిని పెట్టుకుందామన్నా యిల్లాలి ప్రాణానికి సుఖం మాత్రం సున్న. సొమ్ము వ్యయమవడమేగాని వొక్కళ్లూ సరిగ్గా వస్తేగా. ఏపని వాళ్లు రాకపోయినా వాళ్లు చేసేపని యిల్లాలి మీదేగా పడేది? వాళ్లు రానినాడు పనిచేసుకో

వాలి. వచ్చిననాడు వాళ్లని కనిపెట్టుకుని వుండాలి.

ఇవన్నీ కాక రేషనింగ్ అని గోధుమలు, బియ్యం యిస్తే వాటిని తినడానికి యోగ్యతగా చేసేటప్పటికి గృహిణుల ప్రాణాలు కడంటిపోయేవి. ఆహారపదార్థా లిచ్చారని సంతోషించడానికి బదులు స్త్రీలను బాధపెట్టడానికే యిలాటి విస్తున్నారు. ఇది శిక్షలాగ వుందని స్త్రీలు బాధపడ్డారు. ఇవన్నీ చూస్తే యిల్లాలిప్రకు స్వతంత్రం రాలేదనే విషయం తేటతెల్లమవుతోంది. “ఇదివరకు మాత్రం మీకు స్వతంత్రం వుందా యిప్పుడు లేదనుకునేందుకు?” అని మీ రడగవచ్చు. దేశంలో యెవరికీ స్వతంత్రం లేనిరోజుల్లో మాకూ లేకపోవడం భావ్యంగానే వుంది. కాని యిప్పుడు కూడా స్వతంత్రం లేకుండా వున్నామనే మా బాధ. అంటే మేం (గృహిణులం) పూర్తిగా అస్వతంత్రులమే.

నేడు ఆంధ్రరాష్ట్రం ఎందుకు?

(19 పేజీ తరువాయి)

కాకుండా అంతా కలిసి ముందుకుసాగి పని చేయాలె.

అయితే తమ బలహీనత మరొకరిమీద వేయడం సరికాదు. విశాలాంధ్రను సాధించడంచి విఫలమైనంతమాత్రాన విశాలాంధ్ర విఫలమైనదని పరితపించి ఫలితం లేదు. విశాలాంధ్రకు తక్కువ లాభంలేదన్నా సరికాదు. ఎపుడూ ఏ ఉద్యమము కూడా ఆయా అవకాశాలను సమన్వయపరుచుకొనియే సాగింపబడుతుంటవి. అటులే ఆంధ్రోద్యమం కూడా విశాలాంధ్ర వెన్వెంటనే సాధించలేకపోతే దానికి అవధులు పూర్తిచేయకూడదని ఎపుడూ లేదు. అది కార్యవాది లక్షణమని తలంచజాలను.

తమ బలహీనతకు ఇతరులను ఎర చేయడం వల్లనే ఈనాడిన్ని యిబ్బందులు వస్తున్నవి. డాక్టరు పట్టాభిగారిని రాష్ట్రం సాధింపమని కోరుతున్నది కూడా అందుకే. మీకు మద్రాసు విడుచుట సహజమైనదిగా తలుస్తే మీ బలాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని ఎందుకు నిర్మాణం అయేటట్లు చూడలేరు. భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రపతి అయినారు. అది సాధించనపుడు మీరు చేసిన వాగ్దానం ఏవిధంగా చెల్లింపు అయింది. అది సాధ్యంఅగుటకు అందరు సహాయపడలేదనకండి. అందరు ఆనాడు రాష్ట్రపతిగా ఎన్నుకోవడమే అందుకు నిదర్శనం. రాష్ట్రనిర్మాణానికి మీ యావచ్ఛక్తిని వినియోగించి వృథాఅయితే ఏమి చేయాలనో మీకే తెలుసు అంతా చేస్తానని దాటవేయడంవల్ల మీ బాధ్యత పూర్తిచేశారని తలంచజాలం. అవసరమైతే రాజీనామా యివ్వవలసిందే.

ఆంధ్రులంతా విశాలాంధ్రకు పునాదిగా రాష్ట్రాన్ని సాధించండి. రాష్ట్రవిభజనకొరకు మద్రాసులో తగాదాచేస్తారా? ఎవరితో? నాయకత్వంతోనా ప్రజలతోనా, మద్రాసు మాది అని ఉద్యమం సాగదీస్తే ప్రభుత్వంతో సరాసరి కాదు. అరవప్రజలతో సరాసరి అవుతుంది. అరవ ఆవేశపరులు కూడా అదేపనిచేస్తే ఏమవుతుంది. ఘర్షణ జరుగుతుంది. మరి భూమిలో, తిరువాన్కూరులోని తమిళ ప్రాంతంలో చేసినది జ్ఞప్తిలేదా అని తలుస్తారు కాబోలు. నిజం. ఫలితం యేమయింది. నాయక వర్గం గమనించింది. ఆగమన్నది. రాయబారాలు పంపింది. సమస్య పరిష్కారం అయిందా? సత్యాగ్రహం ఆంధ్రరాష్ట్రానికా, మద్రాసు నగరానికా? ఈ సత్యాగ్రహంకాంగ్రెస్ నాయకులు చేస్తారా? ఇది సామాన్యపాటకపు జనానికి పట్టిందికాదని అందరికి తెలిసిందే! మధ్యతరగతి జనానికి, రోజూ పత్రికచదివే పాఠకులకే తెలుసు.

• ఈనాడు ఆంధ్రరాష్ట్రనిర్మాణం వెనక పడ


దం అగ్రనాయకత్వానికి సంతోషం. ఉపజాతీయోద్యమంగా వ్యవహరింపబడుతున్న జాతీయోద్యమాలకు గొడ్డలిపెట్టు. అసలు జాతీయ భావపూరితంగా వుండడానికి బదులు జాతీయాహంకారంలోకి దిగిపోతుంది. ఆంధ్ర, తమిళ, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ ఉద్యమాలు జాతీయోద్యమాలుగా నడుచుటకు బదులు జాతీయ దురభిమానాలతో సాగుటకు ప్రారంభం కావడం అంటే అభివృద్ధి నిరోధకులచేతులలోకి ఈ ఆశయంతో కూడుకున్న జనం ఆవేశపూరితులుగా పోవడం సంభవిస్తుంది. దీని నరికట్టడం జాతీయోద్యమాల దృష్ట్యాను, ప్రజా ఉద్యమాల దృష్ట్యాను, ఆర్థిక, రాజకీయ, సాంఘిక పురోభివృద్ధి దృష్ట్యాను చాలా అవసరం. ఇది మంత్రివర్గాల వ్యవహారంలో వచ్చిన పరిష్కారం అవడంవల్ల, పరిష్కారం కాకుండడమే వారికి ఉపయోగం కనుక, ఒకవేళ వారి పేచీలు మరొక విధంగా పరిష్కారం అయితే దీనిని తలపెట్టవలసిన పనే ఉండదు కనుక ఈ పరిష్కారమనే సిద్ధాంతం చాలా ప్రమాదమయింది.

రాయలసీమ ప్రజానీకం, అటులే మిగిలిన భాగాలవారు తీవ్రంగా ఆలోచించాలె. నాయకుల పేచీలకు మనం గురికాకుండా వుండేటట్లు చూడాలె. ఇన్నాళ్లనుండి ఉమ్మడి రాష్ట్రంలో వున్నపుడు రాయలసీమ ఎంతగా అభివృద్ధి పొందిందో తేలిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి పొందలేమనేది తేలిపోయింది. అది అందరు అంగీకరించేదే! అయితే భవిష్యత్తులో అన్యాయం జరగదా. అంటే అందుకు అసలు సమస్య లాలోచించండి. పొలంలో పనిచేయని భూఖామందులనుండి సాగుచేసేవారికి స్వేచ్ఛ లభించినపుడే అధికోత్పత్తికి అవకాశం వుంది. అందరం కలిసి ఆలోచించితేనే వెనుకపడిన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని పనిచేస్తేనే, సమానాభివృద్ధి కవకాశం వుంటుంది. రాయలసీమ మినహా ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రరాష్ట్రం మినహా రాయలసీమాభివృద్ధి అసంభవం. పరిస్థితులన్నింటిని కార్యవాదులుగా యోచించండి.


మద్రాసు గొడవతో అసలు సమస్యను పరిష్కరించకండి. మద్రాసు ఆంధ్రరాష్ట్రంలో భాగం కాజాలదని 1947 అక్టోబరు 31 న గోక్లేహాలులో జరిగిన ఆంధ్ర నాయకుల సమావేశంలో చెప్పాను. ఆంధ్రమహాసభ తీవ్రంగా ఎదుర్కొన్నది నన్ను. 1948 ఏప్రిల్ సమత్లో వ్రాశాను. ఆనాటికి అంగీకారం కాలేదు. ఆవేశాలే కారణం. ఈనాటికన్నా కార్యవాదులు అంగీకరించడం సంతోషింపదగింది. నేనితరులకు పనిచేసిపెట్టడం లేదు. మద్రాసు వదలుకోమన్నందున డా॥ పట్టాభి మనిషినని, బెజవాడ సమావేశానికి హాజరైవందున రంగామనిషినని తలంచితే లాభంలేదు. మద్రాసు వదలుకోవడమే ఆంధ్రరాష్ట్ర సాధనకు మార్గమన్నవారితో కలిసి పనిచేశాను. నేను విశాలాంధ్రమనిషిని. దాని కార్యసాధనగా ఈనాడాంధ్రరాష్ట్రం కావాలెననేవాడిని. ఆంధ్రజీవితంలోని అనేక కష్టనష్టాల్లో భాగస్వామిగా ఆంధ్రప్రజా ఉద్యమాల బలాలు కొంతో గొప్పో అనుభవంలో అవగతం చేసుకున్నందువ - విశాలాంధ్రనిర్మాణానికి ఈనాడు ఆంధ్రరాష్ట్రసాధనే గమ్యం. అని తలంచవలసివచ్చింది. ఎవరేమి తలంచినా ఆంధ్రభాషాభివృద్ధికి ఆంధ్రరాష్ట్ర సాధనకు, ఆవేశాలతోగాని, గుడ్డిద్వేషాలతోగాని, అధికారాభిమానాలతోగాని సంబంధం లేకుండా ఆంధ్రప్రజానీకాన్ని అర్థిస్తున్నాను. అందరం కలిసి వాస్తవికపరిస్థితులను అవగతం చేసుకొని విశాలాంధ్ర నిర్మాణానికి ఆంధ్రరాష్ట్రం వెంటనే సాధించి భారతదేశంలో భాషాధారక జాతీయోద్యమాలకు పునాదులు వేయండి.

ప్రత్యేక న్యాయస్థానంలో

★ కాశిం రజ్వీ విచారణ ★



రజ్వీపై ఛార్జిపత్రం చదువుటతో విచారణ ప్రారంభమయింది. ప్రత్యేక న్యాయవిచారణ సంఘంలో జె. ఎ. పింటో (అధ్యక్షులు), అహమ్మద్ ఆలీఖాన్; జగన్నాథరావుగార్లు సభ్యులుగా ఉన్నారు.




రజ్వీతరఫున వాదించు డిఫెన్సు కౌన్సిలు సభ్యులు నవాబ్ అస్కార్ యార్ జంగ్ మొదలైనవారు న్యాయస్థానంలో ఆసీనులైవున్నారు.



రజ్వీతరఫున వాదించటానికి ఇంగ్లండునుండి వచ్చిన రాబర్ట్సు, జూనియర్ లెక్, ఎ. జె. మూర్ విచారణ ప్రారంభమవటానికి ముందు కోర్టుగదిలో సంభాషిస్తున్నారు.



కాశిం రజ్వీ కేసులో క్రౌన్ ప్రాసిక్యూటరుగా వ్యవహరిస్తున్న ఎతిరాజ్, హైదరాబాద్ అడ్వకేట్ జనరల్ శ్రీ ఖిండే, రజ్వీపై ప్రత్యేక న్యాయస్థానములో దాఖల్ చేసిన ఛార్జిషీటును తుదిసారి పరిశీలిస్తున్నప్పటి దృశ్యం.



ఈద్ పండుగ విందుసందర్భంలో గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి, యు. పి. ప్రధాని గోవిందవల్లభపంతు ఆజాదును అభినందిస్తున్న దృశ్యం.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.